మార్చి, 01-15, 2022
సంపుటి 02, సంచిక 08

తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక

మహిళాదినోత్సవ
ప్రత్యేక సంచిక



## అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు



# సరోజినీ నాయుడు

**(ఫిబ్రవరి 13, 1879 - మార్చి 2, 1949)**

భారత కోకిల (నైటింగేల్ ఆఫ్ ఇండియా)గా ప్రసిద్ధి చెందిన ఈమె స్వాతంత్ర్య సమరయోధురాలు, కవయిత్రి. సరోజినీ దేవి 1925 డిసెంబరులో కాన్పూరులో జరిగిన అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలకి తొలి మహిళా అధ్యక్షురాలు, స్వతంత్ర భారతదేశపు తొలి మహిళా గవర్నర్. హైదరాబాదు లోని గోల్డెన్ త్రెషోల్డ్ అనే పేరుతో గల ఆమె ఇంటిలో హైదరాబాద్ యూనివర్సిటీని నెలకొల్పారు. బెంగాలీయుల ఆడపడుచు, తెలుగు వారి కోడలు శ్రీమతి సరోజినీ నాయుడు. అఘోరనాథ్ ఛటోపాధ్యాయ, వరద సుందరీ దంపతులకు 1879 ఫిబ్రవరి 13న వారి ప్రథమ సంతానంగా జన్మించారు.


*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **TELANGANA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 3rd Floor, Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

# విషయ సూచిక




11 **ఆమెనే చివరి మజిలీ**ని ఓ చుక్కాని అని కవిత్వీకరించిన... **జవేరియా.**



21 రెక్కలు మొలిచి పంజరం విడిచిన స్త్రీ పక్షి కథ **వాణీ దేవులపల్లి** **ఉన్నది ఒకటే జిందగీ...**



35 **కొండపల్లి కవిత్వం** లోతులు చూపించిన **కె. వీణారెడ్డి**



29 **గంగరాజు సుశీల** గానమాధుర్యం లోతులు తెలిపిన వ్యాసం...



09 **ముస్లిం స్త్రీల గాయాల లోతు**ను చూసిన కథలపై **ఉషారాణి** విశ్లేషణ...



13 జీవితానికి కొత్త వసంతం రూపుదిద్దిన **వాసర చెట్ల జయంతి** కథ **నయాజిందగీ....**



25 దళిత చైతన్యం సహించలేని నిష్ఠూరం చిత్రించిన **గోగు శ్యామల** కథ **తెరేడిన పువ్వెంద...**

గిరిజన జీవితంలో ఫారెస్ట్ గార్డుగా వచ్చిన అధికారం కురిపించిన నిప్పులను చిత్రించిన **జ్వలిత** కథ **గుల్దస్తా**...పేజీ 39

**అమృతలత రచనామృతాన్ని** విశ్లేషించిన **రావుల కిరణ్మయి** వ్యాసం... పేజీ 31

ఉమ్మెత్త రసంతో చితికెక్కిన సతి అంటూ మహిళా దైన్యాన్ని చిత్రించిన **దేవనపల్లి వీణావాణి** కవిత... **నెలపొడుపు** పేజీ 38

**దు:ఖాన్ని ప్రతిబింబించే** అద్దం వైనం తెలిపిన **సరసిజ...** పేజీ 02

ఆమె పుప్పొడి రాగ శోభను ఆర్తిగా వర్ణించిన **ఆరుట్ల శ్రీదేవి** **చందమామ** కవిత... పేజీ 19

స్త్రీకి సహృదయతే శాపంగా మారిన విషాదం చిత్రించిన **నందగిరి ఇందిరాదేవి** నాటి కథ **'ఏకాకి'**... పేజీ 05

**సృష్టి పరిణామంలో స్త్రీని** వివరించిన **శుక్తిమతి...** పేజీ 17

**ఆమె నిరీక్షణ వాస్తవ ఫలితం** ప్రణవి అశరీర కవిత... పేజీ 20

స్త్రీ అస్తిత్వాన్ని గుర్తించమంటున్న **తుమ్మల కల్పనరెడ్డి** కవిత **పొత్తి కడుపు మీద కుట్ల గాట్లు...** పేజీ 24

జీవభాషలో సహజానుభూతులు తెలిపిన **పదునూరి రాజేశ్వరి** **వల్లనే వల్లనే** కథ.. పేజీ 28

**ఇంకా...**

సాహితీశిఖరం, సమాజం, పుస్తక పరిచయం, స్వీకారం.. మొదలైనవి...

# అ(క)న్నీటిని కడగబడును



పెనుగొండ సరసిజ, 73868 06499

లేవగానే ముఖం కంటే
ముందు అద్దాన్ని చూస్తాను.
ఎంత మలిపినా మరికొన్ని
మరకలు  మిగిలిపోతాయి.
అద్దం ఫక్కున నవ్వుతుంది.
మరకలు నావి కావు!
రాత్రంతా కార్చిన
నీ కన్నీటి చారికలవి! అంటుంది.
ఇక చాలు! చాలు! అంటుంది.
ఇక చాలించి చలువరాతి నేలను
చమక్కుమనిపించే పనిలో పడతాను.
బండలన్నీ మరకలతో భయపెడతాయి.
ఎక్కడోళ్లు అక్కడ బుద్ధిగా కూర్చుంటే
నీ కాళ్లే కునుకు తీయకుండా
మమ్మల్ని మసకబార్చాయంటాయి.
అవునంటూనే వాటిని ఆరనీయకుండానే
షరా మామూలుగా చక్కరొచ్చేట్టుగా చక్కర్లు కొడతాను.
ఇక బాత్ రూమ్‌లో కెళ్తాను.
మొండితనంతో మొండిమరకల
పని పడతాను.
పాడు చేయడం ఎందుకు?
పాట్లు పడ్డమెందుకని? ప్రశ్నిస్తాయి.
నేనా? అని నివ్వెర పోతాను..
ఎన్ని నిద్రపట్టని రాత్రులు బండబారిన మనుషుల కోసం
నీ చారెడో, బారెడో, కన్నీళ్లను మాపై చల్లిపోలేదు!?
అంటూనే చల్లిన నీళ్లతో బండలు కరిగిపోతాయి.
అనడానికి, అడగడానికో ఏమీలేక
అ(క)న్నీటిని కడగడానికి
గడియ వేసుకుంటాను.



సంపాదకీయం

తంగేడు

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

01-15 మార్చి, 2022

సంపుటి 02 సంచిక 09



శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్



డా॥ కాంచనపల్లి గో.రా.
అసోసియేట్ ఎడిటర్
9676096614

ఎడిటోరియల్ బోర్డ్ :
ఘనపురం దేవేందర్
రంగు నవీనాచారి

# మహిళాదినోత్సవం.. ఒక స్ఫూర్తి...

మార్చి 8న మళ్ళీ వస్తున్న మహిళా దినోత్సవం. ఉత్సవం కంటే ఇది మనలందరిని పునరాలోచనకు, ఆత్మవిమర్శకు నెట్టే ఒక అంశం లేక సాధనం అని భావించాలి. కాలచక్రం కొనసాగింపులో ఎన్నో మహిళాదినోత్సవాలు వస్తున్నాయి. వెడుతున్నాయి. దీనివల్ల మనిషి ఎంతస్ఫూర్తివంతుడౌతున్నాడనేది ఇక్కడ గమనించాల్సిన అవసరం ఉంది. స్త్రీవాదులుగా తమని ప్రకటించుకుంటున్న వ్యక్తుల వల్ల ఇది కొన్ని వర్గాలకు మాత్రమే పరిమితమౌతున్న వాదమా లేక స్పృహ లేక సామాజిక మూలాలల్లోకి వెళ్ళడానికి ప్రయత్నం జరుగుతున్నదా అనేది పరిశీలించాలి.

ఫెమినిజం ఒక అంతర్జాతీయవాదం. పురుషులకు ఉన్న హక్కులు అవకాశాలు స్త్రీలకు కూడా ఉండాలి. అన్ని కోణాలలో పురుషులు పొందుతున్న సదుపాయాలన్నీ స్త్రీలు కూడా పొందాలి. ఈ అంశం ప్రాతిపదికలుగా కలిగిన స్త్రీవాదం 1960లో పాశ్చాత్య దేశాల్లో విస్తృతంగా ప్రచారం అయింది. జండర్ మూలంగా రూపొందుతున్న అనేక వివక్షతలను, ఎక్స్ప్లాయిటేషన్ని, బట్టబయలు చేయడం, ఖండించడం, ప్రత్యామ్నాయాలను చూపడం ఈ వాదంలో ప్రధానమైన అంశం. 1841లోనే ఫ్యాక్టరీలలో పనిచేసే స్త్రీలు సామూహిక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించుకోవడం వలన 1866 తర్వాత స్త్రీ విముక్తి బృందాలు ఏర్పడి 1870లలో ఇంటి చాకిరికి జీతం ఉండాలని నినాదంతో ఉద్యమరూపం దాల్చింది. 1949లో ఫ్రెంచి రచయిత్రి 'సైమన్ డి బ్యువోయిర్' రచించిన 'ది సెకండ్ సెక్స్', 1963లో అమెరికన్ రచయిత్రి బెట్టి ఫ్రీడక్ వ్రాసిన ది ఫెమినైన్ మిస్టిక్ స్త్రీవాద ఉద్యమాన్ని ఉధృతం చేశాయి. స్త్రీవాద ఉద్యమం ప్రపంచవ్యాప్తంగా సామాజిక పోరాటంగా మొదలై 1970 నుండి నేటివరకు క్రమంగా సాహిత్యంలో ఒక చర్చనీయాంశంగా కొనసాగుతుంది.

ఇక తెలుగు సాహిత్య విషయానికి వస్తే స్త్రీ చైతన్యం ప్రాచీన కాలం నుండే కొనసాగింది. ఖడ్గతిక్కన భార్య చానమ్మ (13వ శతాబ్ది) గోన బుద్ధారెడ్డి కూతురు కుప్పాంబిక (13వ శతాబ్ది) (తొలి కవయిత్రి) మొదటి దశ స్త్రీ చైతన్యానికి సంకేతాలని చెప్పుకోవాలి. తాళ్ళపాక తిమ్మక్క (15వ శతాబ్ది), మొల్ల (16వ శతాబ్ది), శ్రీకృష్ణ దేవరాయల కూతురు మోహనాంగి, రంగాజమ్మ (17వ శతాబ్ది), ముద్దుపళని (18వ శతాబ్ది), తరిగొండ వెంగమాంబ (19వ శతాబ్ది) మొదలైన వాళ్ళంతా తెలుగు సాహిత్యంలో పేర్కొనదగ్గ కవయిత్రులు. వీళ్ళందరిలో స్త్రీ దృక్పథం లేకపోయినా ఆ కాలంలో స్త్రీలుగా సాహిత్యరంగంలోకి వచ్చిన వీరి చైతన్యం తప్పక గుర్తించాలి.

ఆధునిక తెలుగు సాహిత్యంలో సి. వేదవతి, సావిత్రి, ఓల్గా, కొండెపూడి నిర్మల, పాటిబండ్ల రజని, ఘంటసాల నిర్మల లాంటి కవయిత్రులెందరో ఈ వాదాన్ని సుసంపన్నం చేశారు. 1970 నుండి తెలుగు సాహిత్యంలో స్త్రీ చైతన్యం నుండి స్త్రీవాదంగా పరిణామం చెందిన దశ కనిపిస్తుంది.

తొలి రోజులలో స్త్రీవాదం మార్క్సిస్టు స్పృహతో వచ్చే సాహిత్యంగానే కొనసాగింది. తరువాత క్రమంగా మార్క్సిస్టు దోరణి కూడా స్త్రీ సమస్యకు సరైన పరిష్కారం కాదనే స్పృహ మొదలైంది. తరువాత స్త్రీ తన అనుభవాన్ని తన గొంతుతో మాట్లాడడమే ప్రధానాంశమైంది. ఈ విధంగా స్త్రీలు తమ అనుభవాలను రాసే సాహిత్యమే స్త్రీవాద సాహిత్యమైంది.

ఒక కవిత్వంలానే కాకుండా కథ, నవల, విమర్శ మొదలైన ఇతర ప్రక్రియల్లోనూ నేడు స్త్రీవాద గొంతుకలు బలంగా కొనసాగుతున్నాయి.

ఇక తెలంగాణ సాహిత్య పరిణామాన్ని గమనిస్తే ఇక్కడి స్త్రీవాదంలో కొన్ని తేడాలు కనబడతాయి. ఇంకా తెలంగాణ దళిత స్త్రీ అటు తెలంగాణ పోరాటం, ఇటు కుల వివక్ష దానితోనే జండర్ వివక్షతో కూడా పోరాడవలసిన స్థితిని మనం చూశాం.

ఎన్ని పరిణామాలు వచ్చినా జరుగుతున్న అత్యాచారాలను, అన్ని దశలలో ఇప్పటికీ జరుగుతున్న వివక్షను చూస్తే నిరాశ కలుగుతుంది. అందరూ విద్యావంతులై ఉదాత్త పౌర నిర్మాణం జరిగితేనే ఇలాంటి వివక్షలకు తెరపడుతుంది. మనమూ మన ప్రయత్నమూ అనివార్యంగా కొనసాగించాలనే సోయితో ఈ చిరు ప్రయత్నం.

సహకరించిన సృజనకారులకు కృతజ్ఞతలు.

జై తెలంగాణ, జై జాగృతి.

కవిత

# పొగసూరిన వసంతం..!



**నాంపల్లి సుజాత, 98480 59893**

ఆమెకూ ఉంటాయి
కొన్ని పురాజ్ఞాపకాలు
అమ్మ కడుపున
ఉమ్మనీటిన ఈదినప్పటి జాడలు
వొద్దు వొద్దని
రావొద్దని వారించినా
వచ్చి వాలిన చేదు నీడలు

ఆమెకూ ఉంటాయి
పుట్టినప్పటి పేర్లూ ఇంటి పేర్లూ
కానవ్వి ఎప్పుడెవ్వరు చేరిపేసి
యెవ్వి తగిలిస్తరో తెలియని
సందిగ్ధ సందేహ సంధ్యలు
ఆమెకూ ఉంటుంది బాల్యం
కానది తడిమి తడిమి చూసుకునే
నెమిలీక కాదు
గడియ గడియకూ గుచ్చుకునే బొడిగరాళ్ల తొవ్వ

ఆమెకూ ఉంటాయి అచ్చరాలు
కానవ్వి పాశిపనీ దాశిపనీ అయినంకే
ఏరుకునే అత్తెసరు సదువులు
ఉజ్జోగాలకో ఊళ్లేలేందుకో కాదు
కారెట మందం గీసుకునే గీతలు..!
ఆమెకు ఉంటాయి గాథలు
కానవ్వి దాసుక మురిసే తాజ్మహల్లు కావు
మరచిపోదామన్నా
మనసున సలిపే నెత్తుటి గాయాలు

ఆమెకూ ఉంటుంది ప్రపంచం
కానది ఎవ్వరూ పంచుకోని పొగసూరిన వసంతం
తరాలనుంచీ యుగాలనుంచీ
అంటిపెట్టుకు వచ్చే వంటింటి వారసత్వబంధం

అణగారి విసిగి వేసారిన
ఆమెకూ ఉందిప్పుడు ఎంచుకునే ఇచ్ఛ
అందరిలా ఆకాశాన విహరించాలనే స్వేచ్ఛ
అందుకే.. కొత్తసిరాతో
లిఖించుకుంటోంది తనదైన పుస్తకాన్ని
పాతపుటలను చేరిపేసి..!

నాటి కథ

# ఏకాకి

ప్రేమ-పెళ్ళి ఏకం కానపుడు కలిగిన ఫలితం...



నందగిరి ఇందిరాదేవి

ఆ అమ్మాయి ఈ ప్రపంచానికి సంబంధించని వాతావరణంలో పెరిగింది. ప్రపంచంలో ఉండే కుళ్లు మోసం ఏమీ తెలియనియ్యకుండా పెంచారు ఆమె తలిదండ్రులు.

కొందరుంటారు తమ పిల్లలను అవతలికి కదలనియ్యక ఇంకోళ్ళతో కలిస్తే చెడిపోతారని ఎప్పుడూ అతి జాగ్రత్తగా ఇంట్లోనే మూసిపెట్టుకొనే తలిదండ్రులు. బళ్లోకి కూడా సరిగ్గా పంతులు వచ్చాక పంపటం, పంతులు పోగానే పిల్చుకురావటం, అట్లాంటి పిల్లలు తన్నులు తినటంలోని రోషంకాని తన్నటంలోని హాయిని అనుభవించకుండా పెరుగుతారు. అతి అమాయికంగా మంచిగుణాలన్ని కలిగివుంటూ, కాని అనుభవంలోకి వచ్చేటప్పటికి చెలాకితనం ఏమీలేక ప్రపంచాన్ని ఎదురుకోలేక బాధపడతారు.

ఆ అమ్మాయి తండ్రి వ్యవసాయం చూసుకునేవాడు. కాస్త పాడిపంట ఓ రకంగా ఉన్నవాళ్ళే గనుక తల్లికి పాలు తోడెయ్యటం, మజ్జిగ చిలకటం, వెన్న తియ్యటం, వంటవార్పులతోనే సరిపోయ్యేది. వాళ్ళకుపై ప్రపంచంతో సంబంధమేలేదు. దేవుడిచ్చిన పొలంతో బతుకుతూ ఒకరిజోలి అక్కర లేకుండ ఆ భారత భాగవతాలతో కాలక్షేపం చేసేవాళ్లు తీరికసమయాల్లో.

పక్కయింటి వితంతు అమ్మాయి దీక్షితులుగారి అల్లుడితో లేచిపోయిన సంగతి ఊరంతా పాక్కిపోయిన తరువాత పిల్లలు ఎవ్వరూ లేకుండా చూసి "ఆ అమ్మాయి సంగతి విన్నారా?" అనేది తల్లి ఉండబట్టలేక.

"పోనిద్దూ మనకెందుకు" అనేవాడు తండ్రి. చెడిపోవటానికి అట్లాంటివార్త వినటమే చాలునన్నంత భయంతో అది పైకి రానీయకుండా అణచేసేవాడతను.

ఇట్లాంటి తలిదండ్రుల మధ్య పెరిగింది ఆ అమ్మాయి వెంకటనరసమ్మ.

వెంకటనరసమ్మకు పెళ్ళియీడు వొచ్చిందని బడి మాన్పించేసారు. ఇంట్లోనే కావ్యాలు సాధన చేయించేవాడు తండ్రి. కాస్త బుద్ధి తెలిసినాకొద్ది ఆమె తనకు కాబొయ్యే భర్తను ఊహించుకునేది. రామాయణం చదివినప్పుడల్లా రాముడి లాంటి ఏకపత్నీవ్రతుడయిన భర్త లభించాలని కోరుకునేది. అట్లాంటివాడి మహిమ తెలియక రాముడి పొందుకోరి వచ్చిన శూర్పణఖకు అయిన శాస్తిని మళ్ళీమళ్ళీ చదివేది. నలదమయంతుల కథ చదివి వాళ్ళ ప్రేమానురాగాలు వాళ్ళ విరహం తలంచి తల్లడిల్లేది. కిరాతకుణ్ణి భస్మంచేసిన దమయంతి పాతివ్రత్య మహిమను ఆదర్శంగా ఉంచుకునేది.

వెంకటనరసమ్మ పెళ్ళి సందర్భంలో ఒకరిని దేహి అనకుండా నిజదార సుతోదర పోషణార్థం హాలికుడుగా బతకటం కన్నా కాస్త రెండు ఇంగ్లీషు ముక్కలు చదివి, సూటు దరించి పట్నవాసంలో గులాంగిరీ చేసి సంపాయించే ఏ ముప్పయి రూపాయిల గుమస్తా అయినాసరే, తమకంటే గొప్పవాడుగా తలంచే ప్రపంచతత్వానికి శాస్త్రిగారు కూడా లొంగిపొయ్యారు.

కాలేజి చదువు చదివి ఓ మోస్తరుగా పట్నవాసంలో సంపాదించుకుంటున్న రామారావు స్థిరపడ్డాడు వెంకట నరసమ్మకు. కట్నాలు కానుకలతోసహా పెళ్ళి జరిగిపోయింది.

2

వెంకటనరసమ్మ కాపరానికి వచ్చిన తరువాత రామారావుకు వేతనం కూడా వృద్ధి అయింది. గట్టిసిగ, ముక్కు పుడకలు, మొహం నిండా పసుపు, పెద్ద కుంకుమబొట్టు, కాళ్ళకు పట్టాలు, వేళ్ళకు మట్టెలు పెట్టుకునే నరసమ్మ సహజంగా అందమయింది. కాబట్టి పట్నవాసానికి తగిన అలంకరణాలతో భర్త అభిరుచి కనుగుణంగా వేషభాషలను మార్చు కోగలిగింది. భర్తకు ప్రతివిషయంలో అనుకూలంగా అనురాగంగా ఉండేది. ఆమెకు భర్త అపరదైవం. తల్లి దండ్రి గురుడు దైవం అంతా అతనే. తనకు వ్యక్తిత్వం కాని ప్రత్యేకత్వం కాని యేమీ లేదు. అతని కిష్టమయిన రంగుల్లోనే

చీరలు కట్టేది. చివరికి రుచుల్లో కూడా అతనికిష్టమయిన గుమ్మడికాయ ఆమెకు తీపి. అతనికిష్టం కాని కాకరకాయ ఆమెకు చేదే. అతను ఆఫీసు నుండి రావటం ఆలస్యమవుతే ఎన్నో అపాయాలను ఊహించుకుంటూ వీధి కిటికిలో నిలబడి చూచేది అతను వచ్చేదాకా. రాగానే “అమ్మయ్యా వచ్చారా! ఎంత భయపడ్డాను!” అనేది. అతను విడిచిన కోటును వంకెకు తగిలిస్తూ ముద్దుపెట్టుకునేది హృదయభారం తగ్గేటట్టు. “ఆఁ రాకపోతే నన్నెవరన్నా పెళ్ళిచేసుకుపోతారా?” అని ఎగతాళి చేసేవాడు రామారావు ఆమె ఆదుర్దాను.

రామారావు కూడా ప్రేమగానే ఉండే వాడు ఆమెతో. దయగానే మాట్లాడేవాడు. అప్పుడప్పుడు సినిమాలకు తీసికెళ్ళేవాడు వెంకటనరసమ్మను. మైరావణ, భూకైలాసం, స్వప్నసుందరి లాంటి వాటికి ఆమె రుచికి అవ్వే సరిపడతాయని. వేషమంటే మార్చుకో గలిగింది కాని అభిరుచులెల్లా మారతాయి! ఆమెకు అదే పదివేలు. భర్త ఔదార్యాన్ని మనసులో కొనియాడుకుంటూ భోజనాలు చేస్తున్న ప్పుడు తాను చూసివచ్చిన సినిమాలను డిస్కస్ చేసేది. బ్రహ్మ, విష్ణు మహేశ్వరుల డ్యూటీలు వాళ్ళ ప్రతాపాలు, వాళ్ళ మధ్యన నారదుని చాకచక్యం మొదల యినవి. నారదుడు సినిమాలో ఏ సహాయంలేకుండా అమాంతం ఆకాశం నుంచి చిరుతగజ్జెలతో సహా దిగిరావటం మననం చేసుకుని “నిజంగానండీ! బతికుండగానే స్వర్గానికి వెళ్ళేవాళ్ళు పుణ్యాత్ములయినవాళ్ళు మహిమ అదంతా” అనేది. ఆమెను కాంట్రడిక్టు చేయకుండా ఆమె అమాయికానికి నవ్వుకునేవాడు రామారావు.

రోజులు కులాసాగానే గడిచిపోతున్నాయి. కాని రామారావు ఆలస్యంగా రావటం మాత్రం కాస్త తగాదాకు కారణమయ్యేది. సాయంకాలం ఆలస్యంగావచ్చి కాస్త ఏదయినా నోటగొట్టుకొని మళ్ళీ రాత్రిదాకా రాక పోవటాన్ని చూచి వెంకటనరసమ్మ చాలా ఆందోళనపడేది. చీకట్లో అంత పొద్దుపొయ్యేదాకా ఉండక తొందరగా రమ్మనేది రోజు. కాని వేతనం వృద్ధి అయినందువల్ల పనికూడా అట్లాగే చేయాల్సివుంటుంది- అని నచ్చ చెప్పేవాడు రామారావు. తమ భర్తలు ఏం పనిచేస్తారో, ఎంతజీతం దొరుకుతుందో ఏమీ తెలియని ముగ్ధల్లో జమ అయిన వెంకటనరసమ్మకు ఆ పట్టింపు అంతగా లేకపోయింది.

3

ఒకరోజు ఒక కుర్రాడు చీటి తెచ్చాడు రామారావుకియ్యమని. అది చూసుకుని అగ్గి అయిపోయింది. కోపంతో వొణికి పోయింది. ఏదో ఊహించరాని ఉపద్రవం వచ్చినట్టు బాధపడసాగింది. రామారావు రాగానే ఆ చీటి కాస్త అతనిమీద పడేసి తనకేదో పెద్ద అన్యాయం జరిగినట్టు గదిలోకి వెళ్ళి ఏడవటం మొదలుపెట్టింది.

రామారావు చీటీ చూసుకున్నాడు. తెలివయినవాడు కాబట్టి చీటి మడచి జేబులో పెట్టుకుని ఆమెను సముదాయించటానికి వెళ్ళాడు గదిలోకి. ఏడుస్తున్న ఆమెను లేవనెత్తి తన చేతుల్లోకి వేసుకుని ప్రేమగా లాలిస్తూ.

“చూడు నరుసూ, ఈ కాస్తకే నువ్విట్లా గోలపెడితే యెట్లాచెప్పు, ఆమె చాలా మంచిమనిషి. నీకు వీళ్ళందరితో కలవటం ఇష్టం ఉండదని నిన్ను తీసికెళ్ళలేదు. ఇట్లాంటి స్నేహితులు ఇంకెంతమంది ఉన్నారో తెలుసా నాకు. ఆమె నాకు చాలారోజులబట్టి పరిచయం. అందులో తప్పేముంది చెప్పు! ఉత్త పిచ్చిపిల్లవి! కావలిస్తే నిన్నుకూడా తీసికెడతాను, సాయంకాలం” అన్నాడు.

మంచు కరిగినట్టు కరిగింది నరసమ్మ హృదయం అతని మంచి మాటలకు. అతనిమీద అనుమానపడ్డందుకు నిందించుకుంటూ తక్షణం లేచి పనిలో ప్రవేశించింది.

★ ★ ★

లీలావతి గొప్పయింటి యిల్లాలు. కాస్త చదువు సంస్కారాలు గల మనిషి. ఆమె వయసుమీరిన భర్త ఆమెకు మంచి వయసు వచ్చేటప్పటికి కావలసినంత ఆస్తి వొదిలిపెట్టి చనిపోయినాడు. ఒక్కొక్కరికి ఒక్కొక్కరకపు ఆదర్శం ఉంటుంది. కొందరికి అస్తమానం ప్రయాణాలు చేయాలని వుంటుంది. కొందరికి బాగా డబ్బుకూడబెట్టాలని ఉంటుంది. కొందరికి రకరకాల పిండివంటలు తినటంలో అభిరుచి, అట్లాగే లీలావతికి తాను తినటంలో కంటే ఇతరులకు పెట్టడంలో



ఆమెకు అమితానందం. ఆమె జీవితంలో ఆమెను అందరూ గొప్పచేసి మంచి అనాలని ఆమె ఆదర్శం.

ఆమె ఇంట్లో ఒక్కర్తే అయినా ఇంటినిండా వచ్చిపొయ్యేచుట్టాలు, ఎక్కణ్ణుంచో బంధుత్వం కలుపుకున్న బీద విద్యార్థులు, నౌకర్లు, చాకర్లతో నిండి వుండేది ఆమె యిల్లు. ఆమె తన ప్రాపకంలో ఉన్నవాళ్ళందరికి అన్నిరకాల సౌకర్యాలు కలిగించి సంతోషించేది. కాస్త చదువు సంస్కారాలుగల మనిషి కాబట్టి స్నేహితులు కూడా చాలా ప్రేమించేవాళ్ళు ఆమెను. మగవాళ్ళు కాని ఆడవాళ్ళుకాని అందరితో చాలా కులాసాగా ఉండేది. తన యిల్లు తాను ఆదరణకు (Hospitality)కి పేరుపొందాలని ఆమె ఆశయం. ఆమె కొద్దో గొప్పో దానం పంపని ప్రజాసంస్థ ఒక్కటీ లేదు. అంతా ఆమెను "ఓహో" అని పొగిడిపోస్తే ఆమె పొందే హాయి సంతోషం కోసం ఆమె తన డబ్బును ఎంతయినా వెనుదీయకుండా ఖర్చు పెట్టేది. ఆమె ఈ మంచి పేరుకోసం ఎన్నోసార్లు తనకు ఇష్టంలేని వాళ్లతో మాట్లాడాల్సివచ్చేది. తనకు నమ్మకం లేకపోయినా సంవత్సరానికోసారి వ్రతాలుకూడా చేయించి బ్రాహ్మలకు భక్తిగా ప్రణమిల్లి సంభావనలు ఇచ్చేంత విపరీతం వరకు పెరిగిపోయింది.

సాయంకాలం కాగానే వెంకటనరసమ్మ రామారావు లీలావతి యింటికి వెళ్ళారు. ఆమె యింటి ముందరి చిన్న గేటులోపల రకరకాల పూలమొక్కలు, గులాబీలు, క్రోటానులు ఎంతో అందంగా ఉన్నాయి. లోపల తలుపు ముందర కూర్చుని ఉన్న వాళ్ళ "రోజీ" కొత్తవ్యక్తిని చూడటంతో "భౌ" మన్నది. రామారావు "రోజీ రోజీ" అని పిలవటంతో తోక ఆడించుకుంటూ వెళ్ళమన్నట్టు ఊరుకున్నది. గరాజు దగ్గర కబుర్లాడుతున్న వాళ్ల డ్రైవరును "అక్క వున్నారా?" అని అడిగాడు రామారావు.

వెంకటనరసమ్మ ఈ వరుసను తృప్తిగా విన్నది. లీలావతి అందరికీ అక్కే. ఆమెకంటే పెద్దవాళ్ళు కూడా ఆమెను అక్క అనే పిలుస్తారు. అది ఆమె పట్ల

**సాయంకాలం కాగానే వెంకటనరసమ్మ రామారావు లీలావతి యింటికి వెళ్ళారు. ఆమె యింటి ముందరి చిన్న గేటులోపల రకరకాల పూలమొక్కలు, గులాబీలు, క్రోటానులు ఎంతో అందంగా ఉన్నాయి. లోపల తలుపు ముందర కూర్చుని ఉన్న వాళ్ళ "రోజీ" కొత్తవ్యక్తిని చూడటంతో "భౌ" మన్నది. రామారావు "రోజీ రోజీ" అని పిలవటంతో తోక ఆడించుకుంటూ వెళ్ళమన్నట్టు ఊరుకున్నది.**

గౌరవవాచకంగా ఉపయోగపడేది. ఉన్నారని చెప్పాడు. వరండాలోంచి హాలులోకిదోవ. అంతా విలువయిన ఫర్నిచరుతో ఫర్నిషుచేసి ఉన్నది.

ఆమె కింద లేకపోవటం మూలాన సరాసరి మేడమీదికి వెళ్లాడు. మేడమీద సోఫాలో ఒరిగి కూర్చుని ఆమె రేడియో పాట వింటోంది. ఆ యింటి అలంకారం, శోభ, నాజూకుదనం, అంతా చాలా fine taste గల మనిషిలాగా కనబడు తోంది. మెట్లమీదనుండి రామారావును చూడగానే ఏదో కొత్త ఉత్సాహం పుట్టుకొచ్చినట్లు లేడిపిల్లలాగా చంగున గంతేసి నిలబడి అతనిని చిరునవ్వుతో ఆహ్వానించింది. కాని రామారావు వెనకాల నిలబడిన ఆ కొత్తవ్యక్తిని చూసి కాస్త బొమముడితో చప్పున వెనక్కు తగ్గింది. మళ్ళా మామూలు చిరునవ్వుతో "యెవరు రామం! ఈ అమ్మాయి?" అని అడిగింది.

లోపలికిరండని ఆమెను కూడా రమ్మంటూ రామం అంటూ అంత చనువుగా ఆమెపిలవటం వెంకట నరసమ్మ గమనించింది.

తన పోషణలో ఉన్న ఒక కాలేజీ విద్యార్థి ద్వారా పరిచయమయ్యాడు రామారావు లీలావతికి. రానురాను అతని కళాభిరుచి సారస్వతాభిరుచి ఆమెను ఆకర్షించాయి. ఎంతో కులాసాగా ఎన్నో విషయాలు వాదించుకునేటంత పరిచయులు అయ్యారు. తనతో సమంగా వాదించగలిగిన ఆమె చాతుర్యాన్ని ఆశ్చర్యంగా పొగిడేవాడు. రామారావు. ఆమె అతని లలిత విమర్శనను, నూతన సమస్యలను సాధించగలిగే మేధాశక్తిని మెచ్చుకునేది. రామారావు ఏకారణంచేత నయితేనేమి లీలావతి హృదయంలో ప్రత్యేకస్థానం ఏర్పరచుకున్నాడు. కాలేజీ రోజుల్లో డబ్బులేక అవస్థపడుతుంటే లీలావతిచేసిన సహాయాన్ని పొందటం మర్యాదకు విరుద్ధం అని రామారావు అనుకోలేదు. అందరికి ఇచ్చినట్టు మంచిపేరు కోసం ఇస్తున్నానని లీలావతి అనుకోలేదు.

రామారావు ఆమె చెరొక సోఫాలో కూర్చున్నారు. "ఈమె నా భార్య. నీకు చూపాలని తీసుకొచ్చాను" అన్నాడు రామారావు వెంకటనరస్మను చూపిస్తూ.

"అట్లాగా" అన్నది లీలావతి. "కూర్చొండి" అంది వెంకట నరసమ్మను చూసి.

వెంకటనరసమ్మ కూడా కూర్చున్నది కుర్చీలో. రామారావు లేచి రేడియోదగ్గర కూర్చున్నాడు.

లీలావతి వెంకటనరసమ్మతో "మీ తల్లి వాళ్ళు ఏవూరు? యెంతమంది అక్కా చెల్లెల్లు?" అంటూ మానర్సుకు విరుద్ధం కాకుండా మాట్లాడింది.

రామారావు ప్రోగ్రాం మార్చాడు. ప్రైంమినిస్టరుగారి ఉపన్యాసం అవుతోంది. రామారావు లీలావతి శ్రద్ధగా వింటోంటే వెంకటనరసమ్మ గదిలోని ఫోటోలను, కిటికి దగ్గర పెట్టిన క్రోటన్లను, క్రింద పరచిన తివాచీలను పరీక్షగా చూస్తోంది.

టీ పట్టుకొచ్చాడు వంటమనిషి కాసేపయాక. వెంకటనరసమ్మ మోహమాటపడితే తీసుకోమ్మని బలవంత పెట్టింది లీలావతి. ఆమె తన లిస్టులో నుండి వెంకటనరసమ్మను పోనియ్యలేదు. ఆమాట ఈమాట మాట్లాడి రాత్రి భోజనానికి ఇద్దరినీ ఆపింది. వెళ్ళేప్పుడు మర్యాదకోసం అప్పుడప్పుడు వస్తూవుండ మని అన్నది వెంకట నరసమ్మను ఉద్దేశిస్తూ. ఆమె రూపం, ఆమెమాట,

తనయెడల ఆమెప్రవర్తన, ఆమెమీద కలిగిన దురభిప్రాయం నిశ్శేషంగా మాయమైపోయింది.

ఇంటికి వెడుతూ ఆమె గుణగణాలను ఇంకా పొగడుతూ ఆమె డబ్బంతా మందే తినిపోతారని చెప్పుతూ ఒకసారి జబ్బు పడితే యెవ్వరూ ఆదుకోలేదని తనే రాత్రింబగళ్లు కనిపెట్టుకు కాచున్నానని చెపితే సానుభూతితో కొట్టుకుంది ఆమె హృదయం.

4

మనసులో వున్నదున్నట్టు చెప్పక చెప్పినట్టు చేయని ప్రపంచాన్ని యెరుగదు వెంకటనరసమ్మ. తెల్లటివన్ని పాలేనని అనుకునే వెర్రిబాగుల వెంకటనరసమ్మ లీలావతి పిలిచిందే తడవుగా తరచుగా వెళ్లేది వాళ్ళ యింటికి. లీలావతికి అది భారంగా ఉన్నప్పటికీ ఏమంటుంది! రావద్దని అనగలదా! రామారావు తీరిక సమయాల్లో తాను తయారయ్యేది వెంకట నరసమ్మ. ఆ వూళ్ళో ఆమెకు స్నేహితులు యెవరూ లేనందువల్ల తన తీరిక సమయంలో ఆమెకూడా లీలావతి దగ్గరకు రావటం ఇష్టంలేక, ఆమెను వొద్దనలేక తాను వెళ్లటమే మానుకున్నాడు రామారావు.

లీలావతికి రామారావు రాకపోవటం బాధగా వున్నా వెంకటనరసమ్మతో మంచి మాటాడక తప్పేది కాదు. పైగా ఆమె అమాయికానికి జాలిపడుతూ తాను ఆమెకు ద్రోహం చేస్తున్నానని జాలిపడేది.

**ఆమె రాయబారాన్ని బరువు హృదయంతో అందుకునేవాడు రామారావు. ఏం చేస్తాడు. తనమీద పెద్ద అనుమాన పడకుండా ఒక్కసారి పొరపాటు చేసేటప్పటికి అది ఇంత ప్రమాదకరంగా పరిణమించింది. వెంకటనరసమ్మకు తమ సంబంధం ఏమని చెపుతాడు? ఆమె తనను లీలావతిని కూడా ఏకంగా ప్రేమిస్తున్నది.**

లీలావతి మృదుభాషణవల్ల మొహ మాట ప్రవర్తనవల్ల ఆమెమీది గౌరవం హెచ్చుసాగింది వెంకట నరసమ్మకు.

లీలావతికి ఇది తీరని సమస్య అయింది. విసుగెత్తి రామారావును మరచి పోలేక ధైర్యంచేసి వెంకట నరసమ్మతోనే కబురంపేది "అక్కను మరచిపోయేడు రామం" అని. ఆమె రాయబారాన్ని బరువు హృదయంతో అందుకునేవాడు రామారావు. ఏం చేస్తాడు. తనమీద పెద్ద అనుమాన పడకుండా ఒక్కసారి పొరపాటు చేసేటప్పటికి అది ఇంత ప్రమాదకరంగా పరిణమించింది. వెంకటనరసమ్మకు తమ సంబంధం ఏమని చెపుతాడు? ఆమె తనను లీలావతిని కూడా ఏకంగా ప్రేమిస్తున్నది. ఆ సంబంధం వదల్చుకోలేదు. ఎటూతోచక ఏమీ పాలుపోక కొంపలోనే పడివుండేవాడు రామారావు, ఆలస్యంగా రాక పోవటాన్ని చూచి అప్పటల్లే పనిలేదేమో ననుకునేది వెంకటనరసమ్మ.

మంచి పేరుకోసం సహించగలిగిన వ్యక్తుల్లో జమకాక వెంకట నరసమ్మ లీలావతికి అతి సున్నితంగా గొప్ప గాయంచేసి బాధ పెట్టింది. ఆమె ఒంటరి జీవితంలోని కులాసాగా గడిపే కొన్ని ఘడియలుకూడా దూరమయినాయి. ఎన్నిసార్లు చెప్పిపంపినా రామారావు రాడు. వచ్చినా సతీసమేతంగా. అతని మెడకుపడి తన ఉబుసును వెల్లగొట్టుకుందామంటే అవకాశం లేకుండా వెంకటనరసమ్మకూడా కూడా రావటంవల్ల తనను అనుమానించిందేమో నని అపోహపడేది. అట్లాంటి మనిషి అయితే మళ్ళీ తన గుమ్మం తొక్కుతుందా? పండంటి వాళ్ల సంసారంలో తాను నిప్పులు వోయటం ఎంత అన్యాయం?

ఏమయినా సరే రామారావును పూర్తిగా మరచిపోవటానికి నిశ్చయం చేసుకున్నది. వెంకటనరసమ్మకు అటు రామరావు గోలకాని. ఇటు లీలావతి గోలకాని యేమీ తెలియవు.

లీలావతికి అదివరకున్న హిస్టీరియా మళ్ళీ ఆరంభమయింది. వెంకటనరసమ్మ ఏ నిమిషాన ఇంటికి వెళ్ళేదో కాని ఆమె పడక కనిపెట్టుకుని సేవచేస్తోంది. రామారావు సర్క్యూటునుండి అప్పుడే వచ్చాడు. వెంకటనరసమ్మ ఇంకా నిద్రలేవక ముందే ఒక కుర్రాడు చీటీ తెచ్చాడు.

నారామం, నువ్వు ఒక్కడివే రా. ఇవి నా చివర ఘడియలు. నీ ముద్దు రుచిలో, నీ ఆలింగన సౌఖ్యంలో శాశ్వతంగా నిద్రపోతాను.

మీ కిద్దరికీ శుభమగుగాక !

నీ లీలా.

రామరావు చీటీ చూసుకుని కంగారుపడి ఎట్లు వున్న మనిషి అట్లా పరిగెత్తాడు. లీలావతి చనిపోయి వారం రోజులయింది. వెంకటనరసమ్మకు ఒక ఆప్తబంధువురాలు పోయినట్టు ఉన్నది. ఒంటరిగా కూర్చొని ఆమెకోసం యెలుగెత్తి యేడ్చేది. రామారావు మొగవాడు కాబట్టి పొంగకుండా ఉన్నాడు. లీలావతి తన ఆస్తి అంతా రామారావు పరం చేసింది.

రామారావు ఆమె చనిపోయిన దగ్గరనుండి వింతమనిషి అయ్యాడు. తనే ఆమె చావుకు కారణమయ్యానని బాధపడసాగాడు. ఆఫీసుకు వెళ్ళటం పనులు చూసుకోటం అంతా ఎందుకూ! ఎవరికోసం? అతని హృదయం మళ్ళీ అట్లాంటి ప్రేమకోసం తహతహలాడింది. అతని బ్రతుకంతా నిస్సారం అనిపించింది.

ఇరవయినాలుగు గంటలూ ఆమె ఆలోచనతో బతకలేకుండా ఉన్నాడు.

ఆమెను కలుసుకుని తీరితేనేతప్ప తన ఆత్మకు శాంతి ఉండదని నిశ్చయం చేసుకున్నాడు. చివరకు తన మనశ్శాంతి కోసం రామారావు ఒకరోజు రాత్రి మాయమయ్యాడు.

ప్రియులిద్దరూ కనబడకుండా కలుసుకున్నారు.

అభం శుభం ఎరగని అమాయక వెంకట నరసమ్మ మాత్రం ఏకాకి అయింది.

సహృదయతకు కలిగే ఫలితం ఇదేకాబోలు!

*(పరిసరాలు -1, కథల సంకలనం నుంచి)*

# నిశ్శబ్ద గాయాల "జఖ్మ్"

నస్రీన్ సృజనలోని గాయాలను తడిమిన ఉషారాణి...



సీహెచ్. ఉషారాణి
94412 28142

గత కొద్ది సంవత్సరాలుగా అస్తిత్వ వాద సాహిత్యంలో దళిత సాహిత్యం తరువాత ముస్లీం వాద కవిత్వం ఒక ప్రత్యేకతను చాటుకున్నది. అయితే మైనారిటీ స్త్రీల స్థితిగతులను కవిత్వం చేస్తూ కొంతమంది ముస్లిం స్త్రీలు కవిత్వం రాస్తున్నారు. తెలుగులో అలా రాస్తున్న వారు తక్కువ మందే ఉన్నా బలమైన కవిత్వం రాస్తున్నారు.

అన్ని మతాలు స్త్రీని రెండవ శ్రేణి గానే పరిగణించినా మత ఆచారాలను ఎండ గడుతూ ఆయా మతాల్లోని స్త్రీలు గొప్ప సాహిత్య సృష్టి చేసారు. ముస్లిం స్త్రీ వేదనను కవిత్వం చేస్తు "జ ఖ్మ్" పుస్తకంగా వెలువరించింది కవయిత్రి 'నస్రీన్.'

ఈ పుస్తకం నిండా ఎన్నో నిశ్శబ్ద గాయాలు.. ఇవి ముస్లిం స్త్రీల గాయాల సలపరింత అనేక రాత్రులలో దహించిన ముస్లిం స్త్రీల మనసుల గాయాలు వ్యక్తీకరించడంలో ఆమెది బలమైన అభివ్యక్తి. ఆ గాయాలు మనసుకా? మనిషికా తెలుసుకుందాం "జ ఖ్మ్"లో.

ఆమె లలితమైన పదాల శైలితో భారతీయులు అయినా మతపరమైన ఆంక్షలను అనుభవించే ఒక ఆవేదనను అభివర్ణించడంలో నస్రీన్ గారిది ఒక ప్రత్యేకత. తను తనవారిని గురించి ఇక చెప్పాల్సిందే అనే నిర్ణయంతో గొంతు సవరించుకున్న వ్యక్తీకరణ. అందరి



వేదనకు వకాల్తా తీసుకుని ఎదురుగా కవిత్వపు ఆయుధంతో నిలబడినట్లు అనిపిస్తుంది.

"అమ్మీ" వ జయతే" కవితలో

"అబ్బా హుకూంలను అక్షరాల పాటించే అమ్మీలు//పగలంతా పట్టెడన్నం కోసమే శ్రమించే పుట్టలోపలి చీమలు"// దిన్ భర్ ఘడియాల్ లా తిరుగుతూ//

ఆమెకు ఎప్పుడైనా విశ్రాంతి వుంటుందా? అమ్మకు ఎన్ని గంటలు వంటగదిలో, ఇంటిపనిలో కరిగిపోతు న్నాయో లెక్కకట్టలేనివి. ఆమె శ్రమను గుర్తించే రోజులు వస్తాయా? ఎప్పుడో ఒకసారి మదర్స్ డేకి అమ్మను ఫొటోలకు, ఒకరోజును తలచుకోవడమే.

ఈ "అమ్మీ" వ జయతే" కవిత ఆమె శ్రమను తడిమి మనసుకు చూపిస్తుంది. విమల గారి వంటిల్లు కవిత జ్ఞప్తికి వస్తుంది.

"తాగుబోతు అబ్బాలు ఉన్న ఇంటి పరదాలను

ఒక్కసారి జరిపి చూడండి.

కంటికి నిద్దుర అందని అమ్మీలు కనిస్తారు."

బలమైన స్త్రీవాదం వినిపించింది.

"తాలిమ్"

"బేడీలతో బయటకొచ్చిన ఖైదీలా//

నిండా హిజాబ్ దిగేసుకున్న రెక్కలు లేని కబూతర్‌లు//డిజైనర్ల స్వార్థపు ఫ్యాషన్...

"అడుగులైనా కుదురుగా పడని ఆ చిన్ని పాదాలకు//బంధంలా చుట్టేస్తూ నల్లని వస్త్రం//సమానతకు చిహ్నమైన యూనిఫామ్‌లను కప్పేసే చిట్టి బుర్ఖా?" కవితను చదివేప్పుడు అందులోని ఆవేదనాపూరితమైన భావం హృదయాన్ని తాకుతుంది.

ఎత్తైన గోడల్లాంటి ఒక అణచివేతకు సింబాలిక్ గా వాడుకుంటున్న ఒక బురఖా గురించిన కవిత.

"మొగ్గలుగా ఉన్నప్పుడే ధిక్కరించే చైతన్యం చేయూతనివ్వాలి."..

నస్రీన్ మాత్రమే ఇట్లరాయగలదు అనిపిస్తుంది. చివరిలో సమస్యను చెప్పి వదిలిపెట్టడం కాకుండా సమస్యను ఎలా

ఎదుర్కోవాలో కూడా చెబుతుంది. ఒక్క రచయితకు ఉండాల్సిన క్వాలిటీ ఇది.'' గుండెల నిండుగా'' ప్రతి అమ్మాయి ఏదో ఒక సందర్భంలో లైంగిక వేదనకు గురి అయ్యే ఉంటుంది. అట్లాంటి అనేక వేదనలకు ఒక దారి మీటూ... వాయిస్ రేజ్ చేసే అవకాశం. ఎప్పటి నుండో మూగబోయిన అనేక గొంతుకలు మీటూతో బయటకు పెగులుకొని వచ్చాయి.

"ఏళ్ళ తరువాత/మనసు విప్పుతోందామె/బరువుల మూటను దించుతోందామె/గుండెల నిండుగా శ్వాసిస్తోంది/అడ్డుపడకండి..."

అట్లాంటి గొంతుకలకు కాస్త అడ్డు పడకుండా తనవేదనను వ్యక్తం చేయనివ్వ మంటుంది. "యుద్ధ నౌకను నేను"

"మనో నేత్రంతో ప్రపంచాన్ని చూడాల్సిన/యవ్వనాన్ని నలుపు వస్త్రంలో చుట్టబెట్టి/

చూరుకు వేలాడదీసాను."...

స్త్రీ జీవితాన్ని మూడుముక్కలుగా సెట్టింగ్ చేస్తే, ఆ సెట్టింగ్ కట్ట్ చేసి అతికితే ఆ పరిధికి జీవితాన్ని మలచుకొని దాన్ని అలవాటు చేసుకున్నట్లు నటిస్తూ జీవితాన్ని "జీవిస్తున్నా"అనుకొని బతుకుతున్న స్త్రీల గాథ ఇది. "దిల్ కీ తక్లీఫ్"

దసరా పాయసం మా ఇంటికి/రంజాన్ షీర్ ఖుర్మా మీ ఇంటికి/ప్రేమగా ప్రవహిస్తూనే ఉన్నాయి కదా...

ఒక పాతబస్తీ కనిపిస్తుంది ఈ కవితలో. అక్కడ హిందూ, ముస్లింలు ఒకరి వాకిళ్ళలో ఒకరు అన్నట్లుండే ఇల్లు ఎవరింట్లో పెళ్లి జరుగుతుందో తేడా తెలియని ప్రేమలు మెత్తగా పరుచుకొని వుంటాయి. ఈ దృశ్యాలు అక్కడ చాల సహజంగా అగుపడతాయి. అక్కడ కూడా మతం చిచ్చులు చిన్నగారేపే భావాన్ని చాల సున్నిత పదాలతో పరిచిన కవిత. "చమ్కీ చీర" ఎన్నోసార్లు తన కోరికలను పూడ్చిపెట్టి అందరి ఆనందాన్ని తన కళ్ళలో నింపుకుంటూ అదే తన 'ఈద్'




పండుగగా భావించే అమాయకపు అమ్మ జరీ చీరలాంటి కవిత.

"వేర్ ఈజ్ మై రైట్" అంటూ ప్రశ్నించే గొంతుక అయ్యింది. ఆమె ప్రశ్నించడం మొదలు పెడితే ఎక్కడి ఎక్కడి నుండి ప్రశ్నలు కుమ్మరించగలదో చూపే కవిత.

"బద్ సూర్తీ" జీవితంలో పెళ్లి అనేది చాలా ప్రధానము, అదే జీవితం అనే ఒక ట్రాన్స్‌లో పెరిగిన ప్రతి అమ్మాయి అక్కడికి రాగానే తల్లిదండ్రులవైపు చూపునిలుపుతుంది. కాని బాహ్య సౌందర్యాన్ని చూడగలిగితే దోఖా పెళ్ళిచూపులు, పెళ్లి ఆమెను ఎంతగా అంతర్వేదనకు గురిచేసాయో చెప్పిన కవిత.

"సిల్ సిలా" కవితలో...

"విరిగిన కాంతి శకలాలు దొరుకుతాయక్కడ/రంగు రంగుల్లో ఉండే కాంతి శకలాలు/ఏ చాంద్ కా టుక్డా/చక్షువుల్నించి రాలి పడ్డాయో/ఒకదాన్ని మించి మరొటి విద్యుద్దీపాలు వెలుగుల్లో.."..

గాజుల తయారీ, ఆ బజారు గురించి రాసినప్పుడు ఎత్తుగడ ఒక అద్భుతమైన ఇమేజ్‌తో మొదలు పెట్టినప్పుడు ఒక చేయి తిరిగిన కవయిత్రి కనిపిస్తుంది.

పాత్రికేయ వృత్తి, వృత్తిపరమైన అన్వేషణ అనేక జీవన పోరాట పరిస్థితులలో ఊగిసలాడుతున్న బతుకులకు దగ్గర చేసింది. ఆమె ఏ విషయాన్ని అయినా స్వయంగా పరిశీలించిన తరువాతనే కవిత్వంగా మలిచింది. విశ్వసించిన విషయాలనే కవిత్వీకరించారు.

ఆమె కవిత్వంలో వస్తువులు మన ఊహకందనివి, ఎంతో సునిశిత పరిశీలనలో ఆమె మనసుకు తగిలినవే అయినవి. వ్యక్తీకరణలో కూడా చాల చక్కని శైలితో సహజమైన పదాలతో ఆమె కవిత్వం గలగల నదిలా సాగిపోతుంది.

ఆ కలం ఎప్పుడూ అణిగిన, అణచి వేయబడిన ప్రతి బతుకు ఆనవాళ్ళను తడిమి చూసింది.

అది అమ్మకావొచ్చు, ముసుగు తగిలించుకున్న దేశభక్తి కావచ్చు, మతం మాటున దాగిన రహస్యాలను వెలికి తీయడం కావచ్చు. బాల్యం నుండీ ప్రతి ముస్లిం స్త్రీ ఎదుర్కొన్న, ఎదుర్కొంటున్న అనేక అణచివేతల సందర్భాలు కావొచ్చు. ప్రతిమూలంలోకి ఆ కలం ప్రయాణం చేసింది. గాయపడిన ఎన్నో దేహాత్మల వెతలు ఈ కవితలు. కొన్ని కొన్ని సందర్భాలలో మనసులో గాజుముక్కలతో గీతలు గీసినట్లుంటుంది. ఇంతటి అణచివేతలలో చిక్కుకు పోయిన రివాజుల పరదాలను తొలగించిన సంస్కరణ వాద కలం నస్రీన్ ది. ముస్లిం స్త్రీలను గురించి రాసిన ప్రతికవితా ఒక బలమైన స్త్రీ వాదం పూనినట్లుంటుంది.

ముస్లిం వాదం తనను తాను పరిశీలించుకొని సంస్కరించుకుంటూనే తన జాతికి జరుగుతున్న అవమానకర ప్రచారాలను ఎదుర్కొంటున్నది.

ముస్లిం స్త్రీ మొత్తంగా తన మతం పైజరుగుతున్న విష ప్రచారాలను, పెరుగుతున్న అభద్రతను ఎదుర్కొంటూనే మరోపక్క తన మతంలో ఉన్న దురాచారాలను సంస్కరించుకోడానికి పూనుకున్నది.

కవిత

# ఆమె



ఎస్. జవేరియా, 98499 31255

వెలకట్టలేని ఆమె ప్రేమే లేకపోతే
ఈ లోకం ఎలా ఉండేదో? ఎవరూహించలేరు?
అందుకనే అంధకారం నిండిన
ఈ లోకానికి ఆమె ప్రేమే వెలుగు నింపి ముందుకు
నడుపుతుంది అనడంలో ఏ సందేహమే లేదు!

వెలుగునిచ్చే సూర్యచంద్రులను సైతం
ఆమెనే తన ప్రతిభతో తన వైపునకు తిప్పుకుంటుంది!
దిక్కుతోచని వారికి తనే దిక్కంటు తనవంతు
సాయపడే ఆమె దిక్కులేనివారికి అమ్మవుతుంది!

అంతులేని దుఃఖ సాగారాన్ని తనలోనే దాచుకునే
ఆమె ఏమి ఎరగనట్టు నటిస్తూ నింగిలోకి ఎగురుతుంది!
ప్రేమలేని ఎడారిలా మారిన ఈ లోకానికి
ఆమెనే దిక్సూచిగ మారి దారి చూపుతూ దాహం తీరుస్తుంది!

తీరం చేరకుండ నడి సముద్రంలో
కొట్టుమిట్టాడే కష్టాల నావకు లంగరేసే
ఆమెనే చివరి మజిలిని చూపే చుక్కాని!!

**(అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా)**



## సాహిత్యంలో ఏకైక ఈజిప్షియన్ నోబెల్ విజేత...

# నగీబ్ మెహఫూజ్



నగీబ్ మెహఫూజ్ ఈజిప్ట్‌కి చెందిన రచయిత. ఈయన 1911లో డిసెంబర్ 11న జన్మించాడు. ఈయన 1988 లో నోబెల్ బహుమతిని అందుకున్నాడు. సాహిత్యంలో నోబెల్ బహుమతిని గెలుచుకున్న ఏకైక ఈజిప్షియన్ అతను. అతను 1930ల నుండి 2004 వరకు 35 నవలలు, 350కి పైగా కథలు, 26 సినిమా స్క్రిప్ట్‌లు, ఈజిప్షియన్ వార్తాపత్రికల కోసం వందలాది కాలమ్‌లు మరియు ఏడు నాటకాలను ప్రచురించాడు. అతని నవలలన్నీ ఈజిప్ట్‌లో జరుగుతాయి. అతని అత్యంత ప్రసిద్ధ రచనలు "ది ట్రయాలజీ" మరియు "చిల్డ్రన్ ఆఫ్ గెబెలావి". మహ్ఫౌజ్ యొక్క అనేక రచనలు ఈజిప్ట్‌లో మరియు విదేశాలలో కూడా చలనచిత్రాలుగా రూపొందించబడ్డాయి. సినిమా మరియు టెలివిజన్ కోసం స్వీకరించబడిన రచనల సంఖ్యలో మహ్ఫౌజ్‌ను మించిన అరబ్ రచయిత లేడు.

ఈయన రచనలు సోషలిజం మరియు దేవుడు వంటి వివాదాస్పద మరియు నిషిద్ధ అంశాలతో సహా విస్తృత శ్రేణి అంశాల గురించి చర్చిస్తాయి. ఈజిప్టులో ఈ విషయాలలో కొన్నింటి గురించి రాయడం నిషేధించబడింది. మహ్ఫౌజ్ సాహిత్యం వాస్తవిక సాహిత్యంగా వర్గీకరించబడినప్పటికీ, అస్తిత్వ ఇతివృత్తాలు అందులో కనిపిస్తాయి. ఈయన 2006 ఆగస్టు 30వ తేదీన మరణించారు.



## మానవతా వాది

# విష్ణు వామన్ శిర్వాద్కర్



విష్ణు వామన్ శిర్వాద్కర్ ప్రసిద్ధ మరాఠీ కవి, రచయిత, నాటక రచయిత, నవలా రచయిత, లఘు కథా రచయిత, మానవతావాది. 1912లో ఫిబ్రవరి 27న జన్మించారు, "కుసుమగ్రాజ్" కలం పేరుతో సుపరిచితులు. ఆయన మానవతా వాదిగా న్యాయ, దారిద్ర్యం గల ప్రజల విముక్తి కోసం స్వాతంత్ర్యానికి పూర్వం ఐదు దశాబ్దాలుగా 10 సంపుటాలు కవితలు, మూడు నవలలు, ఎనిమిది సంపుటాల లఘు కథలు, ఏడు సంపుటాల వ్యాసాలు, 18 నాటకాలు, ఆరు ఏక పాత్రాభినయనాల నాటకాలు వ్రాసారు. ఆయన సాహితీ సేవలలో పాటక సంకలనం "విశాఖ" (1942) స్వాతంత్ర్యానికి పూర్వం ఉద్యమంలో ఉద్యమకారులకు, ప్రజలకు స్ఫూర్తినిచ్చింది. అది ప్రస్తుత భారత సాహితీ చరిత్రలో ఒక కళాఖండంగా నిలిచింది. ఆయన రచించిన నాటకం "నటసామ్రాట్"కు మరాఠీ సాహిత్యంలో ముఖ్యమైన స్థానం లభించింది. ఆయన అనేక రాష్ట్ర స్థాయి అవార్డులను, జాతీయ అవార్డులతో పాటు 1974లో మరాఠీ సాహిత్య అకాడమీ అవార్డు, 1987లో జ్ఞానపీఠ అవార్డులను అందుకున్నారు. ఆయన 1989లో జరిగిన ప్రపంచ మరాఠీ సదస్సుకు చైర్ పర్సన్‌గా పనిచేసారు. ఆయన మహారాష్ట్ర లోని పూణేలో జన్మించినప్పటికి, తన జీవితంలో అత్యధిక కాలాన్ని నాసిక్‌లో గడిపారు. ఆయన మరాఠీ సాహిత్యంలో చేసిన కృషికి ప్రతి సంవత్సరం ఆయన పుట్టిన రోజు అయిన ఫిబ్రవరి 27వ తేదీన "మరాఠీ భాషా దినం"గా జరుపుకుంటారు. ఈయన 1999 మార్చి 10న పరమపదించారు.

కథ

# నయా జిందగీ

కొత్త చిగుళ్ళ కోసం వాసరచెట్ల కథా కథనం....



జయంతి వాసరచెట్ల
99855 25355

గార్మెంట్స్ కంపెనీ ముందు కార్ పార్క్ చేసి అన్యమనస్కంగానే లోపలికి నడిచింది శ్రీనిధి.

కంపెనీ అంతా ఒకసారి తిరిగి చూసి తన క్యాబిన్‌లోకి వెళ్తుంటే క్యాబిన్ శుభ్రం చేసి బయటకు వస్తున్న యాదమ్మ నమస్తే అమ్మ అని ఆప్యాయంగా పలకరించింది. ముభావంగానే 'నమస్తే!' అంటూ తలూపింది శ్రీనిధి.

క్యాబిన్లోకి వెళ్ళగానే భర్త ఫోటో ముందు సిద్ధంగా ఉన్న పూలమాల చేతుల్లోకి తీసుకుని ఫోటోకు వేసి దీపాలు వెలిగించింది. తన చేయిర్‌లో కూలబడిపోయి భర్త ఫోటోను తదేకంగా చూస్తూ నిన్న జరిగిన విషయమే తలుచుకుని పొగిలి పొగిలి ఏడవసాగింది. ఏడ్చి ఏడ్చి గుండె తేలిక పడినట్లుగా అయ్యింది. తను ఆలోచనల సుడి గుండంలో చిక్కుకుని గత కాలంలోకి తప్పిపోయింది.

"జీవితంలో జరిగింది మంచి అయినా, చెడు అయినా. జ్ఞాపకాల పుటల్లో అలాగే ఉంటుంది కదా!" అనుకుంటుంది. నిన్న పక్కింటి వాళ్ళు వాళ్ళ అమ్మాయికి సీమంతం అని పిలిస్తే తాను వెళ్ళింది.

అమ్మాయ్ నువ్వు కాస్త వెనక సీట్‌లో కూర్చోమ్మా. ఎదురుగ్గా కూర్చోవద్దు.

ఇది ముత్తైదువుల కార్యం కదా! నీవు వేసే అక్షంతలు పనికిరావు. ఏమీ అనుకోవద్దమ్మా అంది ఒక పెద్దావిడ. తను మనసు చివుక్కుమంది. వస్తున్న దుఃఖాన్ని ఆపుకుని నిబ్బరంగా కూర్చుంది.

అందరూ వెళ్ళి గిఫ్ట్‌లు ఇవ్వడం అయ్యాక చివరగా తను తీసుకొని వెళ్ళిన చీర, గాజులు మరొకరితో బొట్టు పెట్టించి ఇప్పించింది. భోజనాల దగ్గర ఏదో తిన్నాను అనిపించుకుని ఇంటికి వచ్చేసింది.

ఇలాంటి అవమానాలు ఎన్నో సార్లు జరిగాయి. కానీ ఇప్పుడు పచ్చిగా ఉన్న గాయం మీద కారం పోసినట్లుగా అనిపించసాగింది. పోయిన వారం హర్షితను చూసు కోవడానికి వచ్చిన పెళ్లి వాళ్ళు అమ్మా శ్రీనిధి మీకు వెనకా ముందు ఎవరైనా ఉన్నారా? అంటే పెళ్లి పనులు చూసుకోడానికి అన్నారు. మరోలా అనుకోవద్దు పిల్లకు మేనమామలు అమ్మమ్మ, తాతయ్య అలా అన్నారు.

నాకు అన్నా తమ్ముడు లేరండీ ఈ మధ్యనే నాన్న పోయారు. అమ్మకు చేతకాదు అన్నది. మరి ఈ శుభకార్యం ఎవరు ముందుండి నడిపిస్తారు. ఎలా జరుపుకుంటారు? మీకు పనికిరాదు కదా! అన్నారు వాళ్లు. ఆ సమయంలో గుండె లోపల గునపంతో గాయం చేసి ప్రాణాలు తోడేసి నట్టుగా అనిపించింది. వాళ్ళందరూ వెళ్ళిపోయాక పిల్లలను పట్టుకుని ఏడ్చింది.

బాధపడకు అమ్మ! ఏడవకు ఇన్నాళ్లు అన్నీ నీవే అయి చేసావు. ఇప్పుడు నువ్వు చేసిన పని ఎందుకు పనికి రాకుండా ఎలా పోతుంది అని ప్రశ్నించింది కూతురు హర్షిత. మన సంస్కృతి సాంప్రదాయాలు కొన్ని నియమాలు ఏర్పర్చాయి తల్లీ! భర్త లేని ఇల్లాలు ఏ శుభకార్యానికి పనికిరాదు. పనికి రాదు అంటే? అన్నాడు కొడుకు రోషన్. అంటే శుభకార్యాల్లో ముందుండి పని చేయడానికి అలాంటి వాళ్లను సమాజం ఒప్పుకోదు అన్నది.

పిల్లలిద్దరూ మౌనంగా ఉండిపోయారు. ఇలా బాధగా ఉన్నప్పుడు తల్లిని డిస్టర్బ్ చేయరు ఒంటరిగా వదిలేసి వెళ్ళిపోతారు పిల్లలు. ఆసమయంలో శ్రీనిధికి తన భర్త గుర్తొచ్చాడు. ఆరోజు జరిగిన విషాదం గుర్తుకొచ్చింది.

* * *

నిధీ నిధీ అంటూ కేకలు వేస్తూ స్వీట్ బాక్స్ తీసుకొని వచ్చాడు సాకేత్. ఎదురుగా ఎర్రరంగు బోర్డర్‌తో ఆకుపచ్చ రంగు చీరతో జడ నిండా మల్లె పూలతో అందంగా ముస్తాబైన నిధిని ఎదురుగా చూస్తూ ఒక్క క్షణం అలాగే ఉండి పోయాడు సాకేత్. కన్నార్పకుండా చూస్తూ ఎంత అందంగా ఉన్నావ్ దేవకన్య లాగా కనిపిస్తున్నావ్ నా దిష్టే తగిలేలా ఉంది అన్నాడు అతను.

అబ్బా ఊరుకో సాకేత్ ఈరోజు మన

కథ

**పూలతో అందంగా ముస్తాబైన నిధిని ఎదురుగా చూస్తూ ఒక్కక్షణం అలాగే ఉండిపోయాడు సాకేత్. కన్నార్పకుండా చూస్తూ ఎంత అందం గా ఉన్నావ్ దేవకన్య లాగా కనిపిస్తున్నావ్ నా దిష్టే తగిలేలా ఉంది అన్నాడు అతను. అబ్బా ఊరుకో సాకేత్ ఈరోజు మన పెళ్లి రోజు గుడికి వెళ్దాం రెడీగా ఉండు అన్నావు కదా..!**

పెళ్లి రోజు గుడికి వెళ్దాం రెడీగా ఉండు అన్నావు కదా..! నీ కోసమే ఎదురు చూస్తున్నాను.

అవును ఏదో సంతోషమైన వార్త అన్నావ్ ఏంటి త్వరగా చెప్పు అంది. నిన్ను ఇలా చూసేసరికి చెప్పడమే మర్చిపోయాను మనం గార్మెంట్ కంపెనీ కోసం బ్యాంకు లోన్ అప్లై చేశాం కదా!

ఆ అవును! బ్యాంకు నుండి లోన్ సాంక్షన్ అయిందోచ్ అంటూ నిధిని ఎత్తుకొని గిరగిరా తిప్పుతూ అన్నాడు. కిందికి దించు సాకేత్ పిల్లలున్నారు అంది సిగ్గుపడుతూ! ఎంత మంచి వార్త ఇన్ని సంవత్సరాల కృషి ఫలితం థాంక్యూ దేవుడా అంటూ దేవుడి గదిలోకి వెళ్ళి మొక్కింది శ్రీనిధి. వారిద్దరూ వారికి ఇద్దరు పిల్లలు కష్టసుఖాలను పంచుకుంటూ ఆనందంగా జీవిస్తున్నారు సాకేత్, శ్రీనిధి. లోన్ సాంక్షన్ అయిన అదే రోజు పెళ్లి రోజు కూడా కావడంతో గుడికి వెళ్ళి దర్శనం చేసుకుని రోజంతా బయట తిరిగి వచ్చారు.

సాయంత్రం 6 గంటలు కావస్తోంది ఇంటికి వెళ్ళి నీళ్ళ బాటిల్ తీసుకుని అలా కుర్చీలో కూర్చున్నాడు సాకేత్. ఫ్యాక్టరీ కోసం బుక్ చేసిన మిషన్ల లోడు వచ్చిందని ఫోన్ కాల్ వచ్చింది. కాస్త ఫ్రెష్ అయ్యి భోజనం చేసి వెళ్ళండి అన్నది నిధి.

మళ్ళీ వచ్చి తింటానులే వాళ్ళు వెయిట్ చేస్తుంటారు కదా అంటూ హడావుడిగా బండి స్టార్ట్ చేసుకొని వెళ్ళాడు. మిషన్లన్నీ ఫ్యాక్టరీలో వేయించి వర్కర్లకు స్వీట్స్ ఇచ్చి లోన్ శాంక్షన్ అయిన విషయం చెప్పాడు. ఇప్పటి నుండి చాలా పని ఉంటుంది. మీరంతా బాగా పని చేయాలి అన్నాడు సాకేత్.

అలాగే సారు అన్నారంతా.

ఇంటికి తిరిగి వస్తున్నప్పుడు వెనక వైపు నుండి వస్తున్న లారీ గుద్దేసింది. ఎవరో అంబులెన్స్ కొరకు ఫోన్ చేసి పిలిపించారు. హాస్పిటల్‌కి వెళ్ళే లోపలే ప్రాణాలు పోయాయి. అరగంటలో వస్తానన్న మనిషి ఇంకా రాలేకపోయేసరికి భర్తకు ఫోన్ చేసింది శ్రీనిధి. ఎవరో ఒక వ్యక్తి ఫోన్ లిఫ్ట్ చేసి జరిగిన విషయం చెప్పాడు. కుప్పకూలిపోయింది.

హుటాహుటిన పిల్లల్ని తీసుకుని హాస్పిటల్‌కి వెళ్ళింది. మార్చురీలో భర్త శవాన్ని చూసి భోరున ఏడ్చింది. అంత్యక్రియలు పూర్తయ్యాయి. నిధి తల్లిదండ్రులు ఇంత చిన్న వయసులో కూతురి స్థితిని చూసి కుమిలిపోయారు.

"శ్రీనిధి తన పరిస్థితి పిల్లల భవిష్యత్తుని తలుచుకొని ఒక నిర్ణయానికి వచ్చింది." భర్త కోరిక మేరకు కంపెనీ కోసం అహోరాత్రులు కష్టపడింది. పిల్లలను మంచి చదువులు చదివించి క్రమశిక్షణ తో పెంచింది. ఇన్నేళ్లుగా



ఒంటరిగా పోరాడినా ఏరోజూ తనకు బాధగా అనిపించలేదు. పిల్లల అభివృద్ధి తనకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చింది. అంచెలంచెలుగా ఎదుగుతూ అన్నీ సమకూర్చింది. ఇప్పుడు గార్మెంట్ కంపెనీకి ఆమే యజమాని. ఇంతవరకు బాగానే ఉంది. ఈరోజు తన కూతురి కోరిక తనను ఆవేదనలో పడేసింది.

అమ్మ అమ్మా.. అమ్మా... అదీ నేను పెళ్లి చేసుకుని అత్తారింటికి వెళ్లిపోతే నీవు ఉండ గలవా? అంది కూతురు. అవునమ్మా చెల్లి పెళ్లి చేసుకుని వెళ్ళిన తర్వాత నీ పరిస్థితి ఏంటి? ఉండగలవా? అన్నాడు రోషన్. అసలు మీరు ఏం మాట్లాడుతున్నారు. ఎందుకు అలా అడుగుతున్నారు అంది శ్రీనిధి.

అమ్మా అదీ...

ఏంటో చెప్పండి అంది.

నీవు ఏమీ అనవద్దు నీకు మళ్లీ పెళ్లి చేద్దామనుకుంటున్నాము అన్నారు ఇద్దరు.

ఆ తర్వాత నేను పెళ్లి చేసుకుంటాను అంది కూతురు హర్షిత. మీ ఇద్దరికీ ఏమైనా పిచ్చి పట్టిందా? ఏం మాట్లాడు తున్నారు! అని ఏదో అనబోయేంతలో రోషన్ మాట్లాడుతూ మా మేము చిన్న పిల్లలం కాదు మాకు లోకజ్ఞానం ఉంది.

మమ్మల్ని పెంచి పెద్ద చేయడానికి చదివించడానికి ఎంత కష్టపడ్డావో మాకు తెలుసు. మేము నిద్ర పోయాం అనుకుని నాన్న ఫోటో ముందు కూర్చుని నీవు నిద్ర లేని రాత్రులు ఎలా గడిపావో కూడా మేం చూసాం.

"అందరికీ ఒక్కటే జీవితం ఉంటుంది బ్రతికే తీరు వేరు వేరుగా ఉంటుంది." నీవు అమ్మ నాన్న రెండు బాధ్యతలు తీసుకొని మాకు ఏ లోటూ లేకుండా పెంచావు. చుట్టుపక్కల వాళ్ళు శుభకార్యాల్లో అనివార్యంగా జరిగే అవమానాలు, అన్నింటికీ నిన్ను దూరంగా పెట్టడం అనే విషయాలు నాకు మింగుడు పడేదికాదు. ఎన్నిసార్లు ఇంటికి వచ్చాక ఒంటరిగా బాధ పడే దానివి అన్నాడు.

'ఏం మాట్లాడుతున్నావ్ రా!

నాకు ఆ అదృష్టం లేదు.

మీ నాన్నతో పాటే అన్నీ తీసుకొని పోయారు. అయినా ఇన్నాళ్ళు లేని ఆలోచన మీ ఇద్దరికీ ఇప్పుడు ఎందుకు వచ్చింది? మీ మనసులో ఎవరో పాడు చేస్తున్నారు.

నేను మళ్లీ పెళ్లి చేసుకోవడమా!

ఇది లోకం హర్షిస్తుందా?

ఎవరమ్మా లోకం ఇన్నేళ్లుగా నీవు కష్ట పడుతూ ఉంటే మనకు తినడానికి తిండి లేక పోతే లోకం ఏమైనా తెచ్చిచ్చిందా?

చూడు రోషన్ నువ్వు చిన్నవాడివి కొన్ని సంప్రదాయాలు నీకు తెలియదు ఈ విషయం వదిలేద్దాం. నేను పెళ్లి చేసుకోవడం అనేది పక్కనపెట్టు.

మీ ఇద్దరివీ పెళ్ళిళ్ళు చేసి మీకు పుట్టబోయే పిల్లలతో నా మిగిలిన జీవితమంతా సంతోషంగా ఉంటాను అంది శ్రీనిధి. గబుక్కున తన గదిలోకి వెళ్ళి తలుపు వేసుకుని ఏడవసాగింది.

కాలేజీలో ఆరోజు డిగ్రీ తీసుకోవడానికి వెళ్తుంది హర్షిత.

★ ★ ★

అమ్మా అన్నయ్య మీరిద్దరూ సాయంత్రం నాలుగు గంటల కల్లా కాలేజీకి రావాలి. నీవు మంచి చీర కట్టుకొని చక్కగా రెడీ అయ్యి రావాలి మా ఫోటోలు బాగా వస్తాయి అని చెప్పి వెళ్తూ వెనక్కి తిరిగి అన్నయ్యా గుర్తుందిగా అని సైగ చేసింది. ఏంటీ అన్నా చెల్లెలు ఏదో సీక్రెట్‌గా చెప్పు కుంటున్నారు అంది.

> **అరగంటలో వస్తానన్న మనిషి ఇంకా రాలేకపోయేసరికి భర్తకు ఫోన్ చేసింది శ్రీనిధి. ఎవరో ఒక వ్యక్తి ఫోన్ లిఫ్ట్ చేసి జరిగిన విషయం చెప్పాడు. కుప్పకూలిపోయింది. హుటా హుటిన పిల్లల్ని తీసుకుని హాస్పిటల్‌కి వెళ్ళింది. మార్చురీలో భర్త శవాన్ని చూసి భోరున ఏడ్చింది. అంత్యక్రియలు పూర్తయ్యాయి.**

ఏం లేదమ్మా సాయంకాలం త్వరగా రావాలి మర్చిపోవద్దు అంటున్నాను అంతే అంది హర్షిత.

★ ★ ★

కాలేజీ ఆవరణలోకి వెళ్తూ చుట్టూ చూసేసరికి ఆవరణ అంతా చక్కగా డెకరేషన్ చేశారు. ఇంకా అతిథులు రానట్లుగా ఉంది. అందరూ బిజీగా తిరుగుతున్నారు.

కార్ పార్క్ చేసి కొడుకుతో పాటు శ్రీనిధి కూడా దిగింది.దూరంగా కూతురు హర్షిత వస్తూ హమ్మయ్య వచ్చారా అంటూ దగ్గరికి వచ్చి లోపలికి తీసుకు వెళ్లింది.

అమ్మా ఇతను మా ప్రొఫెసర్ కార్తికేయగారు అని పరిచయం చేసింది హర్షిత. నమస్కారం సార్ అంది శ్రీనిధి.

అమ్మ మాకు కూడా టీచ్ చేసారు సర్ నమస్కారం సర్ అంటూ వచ్చాడు రోషన్.

హా అవునా అన్నది శ్రీనిధి.

మీరిద్దరూ మాట్లాడుతూ ఉండండి ఇంకా ఈవెంట్‌కి కావలసిన అరేంజ్మెంట్స్ పూర్తికాలేదు. నేను అన్నయ్యా వెళ్లి పది నిమిషాల్లో వస్తాము అని చెప్పింది హర్షిత.

అన్నయ్య కాస్త హెల్ప్ చేయవా నాకు అని రోషన్‌ని కూడా తీసుకుని వెళ్లిపోయింది. నేను కాలేజీ నుండి వెళ్ళిపోయాక ఇన్నేళ్ళకి ఇప్పుడే రావడం. అమ్మా మాఫ్రెండ్స్ వచ్చారు కలిసి వస్తాను అంటూ తల్లి మాటలు పట్టించుకోకుండా వెళ్ళిపోయారు. వాళ్ళు ఉన్న దగ్గర చుట్టూ ఎవరూ లేరు శ్రీనిధికి ఇబ్బందిగా అనిపించసాగింది. ఇద్దరి మధ్యా కాసేపు మౌనం రాజ్యమేలింది.

మెల్లిగా కార్తికేయ శ్రీనిధి గారు మీరు కంఫర్ట్ గా లేనట్లున్నారు అన్నాడు.

అది ఏం లేదు సార్ లేటుగా ఫంక్షన్ మొదలు పెట్టేట్లుగా ఉంటే నేను ఒక గంట తర్వాత వచ్చేదాన్నిగా! అంది.

మీకు ఇంకా అర్థం కాలేదా శ్రీనిధి గారు! ఏమిటి? అన్నట్లు చూసింది అతని వైపు. నిజానికి ప్రోగ్రాం 6 గంటలకు పిల్లలు మనం మాట్లాడుకోవడానికి ఏకాంతం కల్పించారు. అర్థం కానట్లు

కథ

తలెత్తి చూసింది శ్రీనిధి. అదేనండి నాకు మీ గురించి మీ కుటుంబం గురించి అన్ని విషయాలు తెలుసు. నా గురించి మీకు తెలియదు అంటూ ఇలా చెప్పాడు.

నేను ప్రేమించి పెళ్లి చేసుకున్న శ్రావణి పాప పుట్టాక ఐదేళ్లకు క్యాన్సర్తో చనిపోయింది. ఇన్నాళ్ల అమ్మానాన్నలు పాపని పెంచి పెద్ద చేశారు. మళ్లీ పెళ్లి చేసుకోమన్నారు కానీ శ్రావణి స్థానంలో మరొకరిని ఊహించుకోలేక పోయాను.

పాప పెద్దదయింది అమ్మానాన్నలు ఆడపిల్లలను ఎప్పుడూ కనిపెట్టుకుని ఉండాలి. మంచి నడవడికతో పెరగాలంటె తల్లి ఉండాలి రా.

మేము ఈరోజు ఉంటాం రేపు ఎలా ఉంటుందో చెప్పలేం. అందుకే పెళ్లి చేసుకోమన్నారు. ఒక్క నిమిషం ఆపి శ్రీనిధి వైపు చూశారు.

'ఆసక్తిగా వింటుంది శ్రీనిధి.'

వచ్చే అమ్మాయి నా బిడ్డ ని ఎలా చూసుకుంటుందో అనే భయంతో ఇన్నాళ్ళు భయపడ్డాను. హర్షిత నా స్టూడెంట్ ఆ అమ్మాయి ఉండే పద్ధతి, చదువులో చురుకుదనం పెద్దల పట్ల గౌరవం నాకు బాగా నచ్చుతాయి.

**అమ్మ మాకు కూడా టీచ్ చేసారు సర్ నమస్కారం సర్ అంటూ వచ్చాడు రోషన్. హాయ్ అవునా అన్నది శ్రీనిధి. మీరిద్దరూ మాట్లాడుతూ ఉండండి ఇంకా ఈవెంట్‌కి కావలసిన అరేంజ్మెంట్స్ పూర్తికాలేదు. నేను అన్నయ్యా వెళ్లి పది నిమిషాల్లో వస్తాము అని చెప్పింది హర్షిత. అన్నయ్య కాస్త హెల్ప్ చేయవా నాకు అని రోషన్‌ని కూడా తీసుకుని వెళ్లిపోయింది.**

నా కూతురు కూడా ఇలా పెరుగుతే బాగుంటుందని నాకు అనిపించేది మీ రోషన్ కూడా నా స్టూడెంటే ఇద్దరూ కలిసి వారం క్రితం నా దగ్గరకు వచ్చి మాట్లాడారు. మన రెండు కుటుంబాలు ఒకటి అయితే బాగుంటుంది అని నాకు అనిపించింది. మీరు ఏ విషయమూ ఇప్పుడు చెప్పనవసరం లేదు.

నేను చెప్పే విషయాలు ఆసాంతం వినండి. పిల్లలు అన్ని విషయాలు మీతో చర్చించలేరు కాబట్టి నేనే చెప్తున్నాను. మీరు ఈ విషయమై నిరభ్యంతరంగా చెప్పవచ్చు. పిల్లల పెళ్ళిళ్ళు అయ్యాక మనకంటూ ఒక తోడు ఉంటే బాగుంటుందని ఒంటరి వాళ్ళం అయ్యామని అనిపిస్తుంది. అది కాదు నాకు ఇద్దరు పిల్లలు. మీరు ఏం చెప్పాలను కుంటున్నారో అర్థమైంది.

మీకు ఇద్దరు పిల్లలు ఉన్నారు అనేగా.... ఇంకా వయసు అంటారా మీ కంటే నేను రెండు సంవత్సరాలు పెద్దవాన్ని మిమ్మల్ని పెళ్లి చేసుకుంటే మీ పిల్లలు నా పిల్లలు అవుతారు. పిల్లలకు పెళ్లిళ్లు చేసి అన్ని బాధ్యతలు కలిసి పంచుకుందాం ఏమంటారు అన్నాడు కార్తికేయ. కాసేపు ఇద్దరి మధ్య మౌనం రాజ్యమేలింది.

* * *

ఫంక్షన్ స్టార్ట్ అవుతుంది అమ్మా అంటూ వచ్చింది హర్షిత. మౌనంగానే లేచి నిలబడి కార్తికేయ వైపు చూసి వెళ్ళబోయింది. నిధి గారు లేత గులాబీ రంగు చీరలో మీరు దేవకన్యలా ఉన్నారు అన్నాడు కార్తికేయ. ఎప్పుడో మర్చిపోయిన సిగ్గు శ్రీనిధి బుగ్గలపై గులాబీ రంగులో పూసింది.

కవిత

# పిచ్చి పిల్ల



**హిమజ, 94404 83001**

అచ్చంగా నాలాగే
నిన్నారాధించే
ఇంకొకరి వలపులో
నువు చిక్కుకున్నావని
తెలుసు నాకు

నీ పసిడి ప్రేమపలుకులకు
లోలకంలా వేళ్ళాడుతూ
తనేదో నీ హృదయాన్ని
పూర్తిగా అర్థం చేసుకున్నానని
అనుకుంటుంది

పిచ్చిపిల్ల
అచ్చం నాలాగే

నాకు తెలుసు
నువ్వు ఇంకో మనసునీ
ముక్కలు చేస్తావని
నేను చెయ్యగలిగేదీ
ఏమీ లేదనీ తెలుసు

ఆమెకేదైనా చెప్పబోతే
అర్థం చేసుకోకపోగా
వెళ్ళగొడుతుందేమో నన్ను

పిచ్చిపిల్ల
అచ్చం నాలాగే

నాకు తెలుసు
ఒకరోజు నువ్వు
తననూ విడిచి వెళ్ళిపోతావని
తెలియనిదల్లా ఆమెకే
నువ్వెందుకు దూరంగా వెళ్ళావని

తన తప్పేమిటో తెలియక
ఆమె పిచ్చిగా తిరుగుతుంది
నీకై ఆక్రోశిస్తుంది

కొన్నాళ్ళకి
ఆమె కూడా
ఇదే పాట
ఆలపించడం మొదలెడుతుంది

పిచ్చిపిల్ల
అచ్చం నాలాగే !!

# సృష్టికి మూలం... స్త్రీ

**సృష్టిలోని స్త్రీ శక్తిని ఆధ్యాత్మికతకు మేళవించిన సామాజికత...**



వేముగంటి శుక్తిమతి
99081 10937

సృష్టికి మూలమైన స్త్రీ మానవ చరిత్రకే పునాది. 'న స్త్రీ స్వాతంత్ర్య మర్హతే' అను మను భాషితం నుండి మొదలు "ఏ జాతి సగం బానిసగా సగం స్వతంత్రంగా మన లేదు" అబ్రహం లింకన్ సూక్తిని, "స్త్రీలు పాల్గొననిదే దేశానికి స్వాతంత్రం రాదని వచ్చినా అది అసమగ్రంగానే ఉండి పోగలదని భావించిన గాంధీజీ భావన స్త్రీ గమ్యానికి ప్రాతినిధ్యం వహిస్తుంది".

మనదేశంలో మహిళపాత్ర మొదటి నుండి కేవలం కుటుంబ జీవితానికి పరిమితం కాలేదు. భారతీయ సంస్కృతి, రాజకీయ సాహిత్య కళారంగాల్లో స్త్రీ ఉన్నత స్థానంలో ఉంది. అన్ని రంగాల్లో ముందంజ వేస్తూనే ఉంది.

ఋగ్వేద కాలంలో స్త్రీ ప్రోక్తమైన కొన్ని శ్లోకాలు, స్త్రీలు పఠించుటకు వీలగు కొన్ని మంత్రాలు కనిపిస్తున్నాయి. వినిపిస్తు న్నాయి. ముఖ్యంగా గార్గి, మైత్రేయి శాస్త్ర చర్చలలో పాల్గొన్నట్లు తెలుస్తోంది.

భారతంలో ఏది వుందో అదే అంతటా ఉంది. అందులో లేనిది మరెక్కడా లేదు అని వ్యాసమహర్షి అన్నట్టు స్త్రీ పాత్ర విషయంలోనూ అంతే. భారతంలోని స్త్రీ పాత్రలను అధ్యయనం చేస్తే మొదట కన్పించేది గంగాదేవి. చివర కనిపించేది ఉత్తర. దాయాదులు రాజ్య భాగం ఇవ్వనందున కొడుకుల రాజ్యభాగం కోసం అవిశ్రాంతంగా పోరాటంసల్పి చివరకు అక్కా బావల పరిచర్యలతోనే తనువు చాలించిన మహా ధైర్యవతి కుంతి. తన భర్తలకు మరలా రాజ్యం వచ్చే దాకా తన శత్రువులు చచ్చేదాకా జుట్టుముడవనని ప్రతిజ్ఞ చేసిన ద్రౌపది. భర్త కనులు లేని వాడని తానూ కళ్లకు గంతలు కట్టుకుని జీవించి పాతివ్రత్య ధర్మాన్ని నిలబెట్టిన గాంధారి. భర్త మరణించినందున తాను సహగమనము చేసి ప్రాణత్యాగం చేసిన మాద్రి, భర్త వియోగ దుఃఖాన్ని దిగమింగు కొని పిల్లల్ని కాపాడుకోవటానికే బతికిన కుంతీ మొదలగు వైవిధ్యం గల పౌరాణిక పాత్రలు స్త్రీల ఔన్నత్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని, సత్వరజస్తమో గుణములతో పాటు ధర్మ గుణాలను ప్రతిబింబిస్తాయి.



కథాపరంగా ప్రాముఖ్యం కలిగిన గంగ, సత్యవతి, గాంధారి, మాద్రి, అంబ, ద్రౌపది హిడింబి, సుభద్ర, సుధేష్ణ, ఇలా ఎంతో వైవిధ్యం కలిగిన 360 స్త్రీ పాత్రలు భారతంలో ఉన్నాయి. దివ్యమానవ రాక్షస పాత్రలు, పశుపక్ష్యాదులైన పాత్రలు, నదులైన స్త్రీలు, స్త్రీలైన నదులు, మానవతా విలువలు ప్రబోధించే పాత్రలు, భిన్న జీవన దృశ్యాలను ప్రతిబింబించే పాత్రలు ఇవన్నీ స్త్రీలోని దైవత్వాన్ని చాటిచెప్పేవే.

శ్రేయోమార్గంలో మైత్రేయి, ప్రేమ మార్గంలో కాత్యాయని, శుచీదేవి అయిన శచీదేవి, వేద వేత్త వేదవతి, అంతర్యామి అరుంధతి, ఆత్మబంధువు అనసూయ, సంపదల దేవి లక్ష్మి, ప్రేమ రస చైతన్యమైన ఊర్వశి, పరాశక్తి పార్వతి, చదువుల తల్లి సరస్వతి పురాణాల్లో పూజనీయులైన మహిళలు.

ప్రాచీనాంధ్ర దేశంలో మొదటిసారిగా స్త్రీలను గురించిన ప్రసక్తి మనకు శాతవాహనుల శాసనములలోను, హాలుడు రాసిన గాథాసప్తశతిలోను, గుణాఢ్యుని సరిత్సాగరంలోనూ వ్రాయబడిన ఆధారాలలో ఆనాటి స్త్రీ వేషభాషలు, గృహిణి బాధ్యతలు, వారు చేయు వ్రతములు, దానధర్మములు, విద్య మొదలగునవి తెలియును.

స్త్రీ వ్యక్తిత్వం పునాదిగా నడిచిన వ్యవస్థ

మాతృస్వామ్య వ్యవస్థ. సామాజిక భావాన్ని సహజంగానే కలిగిన స్త్రీ సమాజ రూపాలను అనేక యుగాలలో నిర్ణయించి, నిర్మించి వాటి పరిణామాలకు మూలశక్తిగా నిలిచింది.

ఆనాటి నారీమణుల మనోనిగ్రహం, కర్తవ్య పరాయణతత్వంలో అంతర్లీనంగా, నిక్షిప్తంగా ఉన్న ప్రతిభాపరిమళాలను పీల్చుతూ ఈ మహిళాదినోత్సవ సందర్భంగా పునరావృతం చేసుకోవడం మన కర్తవ్యం.

చరిత్ర చూస్తే నాగమ్మ వంటి రాజనీతిజ్ఞులు, రుద్రమ్మ వంటి వీరవనితలు, మాంచాల, చానమ్మవంటి వీర పత్నులు, మొల్ల ముద్దుపళని వంటి సాహితీమూర్తులందరూ లబ్దప్రతిష్టులే.

స్వాతంత్రోద్యమంలో వీర విహారం చేసిన ఆంధ్ర మహిళలు ఉద్యమం ముగిసిన తర్వాత విరివిగా స్వచ్ఛంద సేవా సంస్థలను నెలకొల్పి అవసరమున్న స్త్రీలకు, పిల్లలకు స్వతంత్రంగా జీవించడానికి చేయూతనిచ్చారు.

భారతదేశంలో హైదరాబాద్ నవాబు ఆఫ్రికా స్త్రీలను రక్షకభటులుగా నియమించుకున్నాడు. ప్రథమ స్వతంత్ర సమర కాలంలో ఝాన్సీ లక్ష్మీబాయి వీరోచితంగా పోరాడిందని మనకు తెలియంది కాదు.

ఆటవిక దశలో స్త్రీ అన్ని రంగాల లోనూ పురుషునికే మాత్రం తీసిపోలేదు. స్త్రీలు యుద్ద సామర్థ్యం కలిగివున్నట్టు చరిత్ర మనకు చాటి చెపుతోంది. మానవ శ్రమ సమాజాన్ని ముందుకు నడిపిన అన్ని





**ప్రథమ స్వతంత్ర సమర కాలంలో ఝాన్సీ లక్ష్మీబాయి వీరోచితంగా పోరాడిందని మనకు తెలియంది కాదు. ఆటవిక దశలో స్త్రీలన్ని రంగాలలోనూ పురుషునికే మాత్రం తీసిపోలేదు. స్త్రీలు యుద్ధ సామర్థ్యం కలిగి వున్నట్టు చరిత్ర మనకు చాటి చెపుతోంది. మానవ శ్రమ సమాజాన్ని ముందుకు నడిపిన అన్ని దశల్లో స్త్రీయే కీలక పాత్ర వహించింది.**

దశల్లో స్త్రీయే కీలక పాత్ర వహించింది. నిప్పు ఉపయోగాన్ని తెలుసుకున్న కాలంలో జలచరాలైన చేపలు, నత్తలు తినే కాలంలో ఆహార సేకరణకు నదీ తీర ప్రాంత నాగరికత నిర్మాణం రూపొందించే కాలంలో కూడా స్త్రీ శ్రమయే ప్రధాన స్థానం వహించింది. జంతువులను వేటాడే దశలో ఆ మాంసాన్ని వండవలసిన అవసరాన్ని కూడా స్త్రీయే ముందుగా గమనించి ఉంటుంది. శరీరాన్ని కప్పు కోవాలనే ఆలోచన, కట్టుకోడానికి చెట్టు ఆకులను, బెరడును ఉపయోగించాలనే ఆలోచన కూడా స్త్రీకే ముందుగా కలిగుంటుంది. ప్రసవ కాలంలో ఒకచోట కొంతకాలం నివసించవలసిన అవసరం గుర్తించి స్త్రీయే గూడుకు సంబంధించిన ఆలోచన చేసి ఉంటుంది. స్త్రీ స్వామ్యం ఉన్న కాలంలో వర్గ సమాజం, దోపిడి సమాజం, పునాదులు బలపడలేదు.

రాతియుగం వరకు స్త్రీలు అన్ని రంగాలలో ముందంజలో ఉన్నారు. దేవతల ఆరాధనలో కూడా స్త్రీకే ప్రధాన స్థానం ఉండేది. ఆదిమ ఆటవిక సమాజంలో వ్యవసాయాన్ని కనిపెట్టింది, పంటలు పండించి సంపదను సృష్టించింది స్త్రీలే. అందుకే స్త్రీనే పంట దేవతగా భావిస్తు స్త్రీ మూర్తికి సంకేతంగా తులసి వంటి కొన్ని మొక్కలను ఎన్నిక చేసి పూజించేవారు. ఈ విధంగా వ్యవసాయ సంస్కృతిని రూపొందించిన స్త్రీలు సింధు నాగరికత విలసిల్లడానికి మూలమైన వ్యవసాయాన్ని అభివృద్ధి చేయటానికి కూడా ఎంతో కృషి చేశారు. మహిళ ఇచ్చేవరాలు భూమితో, శక్తితో, వర్షంతో, ప్రాణవాయువుతో వచ్చేటంతటి శక్తివంతమైనవి.

అమెరికన్ బానిసత్వ నిర్మూలనకు కారణమైన మార్గరెట్ మిచెల్, మధ్య తరగతి జీవితాన్ని చక్కగా చిత్రించిన జేన్ ఆస్టిన్, ప్రపంచ సాహిత్యాన్నే కలవరపెట్టిన ఎమిలీ జోలా, వినూత్న రచనతో వినతి కెక్కిన వర్జీనియావూల్ఫ్, ఇలా ఇలా ఎంతో మంది రచయిత్రులు రచయితలతో పాటు విశిష్ట స్థానాన్ని ఆక్రమించారు.

న్యాయవాద వృత్తిలో 1882 నుండే స్త్రీలు ప్రముఖ పాత్ర వహించారు. హైకోర్టులో చీఫ్ జస్టిస్‌గా పదవిని నిర్వహించిన ప్రప్రథమ మహిళ కేరళలోని 'అన్నాచండీ' కేంద్రప్రభుత్వంలోని సీనియర్ అధికారులుగా ఉన్న స్త్రీలు ఆ పదవులు ఇతరుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడికాకుండా పురుషులతో పోటీ పడి స్వీయ ప్రజ్ఞా పాటవాల వల్ల సంపాదించినవి మాత్రమే. కామన్ మార్కెట్ అనే గ్రంథాన్ని రచించిన ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ లో ప్రొఫెసర్ ధర్మ కుమారి ప్రముఖ మహిళా మణి. కపిల కాత్యాయని భారతీయ నాట్య శాస్త్రంలో ప్రసిద్ధిగాంచింది. విజయమురే అనే మరొక మహిళ ఆటవిక విద్యాల

యంలో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ భారతదేశంలో ప్రప్రథమ ఫిల్మ్ సొసైటీని స్థాపించింది.

పద్మా రామచంద్రన్ విద్యా సాంఘిక సంక్షేమ శాఖలో డిప్యూటీ సెక్రెటరీగా భాధ్యతతో ఓర్పు నేర్పులతో ఆ పదవిని నిర్వహిస్తూ అంతర్జాతీయ మహిళా సంవత్సర సందర్భంగా పెట్టుకున్న మెక్సికో సమావేశానికి కావలసిన విషయ సేకరణ బాధ్యతను నిర్వహించిన ప్రతిభావంతురాలు.

మనోరమ ఛాల్లా కొలంబోలో భారతీయ హై కమిషన్ పదవిని స్వీకరించింది. ప్రఖ్యాత విప్లవ రచయిత్రి భారతదేశ గానకోకిల సరోజినీ నాయుడు కూతురు లీలామణి నాయుడు విదేశాంగ కార్యాలయంలో ఉపకార్య దర్శిగా అనేక సంవత్సరాలు పని చేసింది. రాయబారి వృత్తిని స్వీకరించి రాయబారి కార్యాలయంలో ప్రవేశించిన విజయలక్ష్మి పండిట్ ప్రపంచంలోనే ఏకైక మహిళ. సోవియట్ రష్యా, అమెరికా, బ్రిటన్ దేశాలలో రాయబారిగానే కాక ప్రపంచంలో ఐక్యరాజ్యసమితికి అధ్యక్షత వహించిన ప్రథమ మహిళ దుర్గాబాయి దేశ్ ముఖ్ అనేక గౌరవమన్ననలను అందుకున్న ప్రఖ్యాత సంఘసేవకురాలు.

వర్షఋతువు వస్తే పచ్చదనం కనిపించినట్టు, వసంతం రాగానే వృక్షాలు చిగురించినట్లు, పొద్దు పొద్దుపొడవగానే అంధకారం పటాపంచలమైనట్లు స్వాభావికంగానే సమర్థురాలు, నేర్పరి సంస్కారవంతురాలైన స్త్రీ అభ్యుదయం విజ్ఞతతో ముందడుగు వేయడానికి నిర్దిష్టమైన కృషి జరపాలి.

మహిళా అభ్యుదయానికి మొట్టమొదటి అవసరం విద్యాభివృద్ధి. గ్రామీణ ప్రాంతాల్లో స్త్రీల స్థాయి అభివృద్ధి చెందాలంటే వారి విద్యా స్థాయి పెరగాలి. మానవ శ్రమ శక్తిలో గ్రామీణ స్త్రీ భాగస్వామి కావాలంటే విద్యా స్థాయితో పాటు ఆయా శిక్షణలు పొందే అవకాశం, ఉద్యోగావకాశం లభించాలి. అప్పుడే స్త్రీలు పనిచేసే పరిధి విస్తృతం కాగలదు.

ఈ విధంగా స్త్రీలు స్వచ్ఛంద సేవారంగంలో ముద్రణ రంగాల్లో, పత్రికా రంగాల్లో, సమాచారం టూరిజంలో, వాణిజ్య, విద్యా, వైద్య, న్యాయవాద, శాస్త్రీయ, కళారంగాలలో ప్రగతిని సాధించారు.

భారతీయ మూలాలు వున్న తమిళనాడుకు సంబంధించిన స్త్రీమూర్తి కమలాహారిస్ ఇటీవలే అమెరికా ఉపాధ్యక్షురాలు కావడం, పారదర్శకత జవాబుదారీతనం అంశాలపై అవిశ్రాంతంగా సమాచార హక్కు కోసం పోరాటం సల్పిన సామాజిక ఉద్యమకారిణి అంజలి భరద్వాజ్‌కు ఇటీవలే ఇంటర్నేషనల్ యాంటీ కరప్షన్ అవార్డు అమెరికా బైడన్ ప్రభుత్వం ప్రకటించడం స్త్రీ జాతికే గర్వకారణం.

దేశ జనాభాలో సగ భాగమైన వీరు పురుషులతో పాటుగా, సాటిగా నిలబడగలిగినప్పుడే దేశం, ప్రపంచం సర్వతోముఖాభివృద్ధి చెంది సత్వరంగా ముందుకుపోగలదని, పోవాలని ఈ మహిళా దినోత్సవ సందర్భంగా స్వచ్ఛందంగా ఆశిద్దాం.



# చందమామ



డా॥ ఆరుట్ల శ్రీదేవి, 95505 54866

అతడు ఓ చందమామ
అతన్ని చేరాలంటే
కాలు కదపనవసరం లేదు
వ్యోమనౌకలెక్కనవసరం లేదు
కళ్ళలో కౌముది కిరణాలు
వెల్లి విరిస్తే చాలు
కాంతి వేగంతో అటు చేర గలం
అతడు ఓ కలువలరాజు
అతడితో మాట్లాడాలంటే
పెదవి విప్పనవసరం లేదు
సాంకేతిక సందేశాలు పంప నవసరం లేదు
మనకున్న చల్లని మనసును
ఆ వెన్నెల మనసుతో
కలుప గలిగితే చాలు

ఆమె ఓ కలువ భామ
నిదురించే కొలనులో
విరియ బూసిన సుమబాల
అలసిన వెన్నెల రేడుకు
పరిమళ తెమ్మెరలు విసిరి
అలరించే రస జాన
సన్నటి కన్నుల రేకులతో
నిశ్శబ్దపు వలపులు చిలికే
కుసుమా లలనా
నీలాల రంగులో
నీలామని తానై
లేత వెన్నెల్లోన ముత్యాల సొగసై
అనురాగం మేళవించిన
ఆమె
పుప్పొడి రాగ శోభ

# అశరీర



మాదస్త ప్రణవి, 93478 10982

విశాలంగా ఉన్న ఓ ఉద్యానవనంలో పచ్చికబయల్ల మీద
అటూ ఇటూ తిరుగుతున్న తెల్లపావురములా
ఆమె అతని కోసం ఎదురు చూస్తున్నది
అతని చేతి కుంకుమ ఆమె పాపెటలో పూయిస్తాడని
ఒంటరైన తన బ్రతుకుకొమ్మపై జంటపక్షై ఉంటాడని
కలలన్ని కళ్లలో దాచుకుని ఎదురు చూస్తున్నది.

అలా కాసేపటి తరువాత
ఆమెకు కొద్ది దూరంలో ఉన్న ఓ చెట్టుకింద
చాటుగా ఓ పిచ్చివాడు కూర్చున్నాడు.
చినిగిన బట్టలు, చెరిగిన జుట్టుతో,
దుఃఖాన్ని గొంతులోనే బిగబట్టి,
బిక్కుబిక్కు మంటూ చూస్తున్నాడు.
అతని ఒంటి నిండా గాయాలు,
గుడిలో ప్రసాదం దొంగలించాడని
అక్కడి జనం అంతా కలిసి
ఆ పిచ్చివాడిని చితకబాదారు.

తన పిడికిలిలో ఉన్న పులిహోరను మాత్రం
భద్రంగా దాచుకుని చాటుగా తింటున్నాడు.
కాసేపు ఆమె అతడిని గమనించింది.

ఇంతలో....
ఆమె హృదయం బద్దలు అవుతుంటే
ఓ వైపు కన్నీళ్ళు ఏరులై పారుతున్నాయి
ఆమె అడుగులు తడబడుతున్నాయి,
ఆశలు ఆవిరి అవుతున్నాయి,
అతడిని ఆ స్థితిలో చూస్తానని
ఆమె అనుకోలేదు బహుషా....
అతడి వద్దకు వెళ్లి తన చేతితో అతడి
తలను నెమిరింది, కానీ అతనికి స్పర్శ లేదు
గుండెలు బాదుకుంటూ ఏడ్చేస్తుంది,
కాని అతనికి వినిపించటం లేదు
అమాంతంగా కౌగిలించుకుంది
కాని తన చేతికి చిక్కటం లేదు
ఇంతలో ఆమె కాస్త కంగారు పడింది
కాని, తొందరగా ఓ విషయం గుర్తు తెచ్చుకుంది
కొద్ది రోజుల క్రితమే
ఆమె శరీరాన్ని విడిచి వెళ్లిందని....

కథ

# ఉన్నది ఒకటే జీవితం

బంధనాలు తెంపుకొన్న ఆధునిక స్త్రీ...



డా॥ వాణీ దేవులపల్లి
98669 62414

నిన్నటి నుండి మనసంతా పిచ్చి పిచ్చిగా ఉంది. అసలేం చెయ్యాలో తోచట్లేదు శ్రీజకు. ఆల్రెడీ ఎన్నిసార్లు బావురుమని ఏడ్చిందో లెక్కేలేదు. పాపను కూడా పట్టించుకోలేదు తను. పాపం చిట్టి తల్లి. అది నలిగిపోతోంది మధ్యలో.

పెళ్ళయ్యి ఆరేళ్ళు కావస్తోంది. నాలుగేళ్ల పాప. రాకేష్‌ను అంచనా వెయ్యడంలో తను పొరపాటు పడిందా? ఉత్త పొరపాటు కాదు. మహా తప్పిదం చేసింది అన్పిస్తోంది. అయినా పెళ్లికి ముందు ఎంత చక్కగా మాట్లాడాడు? నవ్వుతూ, జోక్ లేస్తూ..!

అదంతా నటన నేనా? కజిన్ వాళ్ళయింట్లో తనను చూసి ప్రపోజ్ చేశాడు రాకేష్. సాఫ్ట్ వేర్ ఇంజనీరు. అతనితో మాట్లాడాక వద్దనడానికి తనకేం కారణం కన్పించలేదు. కట్నానికి వ్యతిరేకిని అని తనంటే తాను కూడా వ్యతిరేకినే అని రాకేష్ అనడం శ్రీజకు చాలా నచ్చింది. కోరి వచ్చిన సంబంధం సుఖపడతావన్నారు అమ్మానాన్న.

"శ్రీజకు పీజీ చేయాలనుంది మీకు అభ్యంతరం ఏమీ లేదు కదా" అని నాన్న అడిగినప్పుడు, నవ్వి, "నేను పొద్దుట వెళితే రాత్రి వస్తాను ఇంటికి. తను ఇంటాబయటా మానేజ్ చేసుకుంటే నాకేం అభ్యంతరం లేదండీ" అన్నాడు.

అందులో తిరకాసు తనకర్థం కాలేదప్పుడు. ఎప్పుడూ ఇంటి నిండా జనం. ఒక్క అమ్మ బాధ్యత తప్ప నాకెలాంటి బాధ్యతలు లేవు అని పెళ్లికి ముందు చెప్పిన రాకేష్ మాటలు అబద్ధమని తెల్సింది త్వరలోనే. అట్లని, తాను బాధ్యతల నుండి పారిపోయే స్వభావమేం కాదు. తానూ పెద్ద కుటుంబం నుండే వచ్చింది కదా! కానీ రాకేష్ అబద్ధం చెప్పడంలో మరేదో ఉంది అనిపించింది. తన అనుమానం నిజమే అయింది. రాకేష్‌తో పాటు, వాళ్ళ అమ్మ గారే కాక, పెళ్లి అయ్యి, పిల్లలు లేని అక్క, అత్త గారింట్లో ఉమ్మడి కుటుంబంతో సరిపడక, ఎప్పుడూ ఇక్కడే ఉంటుంది. చెల్లి కూడా పెళ్ళయిందన్న పేరే గానీ ఏడాదిలో ముప్పావు కాలం ఇక్కడే తల్లి దగ్గర. ఎవ్వరూ ఇటున్న పుల్ల అటు పెట్టరు. తమ భార్యా భర్తల మధ్య ప్రైవసీ సంగతి అటుంచితే, వీళ్ళందరికీ వండి వార్చి, సేవలు చేసి కాలేజికి వెళ్ళొచ్చేసరికి ఊపిరి ఆగినంత పని అయ్యేది తనకు. దానికి తోడు వాళ్ళందరి కోసం ఎంత చేసినా, తనను పరాయిదానిలా చూస్తూ, ప్రేమ రాహిత్యంతో, అత్తగారు, ఆడబిడ్డల సూటీ పోటీ మాటలు.

ఆ రెండేళ్లు నరకం చూసింది తను. ఎన్నో అవాంతరాల మధ్య పీజీ కంప్లీట్ చేసింది. తరువాత కన్సీవ్ కావడం, పాప పుట్టడం చకచకా జరిగిపోయాయి.

నిజానికి అట్లాంటి పరిస్థితుల్లో కన్సీవ్ కావడం తనకస్సలు ఇష్టం లేకుండే! రాకేష్ తన నసలు పట్టించుకునేవాడు కాదు. చెప్పాలంటే తనను తనే పట్టించుకునేవాడు కాదు. అతని గూర్చిన ఏ విషయం మీద శ్రద్ధ లేదు. పర్సనల్ హైజీన్ లేదు. మంచి దుస్తుల శౌక్ గానీ, ఇంట్లో వస్తువుల శౌక్ గానీ లేవు. దేనిపట్లా అభిరుచి లేదు. యాంత్రికంగా ఆఫీస్ వెళ్లి రావడం, మిగిలిన సమయంలో తల్లి చెప్పిన బాధ్యతలను నెరవేర్చడం, తోబుట్టువుల అవసరాలు తీర్చడం ఇదే అతని జీవితం. అట్లని అతనికి వాళ్ళ పట్లఅంకితభావం, గౌరవం, సద్భావన ఉన్నయనుకుంటే పొరపాటే! అసలు, అతనికి స్త్రీలంటేనే చిన్న చూపు.

నిజానికి స్త్రీలకు గౌరవం, ఆదరణ ఉన్న కుటుంబాలు సంతోషాన్ని వెల్లివిరుస్తాయి. అన్నింటా అభివృద్ధి పథంలో పయనిస్తాయి.

మా అమ్మా వాళ్ళింట్లో తాత, ముత్తాతల నుండీ స్త్రీలను గౌరవంగా చూడటం ఒక పరంపరగా కొనసాగు తోంది. ఇల్లాలు మాటలకు విలువ ఇవ్వడం, ఇల్లాలిని గౌరవించడం ఒక సాంప్రదాయంగా వస్తోంది. ఆ సాంప్రదాయం ఒక సంస్కృతిగా నెలకొంది.

ఇదంతా ఒకవెత్తయితే, అసలు

కథ

రాకేష్‌కు తన కంటూ ఓ జీవితం లేదు. తనకేమో రాకేష్‌తో సరదాగా గడపాలని, కబుర్లు చెప్పాలని, కలిసి తినాలని, కలిసి టీవీ చూడాలని, కలిసి వాకింగ్‌కి వెళ్ళాలని చిన్ని చిన్ని కోరికలు.

రాకేష్ తనతో కబుర్లు చెప్పడం దేవుడెరుగు! అసలు కనీసం మనసిప్పి మాట్లాడిన సందర్భం లేదు పెళ్లయిన ఈ ఆరేళ్లలో. మొదట్లో తను ఎంతో మాట్లాడాలని ప్రయత్నించేది. కానీ అతని సీరియస్ చూపులు అల్లంత దూరం నిలిపేవి తనను. ఎప్పుడూ సెగలు, పొగలుగా రగులుతూ అశాంతిగా ఉండేవాడు.

అతనికి తను నవ్వుతూ పెద్దగా మాట్లాడ్డం ఇష్టం ఉండదు. తన ఆఫీస్ వాళ్ళు ఎవరైనా వస్తే బయటకు రాకూడదు. నైటీలు వేసుకోవడం ఇష్టం ఉండదు. మొత్తానికి రాకేష్ నిజ స్వరూపం తనకు నెమ్మది నెమ్మదిగా అర్థం కాసాగింది. అంతే కాదు, అతని మూడ్ ఎప్పుడెలా ఉంటుందో అర్థం కాదు.

తను మొదట్లో ఉక్కిరి బిక్కిరి అయింది అతని విపరీత ప్రవర్తనకు. మార్చడానికి ప్రయత్నించింది. కానీ అసలు మాట్లాడడే! మాట్లాడుతుంటేనే లేచి వెళ్ళిపోతాడు. ఎప్పుడో తనకు మూడ్ ఉన్నప్పుడు, ఎలాంటి మాటలూ లేకుండా ఓ పశువులా వాంఛ తీర్చుకోవడం అతని నైజం! ఇదో పర్సనాలిటీ డిజార్డర్ అని తనకర్థమైంది. భార్యను మనిషిలా చూడలేని వికార వ్యక్తిత్వం. ఇట్లాంటి ప్రేమ రాహిత్య, అబ్నార్మల్ వ్యక్తితో జీవితం నరకం అన్పిస్తోంది. ఏం చెయ్యాలి? ఎంత కాలం ఆత్మ వంచనతో బతకాలి? ముద్దులొలికే పాపాయినీ ప్రేమగా చూడలేని అతనిలో మార్పు కోసం ఎంత కాలం ఎదురు చూడాలి ఇంకా? దుఃఖం తన్నుకొచ్చింది శ్రీజకు.

నాన్న గారు పోయాక, ఊళ్ళో ఒంటరిగా ఉంటున్న అమ్మకు చెప్పలేక పోయింది తన పరిస్థితి. అమెరికాలో ఉంటున్న అన్నయ్యకు చెప్పి బాధ పెట్టలేకపోయింది. బాగా ఆలోచించిన

**నాన్న** గారు పోయాక, ఊళ్లో ఒంటరిగా ఉంటున్న అమ్మకు చెప్పలేక పోయింది తన పరిస్థితి. అమెరికాలో ఉంటున్న అన్నయ్యకు చెప్పి బాధ పెట్టలేకపోయింది. బాగా ఆలోచించిన మీదట ఫ్రెండ్లీగా ఉండే వదినకు చెప్పింది. వదిన చాలా బాధ పడింది విషయం తెలిసి. కొంత కాలం ఓపిక పట్టమని, తనకు ఏ అవసరం వచ్చినా తాము అండగా ఉంటామని కొండంత ధైర్యాన్ని ఇచ్చింది.

మీదట ఫ్రెండ్లీగా ఉండే వదినకు చెప్పింది. వదిన చాలా బాధ పడింది విషయం తెలిసి. కొంత కాలం ఓపిక పట్టమని, తనకు ఏ అవసరం వచ్చినా తాము అండగా ఉంటామని కొండంత ధైర్యాన్ని ఇచ్చింది.

కానీ, తన దురదృష్టానికి ఎవరేం చెయ్యగలరు? నిర్ణయం తీసుకోవాల్సింది తనే! పాప భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఎట్లాంటి ఎక్స్ట్రీమ్ నిర్ణయం తీసుకోలేక పోతోంది తను. ఇంత కాలం ఇలానే గడిచిపోయింది.

కానీ, నిన్నటి సంఘటన మనసును మెలి వేస్తోంది.

అంతకు ముందు తన కజిన్స్ ఒకరిద్దరు ఇంటికి రావడాన్ని అయిష్టం గానూ అనుమానం గానూ చూసిన రాకేష్ నిన్నటి సంఘటనతో తన క్యారెక్టర్ పైన కూడా అనుమాన పడుతున్నాడని స్పష్టంగా తేలిపోయింది. చుడీదార్ వేసుకోవడం, నైటీ లు వేసుకోవడం, జుట్టు వదిలేసి క్లిప్పు పెట్టుకోవడం ఎందుకో అతనికి నచ్చదు అని రాకేష్ చెబితే పెద్దగా పట్టించుకోలేదు తను. కానీ తను ఒక మంచి చీర కట్టుకుని తయారవడం కూడా అతను జీర్ణించుకోలేడు అని తెల్సుకోవడానికి ఎక్కువ సమయం పట్టలేదు శ్రీజకు.

కానీ... కానీ.. నిన్నటి అతని విపరీత ప్రవర్తన దేనికి పరాకాష్ట అనుకోవాలి? రెండు నెలలవుతోంది తనకు పీరియడ్స్ రాక. అదే విషయం అతనితో చెప్పి డాక్టర్ వద్దకు వెళ్దామని అడుగుదామనుకుంది.



క
థ

ఇంట్లో ప్రైవసీ లేకపోవడం వల్ల, నిన్న డాబా మీదికి రమ్మని చెప్పింది విషయం. అతని రెస్పాన్స్ చూసి షాక్ అయ్యింది తను. విషయం విని కోపంతో ఊగి పోయాడు రాకేష్! తనకర్థం కాలేదు ఎందుకో.

"ఛాన్స్ యే లేదు" అన్నాడు కోపంగా. "ఏంటి? ఏమంటున్నావ్?" అంతే కోపంగా అడిగింది శ్రీజ. గబగబా కిందికి వెళ్లి క్యాలెండర్ తెచ్చాడు. "ఇదిగో ఈ డేట్స్ రౌండ్ అప్ చేశాను చూడు. ఇవి ఏంటి అనుకున్నావ్? మనం కల్సిన డేట్స్. అవీ పూర్తిగా సేఫ్ పీరియడ్ టైమ్ లోనే! కాబట్టి నువ్వు కన్సీవ్ అయ్యే అవకాశమే లేదు." ఆపైన నాకేం వినిపించలేదు. కొయ్య బొమ్మలా నిల్చుండిపోయాను. నన్ను అనుమానిస్తున్నాడని అర్థమైంది.

నేను షాక్ లోంచి తేరుకోవడానికి చాలా టైమ్ పట్టింది. అర్థం అయిన మరుక్షణం కళ్ళు జలపాతాలయ్యాయి. అంటే, నా పీరియడ్స్ డేట్స్ దగ్గరి నుండి గుర్తుంచుకుని, సేఫ్, అన్ సేఫ్ పీరియడ్‌ను గుర్తుంచుకుని... ఏంటి ఈ మనిషి? ఇది దేనికి సంకేతం? నాకు తల దిమ్మ దిరిగి పోయింది. ఆక్రోశం, ఆవేదన కమ్ముకోగా, బావురుమని ఏడ్చేసా. అక్కడే కూలబడి పోయా చాలా సేపు.

ఇట్లాంటి వ్యక్తి తోనా తను జీవితం పంచుకుంది? ఇది అసలు పెళ్లేనా? అసలు జీవితమేనా? ఆరేళ్ళుగా ఇట్లాంటి వ్యక్తితో ఎట్లా సహ జీవనం చేస్తోందసలు తను? ఒక మంచి మాట లేదు, ప్రేమ లేదు, స్నేహం లేదు, ప్రశంసలేదు. ఏదైనా మాట్లాడితే నెగెటివ్‌గానే తప్పితే పాజిటివ్‌గా ఒక్కనాడు మాట్లాడింది లేదు.

అతనికి, అతని కుటుంబానికి ఎంత చాకిరీ చేసినా ఒక్క ప్రేమ పూర్వక అభినందన ఉండదు. పైగా, అది కోడలిగా, నా బాధ్యత, వాళ్ళ హక్కు అన్నట్టు ప్రవర్తిస్తాడు. ఇదా పెళ్లంటే అసలు? ఒకరికి ఒకరుగా ఉండడం కదా పెళ్లంటే? ఒకరి కోసం ఒకరు కదా పెళ్లంటే?

అమ్మా, నాన్నా ఎంత ప్రేమగా ఉండేవారు! అంత మోతుబరి రైతు అయినా నాన్న, పనివాళ్ళు రానప్పుడు అమ్మకు పనుల్లో సహాయం చేసేవారు. అమ్మ కొంచెం అలసటగా కనిపిస్తే, గాబరా పడిపోయేవారు. అమ్మ ఒంట్లో నలతగా ఉందని పడుకుంటే ప్రేమగా టీ కాచి తెచ్చి ఇచ్చేవారు. ఎప్పుడు చూసినా, చీర చాలా బావుందనో, నీకు ఇంకా నప్పింది అనో, ఏ వంట చేసినా నీ చెయ్యి తీరే లే పద్మా అంటూ అభినందనలు కురిపిస్తే అమ్మ నాన్న వంక అభిమానంగా చూసి "చాల్లెండి" అంటూ ముసిముసిగా, మురిపెంగా నవ్వేది.

ఊళ్లోని వ్యవహారాలు, పంట విషయాలు, ఆర్థిక విషయాలు అన్నీ అమ్మతో పంచుకునేవారు నాన్న. స్నేహితుల్లా ఉండేవారు ఇద్దరూ. ఇద్దరూ కలిసి పొలం కెళ్ళడం, చెరువు కట్ట వరకూ కబుర్లు చెప్పుకుంటూ వ్యాహ్యాళికి వెళ్లి రావడం.. తను అబ్బురంగా చూసేది అమ్మా నాన్నను. అది కదా పెళ్లంటే? అది కదా జీవితమంటే! ఎప్పుడూ సరదా సరదాగా ఉండే అమ్మా నాన్నను, ప్రేమగా అల్లరిగా ఉండే అన్నయ్య, వదినను చూసిన తనకు రాకేష్ వాళ్ళ కుటుంబ సభ్యులను, రాకేష్‌ను చూస్తే వింతగా అనిపించేది. ఎక్కడుంది లోపం? ఎంత ఆలోచించినా ఓ పట్టాన అర్థం

**"ఛాన్స్ యే లేదు" అన్నాడు కోపంగా. "ఏంటి? ఏమంటున్నావ్?" అంతే కోపంగా అడిగింది శ్రీజ. గబగబా కిందికి వెళ్లి క్యాలెండర్ తెచ్చాడు. "ఇదిగో ఈ డేట్స్ రౌండ్ అప్ చేశాను చూడు. ఇవి ఏంటి అనుకున్నావ్? మనం కల్సిన డేట్స్. అవీ పూర్తిగా సేఫ్ పీరియడ్ టైమ్ లోనే! కాబట్టి నువ్వు కన్సీవ్ అయ్యే అవకాశమే లేదు." ఆపైన నాకేం వినిపించ లేదు. కొయ్య బొమ్మలా నిల్చుండిపోయాను. నన్ను అనుమానిస్తున్నాడని అర్థమైంది.**

కాకపోయేది.

ఆలోచిస్తూ అలా ఎంతసేపు కూర్చుందో అక్కడే! మనసంతా కకావికలం అయిపోయింది. తన మనస్సాక్షి తనను హెచ్చరించినట్టు అన్పించింది. "శ్రీజా! ఉన్నది ఒకే ఒక్క జీవితం! పెళ్లి అనేది జీవితంలో ఒక భాగం మాత్రమే! ఈ పెళ్లి ఒక పీడకల అనుకో. ఈ జీవితాన్ని ప్రేమ రాహిత్యమనే కుంపట్లో మాడి మసి కానివ్వొద్దు. ముఖ్యంగా, నీ చిట్టి తల్లి భవిష్యత్తు గూర్చి ఆలోచించు. ఆ చిన్నారి జీవితాన్ని బలి చేసే అధికారం నీకు లేదు" ఉలిక్కి పడింది ఒక్కసారిగా. తాను చేసిన తప్పును దిద్దుకోవాలి. ముఖ్యంగా పాపాయికి ఒక ప్రేమమయ, ఆనందమయ, భద్రతతో కూడిన జీవితం ఇవ్వాలి. ఆరోగ్యకరమైన వాతావరణంలో పెంచి, చక్కటి వ్యక్తిత్వంతో తీర్చిదిద్దాలి. అవును. అప్పుడే తను హ్యాపీగా ఉండ గలుగుతుంది. కాస్సేపటికి ఒక స్థిర నిర్ణయానికి వచ్చిన శ్రీజ కళ్ళు తుడుచుకుని ఫోన్ తీసి, తన పర్సనల్ విషయాలు షేర్ చేసుకునే, తన ఆత్మీయ స్నేహితురాలు రాజేశ్వరితో మాట్లాడింది. మాట్లాడినంత సేపూ ధారగా ప్రవహిస్తున్న కన్నీళ్లను తుడుచుకుంటోనే ఉంది శ్రీజ.

రాజేశ్వరితో "థాంక్యూ రాజీ... థాంక్యూ వెరీ మచ్.. రేపే జాయిన్ కావడానికయినా నేను రెడీ! పాపను డే కేర్ లో వేస్తా.. అవునా... మీ పై పోర్షన్ ఖాళీ యేనా.. ఓకే థాంక్యూ డియర్..! హా.. అమ్మ కిప్పుడే వద్దు.. వదినకు చెపుతా... అర్థం చేసుకుంటుంది."

కింద కొచ్చి, తన వస్తువులతో బ్యాగ్ సర్దుకొని, పాపాయిని తీసుకొని బయల్దేరింది శ్రీజ. పాపాయి వేపు చూసింది ఒక్క క్షణం. చిరునవ్వులతో కేరింతలు కొడుతోంది పాపాయి. గుండెలకదుముకుంది ఆర్తిగా. ఇంట్లోంచి గేటు దాటి బయట కొస్తుంటే, పోతుందనుకున్న ఊపిరి తిరిగొచ్చి నట్టుగా, ఓ కొత్త ప్రపంచంలోకి అప్పుడే అడుగు పెడుతున్నట్టుగా అనిపించింది శ్రీజకు.

కవిత

# పొత్తి కడుపు మీద... కుట్ల గాట్లు...



తుమ్మల కల్పన రెడ్డి, 96404 62142

ఆ కిట్ల ఆరు సుక్కల ముగ్గుకెర్క
ఆమె అంగి ఆకిలుడిస్తేనే దానికందమచ్చిందని...!!
పెరట్లో పూసిన మందారనికెర్క
ఆమె చేత్తో సెంబెడు నీళ్ళు పోస్తేనే విప్పుకోగల్గిందని..!!
ఇంటి ముందలుండే కడపకెర్క ఆమె పసుపు
రాసి పచ్చ ముగ్గేస్తేనే లక్ష్మికళ అచ్చిందని...!!
దిగుట్లున్న గల్లగురిగికెర్క ఆమె దాసిపెట్టిన
చిల్లరేస్తేనే దాని బరువు పెరిగిందని...!!
మట్టి గాజుల సప్పుడుకెర్క ఆమె నిద్రలేస్తేనే
సావు లాంటి నిశబ్దం సచ్చిపోయిందని..!!
బొట్టుపెట్టెలో ఉన్న కుంకుమకెర్క ఆమె
నుదుట పెట్టుకుంటేనే  అదెంత ఎర్రగుందో తెలిసిందని..!!
చేతిగోళ్ళలో ఇరికిన ముర్కికెర్క ఆమె
బండెడు చాకిరి సేస్తేనే తనక్కిక్కడ చోటు దొరికిందని...!!
మట్టిలోతుల్లో నుండి బైటికచ్చిన ఆరుద్ర పురుగుకెర్క
ఆమె పొత్తి కడుపు మీద కత్తిపోట్లు పడితేనే సృష్టి నడుస్తోందని...!
చింతపండులో గింజలెక్క ఒదిగి ఉండమన్నారు ఆమెను...!!
బియ్యంలో మెరిగలేరేసినట్టు ఏరి పారేస్తున్నారు ఆమెను..!!
ఇక ఆమె ఎదిగేదెప్పుడు.?
నలుగుర్లోకి అచ్చేదెప్పుడు.?
వెలుగులో బతికేదెప్పుడు.?
మరి సమాజానికెన్నడు ఎర్కయితది
ఆమెకొక “మనసుందని”???

(అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాసిన కవిత)

క
థ

# తెరిడిన పువ్వెండ

ఆత్మవంచన చేసుకున్న విద్యావంతుల వైనం...



డా॥ గోగు శ్యామల
98669 78450

ఎవరి నోట విన్నా అదే మాట !

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నదీ వార్త! ఇండియా అమెరికా డయాస్పోరా బృందాల్లోనూ సంచలనమైన వార్త. "ఇంత కాలం ఆమె తన కులాన్ని దాచిపెట్టింది..! దాచిపెట్టడం వరకే ఆగిందా..? పైగా తాను బ్రాహ్మిణ్ అని చెప్పుకుంది! ఇంత మోసమా? ఇంత ద్రోహమా? అని ఓ ప్రత్యేక గుంపు వ్యక్తుల మధ్య జరుగుతున్న చాటింగ్లో ఓ తరహా చర్చ అది.

"ఈ రోజు మనం కాఫి టేబుల్ దగ్గర కలవాలనుకుంటా, మీరేమంటారు నేస్తం? "చొరవ తీసుకుని ప్రతిపదించాడు. పండిట్.

"ఔనూ, మనం కలవాల్సిందే" బదులిచింది క్రాంతి.

'తప్పకుండా' బలపరిచాడు వర్మ.

తరుచుగా కలుసుకునే ఆ నలుగురు మిత్రుల్లో ఒక మిత్రురాలు యాసిక. కాఫీ టేబుల్ ఆహ్వానానికి ఆమె నుండి ఎలాంటి స్పందన వచ్చినట్టు లేదు. ఈ చర్చను చూడడానికి నెట్‌లోకి కనీసం లాగిన్ అయినట్లు కూడా లేదు. అనుకున్నట్లుగానే ఆమెను మినహాయించి ముగ్గురు కాఫీ సెంటర్‌కు చేరుకున్నారు. యాసికతో సహా టేబుల్ చుట్టూ కూర్చున్న వీరందరూ 'టైమ్స్ ఆఫ్ జంబూ ఐలాండ్' పత్రికలో పనిచేసే ప్రధాన పాత్రికేయులు. ఈ పత్రిక యొక్క ప్రధాన కార్యాలయం అమెరికాలోని సిలికాన్ వ్యాలీ ప్రాంతంలో ఉన్నది. పత్రిక కార్యాలయానికి దాదాపు వంద మీటర్ల దూరంలో ఉన్న సబ్వే లోని కాఫీ లవర్స్ జోన్లో, అందమైన బోన్సాయ్ వృక్షాలు నెలువైన ఓ మూలన పొందికగా అమర్చిన టేబుల్ దగ్గర ఆ నలుగురు తరుచుగా బేటి అవుతారు. మాములుగా కూడా పాత్రికేయులు తరుచుగా కేఫ్‌లోకి చేరి సిగరెట్స్ దమ్ములతో.. కాఫీ సిప్ ముచ్చట్లతో.. సేద దీరుతారు. అనుకున్న సమయానికి ముగ్గురూ అక్కడికి చేరుకొని ఎవరికి కావాల్సిన తిండి పదార్థాలను వారు ఆర్డర్ చేశారు. కానీ స్నాక్స్ తినడంపై, కాఫీ తాగడంపై వారికి ప్రతిరోజూ ఉన్నట్లు ధ్యాసలేదు. ఇక్కడ 'మాట్లాడుకోవడం కోసం తినడం తాగడం' అనేది ఈ రోజు ప్రత్యేకత. అయితే, ఎప్పటిలా కాకుండా టేబుల్ చుట్టూ ఉన్న నాలుగు కుర్చీలలో మూడు మాత్రమే భర్తీ అయినవి. వారి మిత్రురాలు యాషిక గౌతమి కూర్చో వాల్సిన కుర్చీ మాత్రం కాలిగానే ఉంది. అసలీ అత్యవసర కలయికకు ఆ ఖాళీ కుర్చీలో కూర్చోవాల్సిన ఆమెనే కారణం కదా..!

"నేను దళిత్! అంతే కాదు.. నేను దళితుల్లో దళిత్ ఐన మెహతర్‌ను అని ఉదయం ఆరుగంటలకు సుప్రభాతంలా ప్రకటించింది.!." ఖాళీ కుర్చీని చూస్తూ ప్రశ్నర్థకంగా అడిగాడు అందులోని మరొకరైన పండిత్ గోముఖం.

అదీ... అంత ఆర్బాటంగా సోషల్ మీడియాలో ప్రకటించడమా?

అదేంటి క్రాంతి ఇలా జరిగింది!? ఆశ్చర్యకరమైన ప్రశ్న మళ్ళీ అడిగాడు గోముఖం.

"అదే.. నాకూ అంతుపట్టకుండా ఉంది..!" బదులిచ్చింది క్రాంతి శాస్త్రి.

"తనకు తాను చెప్పేంత వరకు మనకు తెలియనే లేదు. కనీసం మన ఊహకైనా తట్టలేదు కదా!" కల్పించుకొని మరీ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడు విష్ణువర్మ.

ఓ మై గాడ్!! ఏమి జరుగుతున్నది మనచుట్టూ..? ఉన్నట్టుండి నిశ్శబ్దం.

'ఒక వేళా కర్మగాలి ఎప్పటి లాగానే, ఏమీ జరగనట్లు మాములుగా వచ్చి ఆమె మన గుంపులో, ఈ ఖాళీ కుర్చీలో, మనముందు ఇప్పుడే ఇక్కడ కూర్చున్నదనుకో.. మనం, ఎప్పటిలాగే తనతో మాట్లాడ గలమా?' అని అందరినీ ఒక మారు తేరిపారా చూశాడు వర్మ.

'ఎలా మాట్లాడ గలం, అదేమన్నా ఆషామాషి అబద్ధమా? బదులు పలికింది క్రాంతి.

ఆ.. హా.. అందరినీ పక్కకు పెడితేనే

కథ

మాట్లాడగలనా? అని కాస్త జంకాడు తనలో తాను విష్ణు వర్మ. ఏం విష్ణు అంతగా ఆలోచిస్తున్నావు? ఈ మధ్య నీకు ఆవిడతో చాటింగులు ఎక్కువైనయి అనుకుంటా? నీవే చెప్పాలి మరి ఎప్పటిలాగే తనతో మాట్లాడగలమో లేదో?' అని వర్మ ముఖాన్ని చదివిన క్రాంతి ముఖం మీదనే అనేసింది.

కంగు తిన్న వర్మ 'ఇప్పుడు మనం మాట్లాడుకోవాల్సిన విషయమా ఇది..! నోరు మూస్కో క్రాంతి... అని బదులిచ్చేసిండు వర్మ.

అంతా నిశ్శబ్దం ! మరోమారు అందరు సెల్ ఫోన్లో మునిగిపోయారు. సోషల్ మీడియాలోని ట్విట్టర్, ఫేస్బుక్, ఇంస్టాగ్రామ్, టెలిగ్రామ్, వాట్సాప్‌లు అన్నింటిగుండా వారి కనులు చకచకా పరుగెత్తి యాసికా పెట్టిన పోస్టుకు వచ్చిన స్పందనలను మొత్తం చుట్టుముట్టి చూడడానికి వారి సమయాన్ని అంకితమిచ్చారు.

వా.. హాట్ ... ! మెహతర్ అంటే స్కావెంజర్! అంటే పాకీ పని! అని అర్థం తెలుసుకున్న క్రాంతి శాస్త్రి .. రహస్యాన్ని తొలిసారి కనుగొన్నంత ఆశ్చర్యంతో దిగ్గున కుర్చీలో నుండి దూకినట్లు ముందుకు జరిగింది.

నిజామా! వైయ్... మని వామిటింగ్ చేసుకున్నంత ఈసడింపు కవళికల ముఖంతో 'యూ మీన్ పాకీజా'? అని ప్రశ్నార్థకంగా క్రాంతిని చూచాడు పండిత్.

'ఈ చర్చను పొడిగిస్తే మాత్రం వర్మ కోపాన్ని తీవ్రంగానే చవిచూడాల్సి ఉంటుంది. అప్పుడు నోరు ముస్కో అన్నడు ఇప్పుడు కాఫీని మన ముఖాలకు విసిరి కొట్టినా ఆశ్చర్యంలేదు 'మహా తిక్కలోడు'. మనసులోనే అనుకుని ఇక్కడితో ఆపేయ్'! అని కళ్ళతోనే సైగ చేసింది క్రాంతి.

కేఫ్ ద్వారం వైపు ప్రశ్నార్థకంగా ఎన్ని

> **'కుల భావజాలం మనుషులతో ఇలా మాట్లాడిస్తాదా?' 'ఆమ్మో' అని బయపడి 'మరెందుకునేనా భావజాలాన్ని మోశాను? ఇంతకాలం ఇంతగా అనుసరించాను? ఆదరించాను? కాదు. ఆదరించాము!?.' బ్రాహ్మణ కులానికి ఇండియాలో చాలా గౌరవమున్నదని, దళితులను అందులోను మెహతర్, రెల్లి, బంగీ, స్కావెంజలను మరీ నీచమైన రీతుల్లో అవమాన పరుస్తారని, మనకు ఇంత డబ్బుండి అనవసరంగా ఛీత్కారాలు భరించడం ఎందుకని బ్రాహ్మణ కులం అని చెప్పుకున్నారు.**



మార్లు చూసినా యాసికి ఆచూకి లేదు. మరోమారు ఆమె వాల్ చూస్తే తాను ఇంకా లాగిన్ కాలేదు అని తెలిసిపోవడంతో, బరువైన ఆలోచనలతో టేబుల్‌కు వీడుకోలు చెప్పి, మరోసారి కలుద్దాం అనుకొని, నెమ్మదిగా ఎవరి పని మీద వారు వెళ్లిపోయారు.

రాత్రి పొడుగునా నిద్రలేమితో గడిపింది యసికా.

అది 16వ తేదీ, సెప్టెంబర్ నెల 2020వ సం. అంతకు రెండురోజుల ముందు నాడు జరిగిన హాత్రస్ సంఘటనలో '19 సంవత్సరాల దళిత్ అమ్మాయిని సామూహిక అత్యాచారం చేసి! హత్య చేసి! శవాన్ని కూడా తల్లితండ్రులకు ఇవ్వకుండా దహనం చేశారు.!' అని ప్రచురితమైన వార్తలను అన్నీపేపర్లలో క్రమం తప్పకుండా చదివిందామె. తన బ్లాగ్‌లో ఒక విశ్లేషణాత్మకమైన వ్యాసం రాయాలని అనుకుంది. అన్నీ చదివిన తరువాత తాను ఏ స్థానంలో ఉండి ఏ దృక్కోణంలో రాయాలి? అనే ప్రశ్న తనముందు ఒక పెద్ద సవాలై నిలబడింది. హాత్రస్ సంఘటనపై ఇండియాలోని కుల రాజకీయాలు, అమెరికాలో తన చుట్టూ ఉన్న బ్రాహ్మణ ఆధిపత్య కులాల స్నేహితుల స్పందనలు ఆమె ముందున్న ఈ సవాలును మరీ పెద్దది చేసినవి. యసికా దళిత్ అన్న సంగతి తెలియక తన ముందే స్నేహితులు చేసిన కులతత్వ వ్యాఖ్యానాలకు తన మనసు చివుక్కుమన్నది. 'వారు హాత్రస్ బాధిత మృతురాలి పట్ల సానుభూతి తెలియజేయకపోయినా ఫర్వాలేదు కానీ కించపరుస్తూ మాట్లాడడం దారుణమైన విషయం' అనుకుంది. 'ఒక వేల నేను నిజంగానే బ్రాహ్మిణో, ఇతర ఆధిపత్య కులమో అయ్యుంటే కూడా వీరిలాగానే మాట్లాడేదానినా?! అని ప్రశ్నించుకుంది.

'కుల భావజాలం మనుషులతో ఇలా మాట్లాడిస్తాదా?' 'ఆమ్మో' అని బయపడి 'మరెందుకునేనా భావజాలాన్ని మోశాను? ఇంతకాలం ఇంతగా అనుసరించాను?

కథ

ఆదరించాను? కాదు. ఆదరించాము!?.'

బ్రాహ్మణ కులానికి ఇండియాలో చాలా గౌరవమున్నదని, దళితులను అందులోను మెహతర్, రెల్లి, బంగీ, స్కావెంజలను మరీ నీచమైన రీతుల్లో అవమాన పరుస్తారని, మనకు ఇంత డబ్బుండి అనవసరంగా ఛీత్కారాలు భరించడం ఎందుకని బ్రాహ్మణ కులం అని చెప్పుకున్నారు. తన తల్లితండ్రులతో మాట్లాడినపుడు తనకు తెలిసిన సమాచారమిది.

అని తనకు తాను సమాధానపరుచుకున్న యాసికి గౌతమి అమెరికాలో జర్నలిజం చదువుకున్న 27 ఏళ్ల వయసున్న మెహతర్ యువతి. తల్లితండ్రి కులం ధ్రువీకరణ పత్రం అవసరం లేని కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఈమెను చదివించారు. యాసికి తన కుటుంబంలో మూడు తరాలుగా చదువున్నవారు. తాతలు అమ్మమ్మ నాయనమ్మ నిజాం కాలంలోనే ఉపాధ్యాయులుగా పనిచేశారు. తల్లి ప్రొఫెసర్ అయితే తండ్రి గొప్ప చదువున్న వ్యాపారస్తుడిగా స్థిరపడ్డారు. కనుక పెద్ద మొత్తంలో స్వంత డబ్బులను వెచ్చించి ఉన్నత చదువులు చదివింది యాసికి. అలా కొలంబియా యూనివర్సిటీలో జర్నలిజం మాస్టర్స్ చదివింది. వివిధ వినూతనమైన అంశాలపై పరిశోధన వ్యాసాలు రాయడం తనకు ఏంతో ఇష్టం. వీటితో పాటు వివిధ దేశాల్లోని ఎత్నిక్ మూలవాసీలను, నల్లజాతి ప్రజల సమస్యలను, పోరాటాలను, ఇటు భారతదేశంలోని దళితు సమస్యలను, కుల రాజకీయాలను లోతుగా అధ్యయనం చేస్తున్న స్కాలర్‌గా ఆమె రాణిస్తుంది. కానీ, వీటన్నింటిలో తాను మెహతర్ దళిత గుర్తింపుతో ఎక్కడ కొనసాగలేదు. చెప్పుకోలేదు. కుల ధ్రువీకరణ పత్రం చూపించే అవసరం తనకు ఎన్నడూ రాలేదు. తమ కులాన్ని చెప్పుకోదలుచుకోలేదు వారు. కానీ కులాల సమీకరణతో స్నేహితులైతున్నప్పుడు తాను బ్రాహ్మణ కులం అని చెప్పుకుంది. ఇలా చెప్పుకోవడం ఆమెకు భారతదేశంలోనే అలవడింది. 'మెహతర్ అమ్మాయి అంటే ఎక్కడ చిన్నచూపుతో ఈసడించుకుంటారో, యాసిక తట్టుకోలేదు, ఆమె మనస్సుకు భారమైతుందని ముందే అలోచించి తల్లితండ్రి ఆలా కులాన్ని దాయడం



'యూనివర్సిటీలో రోహిత్ మరణం నుండి హాత్రస్ పల్లెపాలాల్లో బాలిక మరణం వరకు కులం రహస్యాన్ని నేను నా గుండె బరువుగా లాక్కొచ్చాను' అని భావించింది. తన కులాన్ని దాస్తూ ఎదో పెద్ద తప్పు చేస్తున్ననూన్యతా భావన. 'నా గుండెల్లో గూడు కట్టుకొన్న బరువును ఇక నేను మోయలేను'. నేను మోస్తున్న అబద్ధపు బరువును నా మెదడు మీది నుండి, నా గుండె మీది నుండి దించేసుకోవాలి! అని నిర్ణయించుకుంది.

అలవాటు చేయడమైంది. కానీ హాత్రస్ అమ్మాయి గురించి తన దృక్కోణాన్ని రాయాలనుకునప్పుడు తనకు తాను ఇరకాటంలో పడింది. "నేనేం చేయాలి" అని తనకు తాను బోనులో నిలబెట్టుకుని ప్రశ్నించుకునే పరిస్థితిలో పడిపోయింది యాసిక. హాత్రస్ అమ్మాయిది కులం చేసిన రేప్, కులం చేసిన హత్య, కులం చేసిన దహనం. 'ఇందులో సర్వము కులం అని రాయాలంటే మొదట నేను నా కమ్యూనిటిని ఓపెన్‌గా చెప్పుకోవాలి' అని నిర్ణయించుకుంది యాసిక. ఇలాంటి సంకట పరిస్థితి రావడం తనకి ఇది రెండవ సారి అని కూడా మననం చేసుకుంది.

ఐదు సంవత్సరాల క్రితం రోహిత్ వేముల మరణ లేఖ చదివినపుడే ప్రకటించాలని అనుకున్నప్పటికీ అది జరగలేదు. వాయిదా పడింది అనే చెప్పాలి. 'యూనివర్సిటీలో రోహిత్ మరణం నుండి హాత్రస్ పల్లెపోలాల్లో బాలిక మరణం వరకు కులం రహస్యాన్ని నేను నా గుండె బరువుగా లాక్కొచ్చాను' అని భావించింది. తన కులాన్ని దాస్తూ ఏదో పెద్ద తప్పు చేస్తున్ననూన్యతా భావన. 'నా గుండెల్లో గూడు కట్టుకొన్న బరువును ఇక నేను మోయలేను'. నేను మోస్తున్న అబద్ధపు బరువును నా మెదడు మీది నుండి, నా గుండె మీది నుండి దించేసుకోవాలి! అని నిర్ణయించుకుంది. ఇంకేమాత్రం తడువు చేయొద్దు. నా తల్లితండ్రులు, నా స్నేహితులతో సహా ఎవరేమనుకున్నా ఫరవాలేదు అనుకుంది. అసలు నేనింతగా ఆలోచించడం అనవసరం, కులం హత్యలా.. చావులా.. మరణాలా.. వాటి రాజకీయాలను రాయడం గురించి ఆలోచించాలని దృఢంగా నిర్ణయించుకుంది. "నేను దళిత్‌ను! అంతే కాదు దళితుల్లో దళితయినా స్కావెంజర్ స్త్రీని" అని సోషల్ మీడియాలో ప్రకటించింది. అలా యసికా గౌతమికి రాత్రంతా నిద్రలేకుండా గడిచింది. నిద్రలేమితో తనువు కాస్త బడలికగా ఉన్నప్పటికీ మనుసు ఎన్నడూ లేనంత తేలికైంది. తన మిత్రులను కలవడానికి బయలుదేరిన యాసికి మబ్బు వీడిన తొలి పొద్దు పువ్వెండను ఆస్వాదిస్తూ కాఫీ టేబుల్ వైపు నడిచింది.

కథ

# వల్లనే.... వల్లనే...

పల్లెల ఆప్యాయతను తెలిపే కథ...



ఏదునూరి రాజేశ్వరి
94932 64924

'సావరాదురా ముండ కొడుకా..' ముండ గాసమన్న ఒచ్చు. తాగచ్చి జాలాట్ల ఒయిక్ ఒయిక్ మంటున్న భర్తను గుడ్లురిమి చూస్తూ ఎల్లమ్మ. బువ్వ తినుకుంట బుక్క బుక్కకో తిట్ల రాగం దీస్తంది. అప్పుడే పెద్దర్వాజ గలుమల్ల అడుగువెట్టిన పెద్దింటి పోషక్క 'ఏందే చెల్లె మొగుణ్ని సావుమని తిడతవానే..' భర్త సచ్చినోళ్ల ఏం బావుకుని తింటారే కోప్పడ్తూ అన్నది. పతిపోతే వితంతువు అంటరు గాదె చెల్లె. లొకరీతి చెప్పుకొచ్చింది. 'ఏందవ్వా నువ్వ మొగోళ్లదిక్కే మాట్లాడతవ్.. చేసిన రెక్కల కష్టమంతా సడఖ్ మీది మందు దుకుణంల పెట్టిరావట్టె. ఎదుగు బొదుగు లేని సంసారమైతాంది. తోటోళ్లు మంచి మంచి బంగ్లాలు కట్టుకున్నరు. మొన్నటి వానలకు పాత ఇళ్లు ఉరుత్తాంటే నల్ల తాటిపత్రి ఇంటిమీద కప్పుకుంటిమి. నువ్వ సూల్లేదనవ్వా.. తిన్న పల్లెం ఎత్తేసుకుంట నిష్ఠూరమాడింది ఎల్లమ్మ. తోటి పెద్ద యారాలు ఖాందాన్ గల్లది కులంల పల్చనైతననుకొని ఎల్లమ్మ కొద్దిగా జంకినట్టయి ముచ్చట చెప్పుకొచ్చింది. గుట్టకింది నారాయణ పాత ఇల్లు కొన్నం అక్కా.. దాన్ని కూలగొట్టి బంగుల దొరింపు చేద్దామనుకుంటన్నం. ఉన్నొక్క పోరడు పెండ్లికి ఎదుగవట్టె. ఇల్లు లేకపోతే పిల్లనెవడిస్తడు. పల్లెం కడిగి చెక్క మీద బోర్లిచ్చుకుంట అన్నది ఎల్లమ్మ.

అంతసేపు భార్య తిడుతాంటెముని రాజోలె మూతిముడుసుకుని మాట్లాడక కూసున్న ఎల్లమ్మ భర్త.. ఒదినే.. కోడల్ను తెచ్చుకుంటదట. ఎకసెక్కాలాడుతూ అంటున్నాడు. అప్పుడు కోడలొచ్చి చెవుల పువ్వు, శిఖల సెప్పు పెడ్తది. తిట్టిన కసిదీర్చుకుంటూ భార్యవైపు భయంగా చూస్తూనే గడంచల ఒరిగిండు.

పోషమ్మకు ఏడేండ్లప్పుడే లగ్గమయింది. ఇంటికి చిన్న కోడలు కావడంతో పెండ్లైన నెలకే అత్త ఏరు పోసింది. నాలుగెకరాల పొలం, నాగలి దున్నే రెండేడ్లు పాలిచ్చే ఆవు పోషమ్మ వంతుకొచ్చినయి. అట్లా భర్త అడుగుజాడలల్ల నడుస్తూ ఆడి పని మగ పని అనకుంట కష్టపడ్డది. అప్పట్ల ఐదోది చదివిన పోషమ్మ భర్త పోషమల్లు.. జీతగాళ్ల లెక్కలు రాయాలన్న వడ్డీ లెక్కలు చేయాలన్నా చుట్టుపక్కల వాళ్లకు ఈయనే దిక్కు. ఎవుసంల కూడ మంచి పంటతీస్తడని పదూళ్ళకు పేరుపోయిండు. పాల సన్నలు, సాంబలు, సోనా మసూరి పుట్లకు పుట్లు వడ్లు కల్లంలనే కాంట పెడ్తుండే. పెట్టుబడికి లాభం కంటె పిండి బత్తాలకు పోంగ పావుల మందం లాభముండేది.

పోషమల్లు బాయికాడికి పోయి వనం మైసమ్మ చెట్టుకింద నిలబడి కుడివైపు చూస్తే ఆకుపచ్చటి వరిచేను ఒడ్లపొంటి గునుగుంచె చెట్లు పసుపు పచ్చ పూలతో కనివిందు చేసేది. ఎడమదిక్కు చూస్తే జవాన్ల లెక్క పొడుగ్గ నిలబడి మట్టి రంగు తలపువ్వుతో మక్కచేను రెండు చేతులు జోడిచ్చినట్లుండేది. ఎదురుగా చూస్తే పెద్ద మిరప తోట ఎర్రటి లోలాకులతో ఊగుతున్నట్టుగా మధ్య మధ్యలో బంతి చెట్ల వరుసలతో నిత్య నూతనంగా కనపడేవి. కాలే కడుపులకు అన్నం పెడుతున్న పోషమల్లుకు ఎవరెస్టు శిఖరం ఎక్కినంత సంబురంగా ఉండేది.

పొలంల పైరును పెంచినట్లే ఇంట్ల ఇద్దరు కొడుకులను పెంచి పెద్ద జేసింండ్రు పోషమ్మ దంపతులు. అటు వాళ్ల చదువులు పైతరగతులకు ఎదిగినట్టే అత్తిచ్చిన దానికి రెట్టింపు భూములను కొన్నది. పోషమ్మ ఒకరికి మ్యాన పిల్లను, ఇంకో కొడుక్కు న్యాత పిల్లను పెండ్లిళ్లు చేసి బాధ్యత తీసుకున్నది. నడీడుకొచ్చింండ్రు, చేతులుడుగుతానయి. ఎంత కలిపి ఉంచుదామనుకున్న ఒక్క తల్లి కన్న పిల్లలు కాదు కోడండ్లిద్దరు. కసుక్కు కిసుక్కు తనాలకు వేరు పోయడమే సరైన పద్ధతనుకున్నారు పోషమ్మ, ఆమె భర్త. ఓ రోజు ఊరి పెద్దమనిషి సమక్షంలో ఎవరికి వాళ్లే వేరు అయ్యింండ్రు. మామిండ్ల మిట్టకాడ

*(మిగతా 47వ పేజీలో)*

వ్యాసం

# గంగరాజు సుశీలా దేవి గేయ సాహిత్యం

గంగరాజు పాటల సరిగమలపై విశ్లేషణ...



రమాదేవి నెల్లుట్ల
94406 22781

'హృదయము భావము ఊహావేశం
కలలు కైతలు కమ్మని తలపులు
కన్నుల నిలిచే ఎన్నో కాంక్షలు
అన్నీ అన్నీ ఇవి నీకోసం
బ్రతుకంతా ఇది నీకోసం
నా ప్రతి అడుగూ నిను చేరుట
కోసం..'

అర్ధ శతాబ్దం క్రితం ఆకాశవాణిలో మారుమ్రోగిన పాట ఇది. దీనిని రచించిన గీత రచయిత్రి అసలైన తెలంగాణా ఆడబిడ్డ, సిసలైన రైతు బిడ్డ.. అంతే కాదు స్వయంగా రైతు కూడా. ఆమె గంగరాజు సుశీలాదేవి.

తెలంగాణా స్త్రీలు పరాక్రమానికీ, పట్టుదలకూ, ఆత్మ విశ్వాసానికీ ప్రతీకలు. అయితే వీరిలో సౌందర్య, సౌకుమార్య భావనలూ, లలిత కళల పట్ల అభినివేశం కల్గిన వారూ ఎక్కువే. ఇరవయ్యో శతాబ్దపు తొలిసగం రోజుల్లో కాయకష్టం చేసుకుని బ్రతికే శ్రామిక వర్గ స్త్రీలు చదువుకూ, కనీస సౌకర్యాలకూ దూరమై ఆయాపనులు చేసుకుంటూ శ్రమ తెలియకుండా తమ కష్ట సుఖాలను పాటలుగా పాడుతూ మౌఖిక సాహిత్యాన్ని సృష్టించి బ్రతికించారు.

మరో ప్రక్క కాస్త కలిగిన కుటుంబాలలో స్త్రీలకు స్వేచ్ఛ లేకపోయినా ఇంటి వద్దే కొద్దో గొప్పో చదువూ, పురాణగ్రంథాల పఠనం అబ్బి...



ఆ పరిజ్ఞానంతో ఇతర పుస్తకాలు చదివి, తమదైన శైలిలో రచనలు చేసి ఎవరికీ చూపించకుండా దాచిపెట్టుకునేవారు. అలా ఎందరో స్త్రీల రచనలు మరుగున పడిపోయేవి కూడా !

గంగరాజు సుశీలా దేవి స్వస్థలం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కోడూరు గ్రామం. ఇది ప్రస్తుతం జనగామజిల్లాలో ఉంది. ఆమె 1936 ఆగస్టు 29న కృష్ణాష్టమి రోజు పుట్టారు. తల్లిదండ్రులు యశోద, రంగరాజుశ్రీనివాస రావు గార్లు. ఆడపిల్లలు బయటికి పోయే అవకాశమే లేని ఘోషా పాటించే ఇల్లు.. ఎప్పుడూ ఆటలూ, బొమ్మల పెళ్ళిళ్ళూ వీటితోనే కాలక్షేపం. అప్పట్లో సాతాని వైష్ణవులు గానీ, భట్రాజులు గానీ ఖానిగీబడి నడిపే వారు. ఇంటికే ఇద్దరు పంతుళ్లు వచ్చి వీధి అరుగుల మీద చదువు చెప్పినా, ఆమె ఆటల వల్లా, అల్లరి వల్లా చదువు కొండెక్కింది.

ఆ తరువాత తాతయ్య ఆమెతో భారత, భాగవత, రామాయణాలతో బాటు ఇతర పుస్తకాలను చదివి వినిపించు కునేవారు. అలా చిన్నప్పుడే సుశీలకు తెలుగు భాష మీదా, కొత్త పదాలు, వాటి అర్థాలూ నేర్చుకోవడం మీదా ఆసక్తి కల్గింది. తండ్రి చనిపోవడంతో ఎనిమిదేళ్ల వయసులోనే గంగరాజు హనుమంత రావుతో ఆమె వివాహం జరిపించారు తాతయ్య. అయితే కట్నకానుకలు పూర్తిగా ఇవ్వలేదని ఆమెను చాలా రోజులు అత్తింటి వారు కాపురానికి తీసుకెళ్లలేదు. తనలో చెలరేగే ఆలోచనలకూ, భావోద్వేగాలకూ అక్షర రూపం ఇచ్చి చిన్న చిన్న కవితలు రాయడం మొదలయింది అప్పుడే.

'కలమే ఒక హలము గాగ
కరమే ఒక కృషీవలుగ
సాహిత్యపు సేద్యమునకు
హృదయము సుక్షేత్రముగా
రాయాలని ఉందీ -
రచన చేయాలని ఉందీ
చివురులెత్తు భావాలను
చిత్రమైన రీతులతో -

మొగ్గ తొడుగు భావుకతను
నిగ్గుదేర్చు గీతాలుగ -
కనిపించీ వినిపించీ - కవితా ఝరి ప్రవహించీ
నా గుండెను పండించగ - లోకాలను నిండించగ
వ్రాయాలని ఉందీ - కైతలల్లాలని ఉందీ'
అంటూ మొదలు పెట్టి -
'పసితనము నన్నొదిలి పారిపోనున్నపుడు
కన్నెగా నా మనసు కలలు గనుచున్నపుడు
ముగ్ధగా ఎన్నెన్నొ ఊహలల్లేటపుడు
మొలకెత్తె నాలోన ప్రేమ యొక మొలకగా'
అంటూ రాసుకున్నారు.

ఈ లోగా తెలంగాణా ప్రాంతంలో రజాకార్ల అత్యాచారాలు, ఆగడాలు, దాడులు పెచ్చరిల్లిన నేపథ్యంలో సుశీలగారి కుటుంబం అంతా మచిలీ పట్నం వెళ్లిపోయారు. వారు అక్కడ ఉన్నప్పుడే దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ఆ సందర్భంగా 1947 ఆగష్టు 15 రోజున ఒక పాట రాసి తనే స్వరం కట్టి.. అందరితో పాటు వీధుల్లోపాడారు సుశీలా దేవి. పోలీస్ యాక్షన్ జరిగి యూనియన్ పోలీస్ పరిస్థితులను కంట్రోల్ చేశాక మళ్ళీ తిరిగి తెలంగాణాకు వచ్చేశారు.

చివరికి పదకొండవ ఏట మెట్టినింట అడుగు పెట్టిన సుశీలా దేవి అత్తింటి ఆచార వ్యవహారాలకూ, మర్యాదలకూ, కట్టుబాట్లకూ ప్రాధాన్యతనిస్తూ ఆ కుటుంబంలో ఇమిడి పోయారు. ఆలేరు దగ్గరలోని చారిత్రక ప్రాధాన్యత కల్గిన ప్రసిద్ధ జైన క్షేత్రము కొలనుపాక వాళ్ళ ఊరు.

తాను మెట్టిన ఊరు 'కొలనుపాకను వర్ణిస్తూ -
'అలనాడు ఆ కళా జగతిలో ఈ ఊరు
శిల్ప కళలకు గొప్ప నిలయమై వెలసె
కళామ తల్లికి నిండు కొలువై వెలిగె
నాటి ప్రభులెందరకొ ముఖ్య పట్టణమ్మయి
కాకతీయుల కళా హృదయ ప్రతి బింబమయి
ఓరుగల్లుకు చెల్లెలన నొప్పు నగరమై
సుందర శిలా ప్రమద నాట్య వేదియయ్యె
నాడు ఈ కొలనులో ఉలులు అలలై పొంగ
వేయి రేకుల శిలా కలువలెన్నో విరిసె'.. అంటూ కొలనుపాకను నీటి కొలనుగా, అందులోని శిల్పాలను శిలాకలువలుగా కవిత్వీకరించారు.

నిజాం కాలేజీలో చదువుతున్న తురగా జానకీ రాణి గారి టీమ్ కొలనుపాక గ్రామానికి సోషియో ఎకనామిక్సర్వే కోసం వెళ్లినపుడు ఆ ఊరి కరణం గారి భార్యగా అతిథి మర్యాదలు చేసిన సుశీలా దేవి ఆమెను ఆకట్టుకుంది.

ఆమె అమాయకమైన అందమైన రూపం, అంతకు మించిన ఆత్మీయత, అంతరంగ సౌందర్యం ఎంతో నచ్చితన అడ్రస్ ఇచ్చి ఉత్తరాలు రాస్తూ ఉండమ న్నారు జానకీ రాణి. ప్రతి పనికీ అత్తింటి వారి ఆమోదం లభించాల్సిన పరిస్థితుల్లో అత్తగారికి భయపడుతూ రహస్యంగా ఆమెకు ఉత్తరాలు రాసేవారు సుశీల. ఒకసారి రగ్గు కప్పుకుని లోపల దీపం పెట్టుకుని ఉత్తరం రాస్తుంటే ఆ రగ్గుకి నిప్పంటుకుని చాలా గొడవ అయిందని చెప్పేవారు సుశీలా దేవి.

వయస్సులో మూడేళ్ల తేడా ఉన్నా తొలి యవ్వనప్రాయంలోని వారి చెలిమి ఉత్తరాల ద్వారా మరింత బలపడి ఇరు కుటుంబాల మధ్య గట్టి స్నేహబంధం ఏర్పడింది. జానకీ రాణి గారిని ఏకవచనంతో జానకీ అనీ, ఆమె భర్త, ప్రముఖ పాత్రికేయులు తురగా కృష్ణమోహన్ గారిని 'అన్నయ్యా' అనీ పిలిచేటంత చనువు ఆమెకు ఏర్పడింది.

ఉత్తరాలలో అపుడపుడూ సుశీలా దేవి రాసే కవిత్వం నచ్చి జానకీ రాణి ఎంతో ప్రోత్సహించేవారు. అప్పుడామె ఆకాశవాణిలో చిన్నపిల్లల ప్రోగ్రామ్స్‌కి ప్రొడ్యూసర్‌గా ఉండేది.

గంగరాజు సుశీలాదేవి గీతాలు సరళమైన భాషలోనూ, అలవోకగా స్వరపరచి పాడుకునేందుకు అనువుగానూ ఉండేవి.ఈ విషయాన్ని మొదట గుర్తించిన తురగా జానకీ రాణి ఆమెను ఆకాశవాణికి పరిచయం చేశారు. ఆది మొదలు ఎన్నో బాల గేయాలు, దేశభక్తి గేయాలు, భక్తి పాటలు, ప్రకృతి గీతాలు, భావ గీతాలు, నాటికలు ఆకాశవాణికి రాసారు. పాలగుమ్మి విశ్వనాథం, చిత్తరంజన్ వంటి ఉద్దండులు తన పాటలనెన్నింటినో స్వరపరిచారు. ఏ మాటైనా లయలో ఒదగక పోతే అప్పటికప్పుడు సమానార్థమున్నవేరే మాట రాసి వారిని మెప్పించేవారామె. అందుకోసం ఆమె ఎన్నో మార్లు హైద్రాబాదుకు వెళ్లాల్సి వచ్చేది.

మహిళలు విద్యా రంగంలో ముందుండాలని ఆమె ఎంతగానో కోరుకునే వారు. చదువు పట్ల కోరికతో తనముప్పయ్యవ ఏట 1965లో 'భాషా ప్రవీణ' రాసి పాసయ్యారు.
'ఎంత మార్పు తల్లీ
ఎంత వెలుగు మళ్ళీ
ఇంతులు ప్రతిభావంతులు
ఉన్నత విద్యావంతులు' అంటూ ఓ గేయంలో స్త్రీ విద్యను ఆకాంక్షిస్తారు.

ఆకాశవాణి ప్రోత్సాహం, తురగా జానకీ రాణి సహకారం కలగలిసి... సంక్రాంతి, శివరాత్రి, దసరా, ఉగాది వంటి పండుగల సందర్భాలలోనూ, 'వచ్చింది శ్రావణి', 'వ్యవసాయంలో మహిళ' వంటి ఎన్నో గేయ రూపకాలనూ ఆమె రచించారు. ప్రతీ పండుగకూ ఆమె రచించిన గీతం రావు బాల సరస్వతి, వేదవతీప్రభాకర్, రామలక్ష్మి రంగాచార్య వంటి సుమధుర గాయనీ మణుల గళాల నుండి వెలువడి శ్రోతల నాల్కలపైనడయాడేది. 'ఈ మాసపు పాట' 'ఈ పాట నేర్చుకుందాం' వంటి ఆకాశవాణి గేయ ప్రధానమైనకార్యక్రమాల్లో వరుస కట్టబడిన ఆమె పాటలు వరుస కట్టేవి.

వ్యాసం

# అవునూ... ఆమె ఒక అద్భుతమే...!

అమృత లతను ఆవిష్కరించిన వ్యాసం...




రావుల కిరణ్మయి
82475 66615


విద్యా రంగంలో విద్య ఫలాలను అందిస్తూ ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా దిద్ది లతలాగా విస్తరిస్తూ సతత హరితులుగా వెలుగొందుతున్న అమృతలత, 'వీరోచితంగా చేసే పనులు విరజిమ్మే పరిమళమే కీర్తి' అన్న సోక్రటీస్ మాటకు ఒప్పుతారు. సంస్కారం, విద్య, వ్యక్తిత్వం, విజ్ఞానం వంటివి పునాదులుగా తాను నిర్మించుకున్న 'విజయ్ విద్యా సంస్థలు' అమృతలత ఆశలకు స్ఫూర్తికి ప్రతిరూపాలుగా నిలువగా రచయిత్రిగా, వదాన్యురాలుగా ఆమె చేస్తున్న పనులు కీర్తిని సాధించి పెట్టడమేకాక పరిమళాలు వెదజల్లుతున్నాయి.

వ్యక్తిగా, విద్యావేత్తగా, విదుషీమణిగానే కాక రచయిత్రిగా కూడా అమృతలత స్థానం విలక్షణమైనదే. తెలుగు సాహిత్య ప్రక్రియల్లోని కవిత, కథ, నాటకం, నవల, విమర్శ వంటి అన్ని రూపాల్లో, ప్రక్రియల్లో తనదైన ముద్రను వేసిన రచయిత్రి ఆమె. తాను రాయదలచుకున్నది, సమాజహితం చేయదలుచుకున్నది చేసి, రాసి చూపించడం ఆమెకే చెల్లింది. అపారమైన మేధోసంపత్తి, అంతకు మించిన వినయం, వదాన్యత ఆమెకు మరింతగా గుర్తింపు తెచ్చాయి.

తెలంగాణా ఉద్యమ సమయంలో తన వంతు బాధ్యతగా 2010లో 'గాయాలే గేయాలై' పేరుతో కవితా సంకలనం తెచ్చిన అమృతలత, 2011లో 'వెతలే కథలై' పేరుతో కథాసంకలనం ప్రచురించి తన వంతు బాధ్యతగా కృషిచేశారు.



రచయిత్రిగా అమృతలతది తెలుగు కథా, నవలా, నాటిక సాహిత్యంలో ప్రత్యేక స్థానం. ఆమె కథలను ప్రస్తావిస్తూ కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డా. అంపశయ్య నవీన్ అన్నట్టు ఆమె కథలన్నీ పాఠకుల హృదయాల్లో పది కాలాల పాటు నిలిచి ఉంటాయి. ఆయనే పేర్కొన్నట్టు తొలినాళ్ళలో అమృతలత రాసిన 'కాలం వెక్కిరించింది', 'ఆశయాలు, ఆదర్శాలు' వంటి కథలు రచయిత్రిగా అమృతలత ఆరంభవికాసాల్ని ఎంతగా ప్రతిబింబిస్తాయో, 'ఆమెనవ్వు', 'అంతుబట్టని ఆంతర్యాలు' వంటి కథలు రచయిత్రిగా ఆమె పరిణామ వికాసాలకు నిదర్శనంగా కనిపిస్తాయి.

గానగంధర్వుడు డా. ఎస్.పి. బాల సుబ్రమణ్యం ఆమె సంపాదకీయాలను గురించి చెబుతూ ఎక్కడ కన్నీస్సింగా చెప్పాలో, ఎలా తట్టి లేపాలో, ఎప్పుడు చెంపపెట్టు పెట్టాలో, దేన్నీ కుండబద్దలు కొట్టాలో అలా ఏ భావాన్ని ఎలా చెప్తే పఠితులు బాగా అర్థం చేసుకుంటారో ఆ భావాన్ని అలా స్పృశించడం ఆమెకే చెల్లింది అంటారు అమృతలత 'అమృత వర్షిణి' గురించి చెబుతూ. ఇంకా అమృతవర్షిణి ఓ అద్భుతమైన రాగం. సంగీత జగత్తును ఓలలాడిస్తుంది. సాహితీ రంగంలో అమృతలత గారి 'అమృత వర్షిణి'లో నిలువెల్లా తడవాల్సిందే, ప్రతీ వ్యక్తికీ నిత్య పారాయణ గ్రంథాల్లో ఒకటిగా చేర్చుకొనదగిన పుస్తకం అంటారాయన.

'సృష్టిలో తీయనిది' రచయిత్రిగా అమృతలతకు కీర్తి తెచ్చిన వాటిల్లో ఒకటి. ఇది మనుషుల స్వభావాన్ని, ప్రవర్తనలను అక్షరాల్లో పట్టి చూపించడమేకాక, ఇందులోని పాత్రలు ధీరోదాత్తతకు, వాస్తవ స్వభావాలకు నిలువటద్దంగా ఉంటాయి. ఇవి రచయిత్రి నిరంతర పరిశీలనాశక్తికి నిదర్శనంగా నిలుస్తాయి. 'స్కూల్ పెట్టి చూడు' అనే నాటికల సంపుటి 'ఓటు' వంటి అంశాల ప్రాముఖ్యతను వివరిస్తూ రాయబడిన సందేశాత్మక రచనల సమాహారం. పిల్లల కోసం కాదు కానీ పిల్లలే ప్రధాన ఇతివృత్తాలుగా అమృతలత రాసిన నాటికల సంపుటి 'గోడలకే ప్రాణ ముంటే...' ఇందులో కూడా రచయిత్రి సమకాలీన సమస్యలను, అంశాలనే కాక తెలంగాణ భాషలో సంభాషణలు రాశారు.

సమర్థతకు ప్రతిరూపమైన అమృతలత ప్రజ్ఞకు మరో తార్కాణం



జర్నలిజం. 'అమృత్ కిరణ్' అనే పక్ష పత్రిక స్థాపించి రెండు సంవత్సరాలు దానిని విజయ వంతంగా నడిపించారామె.

అమృతలత స్వయంగా కథ, నవలా రచయిత్రి అయినా నాటికలు పిల్లల కోసం రాయడం విశేషం. తాను ఈ నాటికలు ఎందుకు రాసిందో చెబుతూ, "స్కూల్ డే వస్తున్నా, స్కూల్లో మరో ఫంక్షన్ ఏది వచ్చినా ఏం నాటిక వేయాలి అనే ప్రశ్న అందర్నీ వేధిస్తూ ఉంటుంది. ఇలాంటి సమస్యకి పరిష్కారమే ఈ 'చుక్కల లోకం చుట్టొద్దాం! నాటికల సంపుటి" అంటారు అమృతలత. బాలల గురించి, వాళ్ళ మనస్తత్వాలు, వ్యక్తిత్వాలు తెలిసిన బాలల మనస్తత్వ నిపుణురాలు కాబట్టే ఇంత చక్కని బాల సాహిత్యాన్ని సృజించగలిగింది. తొలుగ అమృతలత మనస్తత్వ నిపుణురాలు. ఆమె ఇతర రచనల్లో లాగానే బాల సాహిత్యంలోనూ అది మనకు కనిపిస్తుంది. డా. పత్తిపాక మోహన్ ఈ నాటికల గురించి రాస్తూ 'ఈ చుక్కల లోకం.. చుట్టొద్దాం!'లోని ధ్రువతారల్లాంటి పదకొండు నాటికల్లో దేని మెరుపు దానిదే!.. నిజానికి పిల్లల కోసం రాయడం కష్టమైన పనైతే, అందులోనూ సంభాషణలు వారి స్థాయిలో ఎదిగి రాయడం మరింత కష్టం. ఇది అందరికీ సాధ్యమమయ్యే పని కాదు కూడా.

రచయిత్రి డా.అమృతలత చేయి తిరిగిన రచయిత్రే కాక బాలలలోకం తెలిసిన మాతృమూర్తి. అందువల్లె ఇందులోని ప్రతి నాటిక చక్కని రచనగా అలరారుతోంది. రచయిత్రి ఈ నాటికల్లోని ప్రతి పదాన్ని పిల్లల స్థాయిలో రాయడం వల్లనే ఇప్పటికీ 'ఈ చుక్కల లోకం చుట్టొద్దాం!' వెలుగులను విరజిమ్ముతోంది" అన్నది అక్షరాలా నిజం. ఇందులోని నాటికలన్నీ పాఠశాలల్లో జరిగే అనేక అంశాలకు, తతంగాలకు రంగరూపంగా నిలవడమే కాక బాలలు, తల్లితండ్రులు, ఉపాధ్యాయుల అంత రంగాలను ఆవిష్కరిస్తాయి. 'ఇన్స్పెక్షన్' నాటిక బడిలో జరిగే అంశాలను ప్రస్తావిస్తే, 'స్టడీ అవర్స్' హాస్టల్‌లోని విద్యార్థుల గురించి తెలుపుతుంది. ఇంకా 'టీ.వి. న్యూసెన్స్', 'హాలిడే', 'ప్రెజంటేషన్స్' వంటి నాటికలు హాస్యాన్నే కాక రచయిత్రి పరిశీలించి రాసిన విభిన్న మనఃప్రవృత్తుల స్త్రీలు కనిపిస్తారు. అంతేకాక వివిధ ఫంక్షన్లలో బహుమతుల తేవడం వంటి ప్రహసనాలు ఎలా ఉంటాయో వివరిస్తారు. సున్నితమైన అనేక అంశాలను పిల్లల కోసం రాస్తున్న క్రమంలో అంతకు సున్నితంగా, పిల్లల మనసుకు హత్తుకునేలా చిత్రించే ప్రయత్నం చేసిన అమృతలత అవసరమైన చోట హాస్యాన్ని, వ్యంగ్యాన్ని కూడా చొప్పించి చదివేప్పుడు లేదా ప్రదర్శనప్పుడు సూటిగా టార్గెట్ గ్రూప్ అయిన పిల్లలకు చేరేట్టు చేశారు. 'ఇన్విజిలేషన్' అటువంటిదే. కవయిత్రి కిరణబాల అన్నట్టు "...పెద్దలు పిల్లలతో ఎలా వ్యవహరించాలో... పిల్లలు పెద్దలతో ఎలా నడుచుకోవాలో... సూచిస్తూ సరదాగా సాగిన పిల్లల నాటికల సమాహారమే 'చుక్కల లోకం చుట్టొద్దాం!' నాటికలు.

సాహితీ వనంలో, విద్యా, సామాజిక సేవా రంగాల్లో తన ప్రతిభ, కృషి అనే అమృతాన్ని పారించి సుగంధాల పూలు వికసింపజేయటమే కాక విభిన్న కార్య క్షేత్రాలలో సుసంపన్నమైన సేవ చేస్తున్న ఎందరో మహామూర్తులను 'అమృతలత అపురూప అవార్డు'ల పేరుతో సత్కరించి, గౌరవించడం అమృతలత సహృదయ వదాన్యతలకు నిదర్శనం. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ అపురూప వేదికను ఎక్కని ప్రముఖులు లేరనడం అతిశయోక్తి కాదు.

సామాజిక చైతన్య మూర్తిగా, సేవా పరాయణురాలిగానే కాక ఒక ఆధ్యాత్మిక వేత్తగా కూడా కనిపిస్తారు అమృతలత. ఆమె సంకల్పంతో రూపుదిద్దుకున్న అపురూప శ్రీ వేంకటేశ్వర దేవాలయం అందుకు నిదర్శనం. నిత్యం నీటిలో ఉండే పడవ తనలోకి మాత్రం నీటిని రానివ్వని చందంగా వృత్తి ప్రవృత్తులలో తల మునకలవుతున్నా కుటుంబ బాధ్యతల నిర్వహణలోనూ అమృతలత ఆదర్శంగానే నిలిచారు. తన ఏకైక కూతురును ఉన్నత విద్యావంతురాలుగా తీర్చిదిద్దడమే కాక తన సేవ దృక్పథాన్ని అలవరుచుకొనే ఉన్నతులుగా ఎదిగింపచేసిన అమ్మ ఆమె.

జీవితమంటే ఆటుపోట్లుంటాయి. కష్టాలుంటాయి... కష్టాలొచ్చినపుడు కుంగి పోకుండా ఆశావహ దృక్పథంలో ఉండాలి దేనికీ అధైర్యపడొద్దు అనే విజయసూత్రం తో సాగిపోతున్న సార్థక నామధేయురాలు అమృతలత బాల ఆదర్శణీయం. మహిళాజగత్తులో ఆమె స్థానం అత్యున్నతం.

ఆచార్య ఎన్. గోపి గారన్నట్లు-

"ఆమె రచయిత్రి<br>
కవయిత్రి<br>
సంస్కార ధాత్రి<br>
సౌజన్య నేత్రి<br>
సేవా భావం<br>
ఆమె చీరకు అంచు<br>
బాధితుల ముందు<br>
కరిగిపోయే మంచు<br>
ధనం సరే...<br>
గుణ సంపన్న ఆమె..."

డా॥ అమృతలత ఏడుపదుల పండుగ సందర్భంగా మిత్రులు, బంధువులు, విద్యార్థులు, సన్నిహితులు, కవులు, రచయితలు, తమ ప్రేమ ఆప్యాయ తలను తెలుపుతూ పేర్కొన్నట్టు... కవయిత్రిగా, రచయిత్రిగా, బాల సాహితీవేత్తగా, నాటకకర్తగా, నవలా కారిణిగా, విద్యాసంస్థల అధినేత్రిగా, సౌజన్య సంస్కార ధాత్రిగా విభిన్న రంగాల్లో అంచులు ముట్టిన ఆమె నిజంగా 'ఓ అద్భుతమే'.

వ్యాసం

# నన్నయ్య తీర్చిదిద్దిన "శకుంతల"

శకుంతలను ఆధునిక సమాజానికి అన్వయించిన వ్యాసం...

సి.హెచ్. కవిత

భారతీయ సనాతన వైదిక గ్రంథాలలో జాజ్వల్యమానంగా వెలుగొందుతున్న గొప్ప మహేతిహాసం మహాభారతం. ఇది ఒక గొప్ప విజ్ఞాన ఖని. "యదిహాస్తి తదన్యత్ర యన్నే హాస్తి న తత్ క్వచిత్" అని మహాభారతం గొప్పతనాన్ని గురించి చెప్తారు. మహాభారతంలోని కథల ద్వారా ఎన్నో అంశాలను నేర్చుకోవచ్చు. మహాభారతంలోని కథలను ఆధునిక కాలానికి, భవిష్యత్ తరాలకు ఎప్పటికీ అనువర్తించుకోదగిన గొప్ప మహాకావ్యం. అలాంటి వాటిలో నన్నయ్య ఆదిపర్వం చతుర్థాశ్వాసంలో రాసిన "శకుంతలోపాఖ్యానం" ఒకటి.

దుష్యంత మహారాజు ఒకసారి వేటకు వెళ్లి ఒక పుణ్య నదీ తీరంలో ఉన్న పవిత్రమైన కణ్వ మహర్షి ఆశ్రమంలో శకుంతలను చూస్తాడు. శకుంతల సౌందర్యరాశి. దుష్యంతుడు తొలి చూపులోనే ఆమె పట్ల ఆకర్షితుడై తన మనసులోని ప్రేమ భావాన్ని వ్యక్తీకరిస్తారు. శకుంతలకు అన్ని రకాలుగా నచ్చ చెప్తాడు. ఆమె కోరిక మేరకు పుట్టబోయే కుమారుడిని భావిభారత చక్రవర్తిగా పట్టాభిషిక్తుని చేస్తానని చెప్పి గాంధర్వ వివాహం చేసుకుంటాడు. ఆమెతో కలిసి అన్ని సుఖాలను అనుభవిస్తాడు. తొందరలోనే తనను హస్తినాపురానికి తీసుకొనిపోవడానికి సపరివారంగా చతురంగ సేనను పంపిస్తానని ఆమెకు ధైర్యం చెప్పి అక్కడి నుండి తిరిగి రాజ్యానికి వస్తాడు. ఇంతలో అడవికి వెళ్ళిన కణ్వ మహాముని ఆశ్రమానికి తిరిగి వస్తాడు. జరిగిన సంగతంతా తన దివ్య దృష్టితో తెలుసుకుంటాడు. ఇదిలా ఉండగా శకుంతలకు కొద్ది రోజులకు కొడుకు పుడతాడు. అతడు శైశవ దశలోనే జంతువులను అన్నింటిని లొంగదీసు కుంటాడు. మునులంతా ఆ బాలునికి "సర్వదమనుడు" అనే పేరు పెడతారు. సర్వదమనుడు యువరాజు కావడానికి తగిన అర్హతలు అన్ని సాధిస్తాడు. యువరాజు అయ్యే సమయం ఆసన్నమైందని భావించిన కణ్వముని ఎలాంటి ఉత్తమ స్త్రీలైనా పుట్టింట్లో ఎక్కువ కాలం ఉండడం తగదు అని భర్తల వద్ద ఉండడమే భార్యలకు ధర్మమని శకుంతలతో చెప్పి ఆమెకు తోడుగా శిష్యులను ఇచ్చి దుష్యంతుని సామ్రాజ్యానికి పంపిస్తాడు. దుష్యంత మహారాజు దగ్గరకు వెళ్ళిన శకుంతలను చూసిన రాజు తనకున్న శాపం వల్ల తననెవరో తెలియనట్లుగా నటిస్తాడు. అతని ప్రవర్తన చూసి శకుంతల కొంత బాధ పడినప్పటికీ తన పాతివ్రత్యాన్ని, కుమారుని జీవితాన్ని నిలబెట్టాలని నిండు సభలో నానారకాలుగా ప్రయత్నిస్తుంది. చివరకు ఆకాశవాణి వచ్చి జరిగిన వృత్తాంతాన్ని దుష్యంతునికి గుర్తుచేసి ఇద్దరిని కలపడం, జరిగిన పొరపాటును తెలుసుకొని రాజు పశ్చాత్తాపపడి శకుంతలను తన భార్యగా స్వీకరించి, సర్వదమనుని యువరాజుగా పట్టాభిషేకం చేయడం దీనిలోని ప్రధాన కథా వస్తువు.

శకుంతల దుష్యంతునితో మాట్లాడిన మాటల్లో అద్భుతమైన మూర్తిమత్వాన్ని, మిక్కిలి ధైర్యం గల పాత్రగా నన్నయ్య శకుంతల పాత్రను తీర్చిదిద్దారు. దుష్యంతుడు లౌకిక ధర్మానికి ప్రాతినిధ్యం వహిస్తే, శకుంతల ఆత్మ ధర్మానికి ప్రతీకగా నిలబడుతుంది.

శకుంతల దుష్యంత మహారాజు సభలోకి వస్తుంది. శకుంతలను చూసిన దుష్యంతుని మొహంలో ఏ విధమైన మార్పు ఉండదు. పైగా తను ఎవరో కూడా తెలియదు అంటాడు. ఆ మాటలు విన్న శకుంతల ఎంతో బాధపడుతుంది. ఎలాగైనా తన భర్తకు గత పూర్వ వృత్తాంతాన్ని తెలియజెప్పాలని భావిస్తుంది. పూర్వ వృత్తాంతను అంతా రాజుకు గుర్తుచేసి తన కొడుకుని చూపించి యువరాజుగా పట్టాభిషిక్తుని చేయమంటుంది. ఆ మాటలు విన్న దుష్యంతుడు "ఏ నెరుగ నిన్ను నెక్కడి/ దానవు మిన్నకయు యనుచితంబులు పలుకం/ గా నేల యరుగు మంబుర / హానన ! యందుండి వచ్చి తందులకు వడిన్. నువ్వు ఎవరో నాకు తెలియదు. అబద్ధం మాటలు చెప్పకు. ఎక్కడి నుండి వచ్చావో, అక్కడికి వెళ్ళిపో ఉంటాడు.

ఆధునిక కాలంలో ఇలాంటి సంఘటనలు మన కళ్ళ ముందు వార్తల్లో ఎన్నో చూస్తుంటాం. ఆడవాళ్ళను నమ్మించి మోసం చేసి పెళ్లి చేసుకుని ఆమెతో కొద్దిరోజులు సంసారం చేసి పిల్లలు పుట్టాక ఆమెను విడిచిపెట్టి వెళ్లిపోయే పురుషులను ఈనాటి సమాజంలో చూస్తూనే ఉన్నాం. భర్త కోసం వెతుకులాటలో ఆ స్త్రీ తన అత్తగారి ఇంటి ముందు కూర్చుని న్యాయ పోరాటం చేయడం లాంటి సంఘటనలు ఆధునిక కాలంలో చాలా జరుగుతున్నాయి. కొందరు స్త్రీలైతే తనకు జరిగిన అన్యాయాన్ని, బాధను భరించలేక ఆత్మహత్య చేసుకొని చనిపోయే సంఘటనలను రోజువారీ వార్తలలో అక్కడక్కడ చూస్తుంటాం. ఆధునిక కాలంలో కొందరు స్త్రీలు ఎదురుకుంటున్న ఈ సమస్యను శకుంతల పాత్రలో ఆనాడే నన్నయ్య చెప్పాడు. ప్రేమ పేరుతో మోసపోయే స్త్రీలకు కనువిప్పు కలిగేలా శకుంతల పాత్ర ద్వారా సమాజానికి చూపించాడు. తమకు అన్యాయం జరిగినప్పుడు ధైర్యంగా ప్రశ్నించే చైతన్యం ఉండాలని, మహిళలు అందరికీ ఈ ధైర్యం ఉండాలని శకుంతల పాత్ర ద్వారా చెప్పారు. శకుంతల తనకు జరిగిన అన్యాయానికి ఆత్మహత్య చేసుకోలేదు. ధైర్యంగా సభలో నిలబడి తనకు జరుగుతున్న అన్యాయాన్ని, భార్య గొప్పతనాన్ని దుష్యంతునికి అర్థమయ్యే విధంగా చెప్పి ఒప్పించడానికి ప్రయత్నించింది. ఎప్పుడూ ధర్మాన్ని, సత్యాన్ని నమ్ముకొనే శకుంతల రాజుతో మాట్లాడుతున్నప్పుడు ఎక్కడా వెనక్కి తగ్గలేదు. ధైర్యంగా స్థిరంగా నిలబడింది. తాను నమ్మిన ధర్మం ద్వారా, ఆత్మవిశ్వాసం ద్వారా చివరకు తన జీవితాన్ని నిలబెట్టుకోగలిగింది. ఆకాశంలో సగం అని, అన్ని రంగాల్లో ముందుంటున్న మహిళలకు తమ వ్యక్తిగత వైవాహిక జీవితానికి వచ్చేసరికి కొన్ని సమయాల్లో కొన్ని నిర్ణయాల్లో భయపడిపోతున్నారు. ముఖ్యంగా వైవాహిక జీవితంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించలేక పోతున్నారు. క్షణికావేశంలో జీవితాలను పాడు చేసుకుంటున్నారు. వైవాహిక జీవితంలో భార్యాభర్తలకు మధ్య గొడవలు ఎదురైనప్పుడు ప్రశ్నించే తత్వంతో పాటు భర్తకు నచ్చచెప్పి జీవితాన్ని సర్దుకుపోయే ఓపిక కూడా ఉండాలని అర్థం చేసుకోవాలి. అప్పుడే జీవితం అంతా ప్రశాంతంగా సాగిపోతుంది.

శకుంతల మహారాజు దుష్యంతున్ని ఒకానొక సందర్భంలో "విమల యశోనిధి!" అని సంబోధిస్తుంది. కీర్తిగల మహారాజు అసత్యం మాట్లాడి తన కీర్తికి మచ్చ తెచ్చుకోకనని ఒక స్నేహితురాలిగా, భార్యగా హెచ్చరిక చేస్తుంది. పతివ్రత, గుణవతి, సంతానవతి అయిన స్త్రీని అవమానిస్తే ఇహపర లోక సుఖాలు ఉండవు అని అంటుంది. అంతేగాక ఎలాంటి స్త్రీ దొరికితే భర్త సంతోషంగా ఉంటాడో" సంతత గృహమేధి ఫలం/ బంతయు బడయంగ నోపు ననుగుణ భార్యా/ వంతుడగు వాడు క్రియా/ వంతుడు దాంతుండు పుత్రవంతుడు నగున్. అని చెపుతూ భర్త అప్పుడే ఉత్తమ గృహస్థుని ఫలాన్ని సంపూర్ణంగా పొందగలుగుతాడు అని అంటుంది.

స్త్రీ గొప్పతనాన్ని గురించి ఒక సీస పద్యంలో నన్నయ్య శకుంతల చేత ఇలా చెప్పిస్తాడు.

సీ. ధర్మార్థ కామ సాధన కుపకరణంబు
గృహనీతి విద్యకు గృహము విమల
చారిత్ర శిక్ష కాచర్యకం బన్వయ
స్థితికి మూలంబు సద్గతి కి నూత
గౌరవంబున కేక కారణం బున్నత
స్థిర గుణమనులకు కాకరము హృదయ
సంతోషమునకు సంజనకంబు భార్యయ
చూవే భర్తకు నొండ్ల గావు
ప్రియము........

ధర్మం, అర్థం, కామం అనే పురుషార్థాలను సాధించడానికి అనువైన సాధనం, గృహనీతి అనే విద్యకు నెలువైనటువంటి నిర్మల శీలాన్ని గురించి ప్రభోదించే గురు స్థానము, వంశం నిలవటానికి ఆధారం. ఆమె సద్గతులు కలగడానికి ఊతకర్ర లాంటిది. మన్ననకు ముఖ్య కారణమైనది. ఆమె ఆదర్శప్రాయమైనవీ, కలకాలం నిలిచే, మంచి గుణాలకు స్థానమైనది. హృదయానికి ఆనందాన్ని కలిగించేది భార్య అని శకుంతల పాత్ర చేత నన్నయ్య స్త్రీ గొప్పతనాన్ని ఆవిష్కరిస్తాడు.

భార్య గొప్పతనాన్ని చెపుతూ భార్య భర్తలో సగభాగముగుట (అర్థాంగి) వల్ల, భర్త కంటే ముందే మరణిస్తే తన భర్త రాక కొరకై పరలోకములో ఎదురు చూస్తుంటుంది.

ఒకవేళ భర్తనే ముందు మరణిస్తే తర్వాత తాను కూడా మరణించి అతనిని కలుసుకోవటం కోసం పరలోకానికి వెళ్తుంది. అలాంటి పతివ్రతమైన భార్యను అవమానించడం ధర్మమునకు విరుద్ధం అని చెపుతుంది. అంతేగాక భర్త భార్య యందు ప్రవేశించి ఆమె గర్భాన పుత్రుడై తానే తిరిగి పుడుతాడు అంటుంది.కుమారుని గొప్పతనాన్ని చెపుతుంది. ఇలా దుష్యంతునికి ఎన్ని రకాలుగా చెప్పిన వినడు సరికదా పైగా శకుంతలను అవమానిస్తాడు. అతను తను ఎవరో తెలియదు పొమ్మంటాడు. రాజు అలా మాట్లాడినప్పటికీ శకుంతల ఒకటీ రెండుసార్లు దుఃఖించి బాధపడ్డప్పటికి మాటల్లో ఎక్కడా తడబడదు. తాను క్షాత్రవ వంశానికి చెందిన విశ్వామిత్ర మహర్షికి, మేనకకు కూతురును అని తనకు అబద్ధం మాటలు చెప్పాల్సిన అవసరం లేదని ఎంతో గర్వంగా, ఆత్మ విశ్వాసాన్ని ప్రకటిస్తుంది.

గార్హస్త్యాశ్రమంలోనీ స్త్రీ వ్యక్తిత్వానికి సజీవ రూపం శకుంతల పాత్ర. గార్హస్థ్య ధర్మానికి భార్య, భర్త, సంతానం, సత్యం అనేవి నాలుగు స్తంభాలు. వీటి మీద ఆ వ్యవస్థ పదిలంగా నిలవాలని ఆమె కోరుకుంది. దాన్నే ఆచరించింది. ఇలా శకుంతల పాత్రను నన్నయ్య ఎంతో ఆదర్శనీయ పాత్రగా చిత్రీకరించాడు. కష్టాల్లో, ఆపద సమయాల్లో స్త్రీలు భయపడకుండా తాము నమ్మే సిద్ధాంతం మీద ఆధారపడి ఉంటే సత్యం ధర్మం మనిషిని తప్పకుండా కాపాడుతుందని అర్థం చేసుకోవచ్చు.

వ్యాసం

# శోకాల భంజనమే కాల ప్రభంజనం

కొండపల్లి నిహారిణి కవిత్వంపై విశ్లేషణ...



కె. వీణారెడ్డి
73370 58025

సాహితీ సౌరభాల సురబాల వంటి ఓరుగల్లు జిల్లా జన్మస్థానం అయిన ప్రముఖ సాహితీ వేత్త, సంపాదకురాలు అయిన కొండపల్లి నీహారిణి గారిది చిత్రకళా, సాహితీ నేపథ్యం గల కుటుంబమే అయినా, సహజ కళా సుందరమైన, భావ గంభీర బంధురమైన సాహిత్యం ఆమె సొంతమై శోభాయమానమైనది.

సామాజిక స్పృహతో కూడిన తన సాహిత్య కృషిలో జాలువారిన కథలు, వ్యాసాలు, కవితలు జీవిత చరిత్రలు మొదలైన ప్రతిష్ఠాత్మక సాహితీ ప్రస్థానం లోని నాలుగో కవితా సంకలనం 'కాల ప్రభంజనం' సంచలనం కలిగించే పలు భావనా తరంగాల జీవనతారంగం!

శోకానికి స్పందించిన కవి వాల్మీకి శ్లోకంలా... లోకాల శోకాల వోలే కవయిత్రి కవితా ప్రకంపనాల ప్రభంజనాలు!

విషాదం లేని జీవితం నిషాదం లేని సంగీతం వంటిదని నిరూపిస్తూ, గాయాలనుండే గేయాలంటూ, శోకాల మరుగుననే జీవితసత్యాలలోనే సందేశాలెన్నో దాగున్నాయని తన "కాల ప్రభంజనం"లో కవిత్వీకరించింది కవయిత్రి. పాఠకుల మనోపరిధిని పెంచే కళా ప్రభంజనం వంటి 'కాల ప్రభంజనం'.

అధిక భాగం పలు పత్రికల్లో కొలువైన, ఇందులో నెలవైన ఈ 73



కవితలు వేటికవే వాటి ప్రత్యేకతను చాటుకుంటూ పాఠకుల నాకట్టుకుంటవి.

ఈ కవితా సాగరంలో స్నానమాడిన వేళ... స్పందనా జలాలుగా అన్నీ నన్ను తడిమి తడిమి తడిపేసిన వేళ... అదో గ్రంథమే అవుతుందని, కొన్ని కవితల్ని మాత్రం సమీక్షా వ్యాసంగా స్పర్శించడం జరిగింది.

త్రికాల స్వరూపమైన కాలగమనాల పట్ల గమకించిన కవయిత్రి కలం, కాలం, ప్రకృతి, సమాజం అనే త్రివిధ జీవన వాటికలపై అల్లిన కవితా వల్లికలు.

దిగంతాలకు దారులు చూపు దిక్సూచికలుగా, నిదుర కనులపై రాలిన వేకువ రేకుల చురకల వలే మేలు కొలిపే కవితలను చైతన్యాత్మక జాగృతి జాతరలా జాలు వారించిన తీరు... భావుకతతో కూడిన సందేశాత్మకమైన తీర్పు!

భావగర్భితమైన పలురసాత్మక, సృజనాత్మక భావాలను అందమైన పదాలతో తమ కవితా వదనాలపై మేలిముసుగులుగా అలంకరించిన మేలైన మేలిమి కవితలు మనసుల నలరింప జేసి తెరతీసి అవలోకింపజేస్తాయి.. ఆలోచింపజేస్తాయి!

'మనిషి విలాపంలో వసంతవిలాసం' అనే మొదటి కవితలో... 'విలాపాలను వదిలి విలాసంగా వస్తున్నాను'. అంటూ, శార్వరి చీకట్లను శాంతి వెలుగులతో స్వాగతించమని, ఆటు పోట్లెన్నున్నా.. ఆటపాటల్లా వాటిని మరిపించే ప్రకృతిమ తల్లిని నేనంటూ, ధైర్యగీతికను ప్రకృతిలోని చేతనగా తమ కవితా కలాన్ని కదిలించటమే కాదు తనలోని జ్వలనానికి తనే సహన లేపనం కావాలంటూ, ప్రకృతితోనూ, ప్రతి ఋతువుతోనూ మమేకమై, శిశిరాల వేదనే కాదు, చిగురింతల చిలకరింతల్ని కూడా ఆస్వాదించాలంటూ, నీలోనికి నీవు ప్రవేశించే సాధుత్వం తో కూడిన సత్యార్థ ప్రకాశానివైతే.. ప్లవనామవత్సరాన్ని ప్రవేశింప జేసి పరవశింప జేస్తానంటూ... కష్టం వెంటే సుఖం వుంటుందంటూ, ప్రకృతికి ప్రతిరూపమై మంచి శాంతి సందేశమందించింది మనిషికి.

'దారెంట సమాంతర రేఖల్లా వెళ్లేవారెంట పట్టాలొస్తున్నట్టే నడక' అంటూ... 'నవ్వుల గవ్వల మూట వెంటరాని నడక .. గమ్యాన్ని ముద్దాడ గలదో లేదో తెలియని నడక..' అని తెల్పుతూ దిగంతాలకు పనుల నిచ్చెన లేయ వచ్చిన బతుకు జీవులు కరోనా లాక్ డౌన్ కాలంలో సొంత గూళ్లకు వెళ్లే వలస కూలీల అలసిన దేహాల... మండు టెండల మలమల మాడే నడకల గురించి దయనీయంగా కవయిత్రి కలం కన్నీరు చిలికించిన, మన కంటి చెమరింతల కవిత "వీళ్లు కూడా వున్నారు!"

'ఒలకని మేథోమథనంలో ఒడవని బతుకు సమరం'లో బీదల పొట్టలు గొట్టే భీభత్సం లక్షల సమాధులపై వికటాట్ట హాసం చేస్తున్నదని... కరోనా చీకటి కుప్ప తెచ్చిన తిప్పల్లో స్థంభించిన పౌరజీవనాలు "నిశిరాతిరి" లోని గుసగుసలంటూ జనగోసలను వివరించిన విధంగా... కవయిత్రి వికల మానసం చేసిన సంతాప కవితా సంతకంలా సంచలింప జేస్తుంది.!

మరో కవిత 'దగ్ధహృది'లో వివక్షల దుర్మార్గాల ధరిత్రిలోని చరిత్రల పట్ల స్పందిస్తూ... నయవంచనను కట్టేసేందుకు నిజాల ఉలితో చెక్కిన ఛిద్రిత శిల్పాన్నౌతానంటూ, పసితనం పైన పాశవిక చర్యల్ని ఖండిస్తూ ... రాలి పడిన పువ్వునైనా సరే, కాలిబూడిద కుప్పలైనా సరే.. హృదయాలు వెళ్లగలిగే బాటలు వేస్తానంటూ, చెడు సాగిల పడేలా సాగిపోతానంటూ... దుర్మార్గాలను సహించలేని కాల స్వరూపిణిలా, అన్యాయాల పట్ల అమ్ముల పొదిలా... నేరస్తుల పట్ల నిఘానేత్రంలా... కాలంతో రాజీపడని కవయిత్రి మానసం జడత్వపు జగతికి చైతన్య గీతికలా స్ఫురించి స్ఫూర్తింపజేస్తుంది!

కోట్లాది హృదయాలను గెలిచిన ఒకే పేరు.. అదే రైతు! అంటూ, రైతు యొక్క చెమట చినుకుకు పులకించిన భూతల్లి మొక్క మొలచి దీవెనలిచ్చిందని చెబుతూనే.. నాలుగు నెలల నాగేటి చాలు జాలు వారించిన జరంత పంటకు దోపిడీ




మార్కెట్ చీడలు.. కల్తీ గింజల పీడలు, గిట్టు బాటు ధర లేని గోడలు అడుగడు గనా సేద్యాన్ని గోస పెడ్తున్నాయని.. అయినా గానీ తన శ్రమ దానంతో సమాజానికి ప్రాణభిక్ష పెడ్తున్న.. ఒక్క వ్యవసాయమే వ్యసనమైన 'ప్రత్యేక వీరుడు' అంటూ, హాలం వీరునికి కలం జోహార్లర్పించిన కవయిత్రి తీరు సేద్యం పైన ఒక వైవిధ్యమైన అధ్యయనంలా అన్పిస్తుంది.

ఇంకనూ "హాలిని, హాలికుడు" కవితలో.. పంట పొలాల్లో కన్నుల పంటగా రైతు దంపతుల జంట పనులను గురించి వర్ణిస్తూ కర్షకాంగనను 'హాలిని' అని సంభోదించడం... శ్రమశీలినిగా ఆమె కీలకమైన పాత్రకు పరిపూర్ణ న్యాయం చేసిన ప్రత్యేక పరిమళం సేద్యవనంలో పూచిన హాలిని హాలికుల జంట కవితా సుమం! దగాపడిన కంటనీరు ఉప్పెనలా యెలా ఉప్పొంగునో, అగ్ని గుండంలా యెలా రగిలిపోవునో.. తన మనో యవనిక మాటున "అక్షర తర్పణం" గావించిన కవయిత్రి కలం... అది భావగర్భిత కవితా కవోష్ణకణం!

"కత్తెర" అనే మరో కవితలో.. పుట్టిన బిడ్డకు బొడ్డు కోసే దగ్గర్నుండి బొక్కలనతికే దాకా కత్తెర ఆవశ్యకతను సూచిస్తూనే.. పేద ధనిక తారతమ్యాల అడుగున, మంచి చెడుల నడుమన విద్వేషాలను కత్తిరించలేక కత్తెర పాలైన కత్తిలాంటి కవితను కత్తెరను చేసి సామాజిక గత్తరను కత్తిరించాలని హెచ్చరించింది ! ఎంతో బాగుంది !

నీ లోపల కలలనే కాదు ఖాళీ చేసేది... గుండె బరువును కూడా... అంటూ, జారిన కంటినీరు జ్ఞాన గంగలా జలధిని చేరి జగతిని వర్షించే జలదమైనట్టు, నిజాయితీ కేంద్ర బిందువై, విశ్వమానవ కళ్యాణ సింధువై, విశ్వాసమనే పడవ ప్రయాణంలా, మానవ మనుగడలోని లాలిత్యం ఏకత్వభావనంలోని ఆంతర్యం మోగించే "ధర్మగంట"ను వినమంటూ.... ఆత్మ సౌందర్యాన్ని కనమంటూ వినదిస్తున్న సమతా మమతల గుడి గంట ఈ కవిత !

ఇంకా అమ్మ చేయించే అడుగులా నాన్న పెట్టించే పరుగులా, బడి నేర్పించే జ్ఞానంలా నవనవోన్మేష చేతనం... కేతనం .. అంటూ పుస్తకాన్ని మస్తకాని కెక్కించిన జ్ఞాన కవితాగని "పుస్తకమే మన కేతనం!"

'నమ్మకం అనే భద్రతా ప్రాకారాన.. కలం పట్టినా, కర్ర పట్టినా, తూటా పేల్చినా, లక్ష్యసిద్ధి గల ఆమె జనారణ్యం లోని మృగాల నణిచే మృగరాణి 'మహిళా పోలీస్' అంటూ ఆ వృత్తిలోకి పరకాయ ప్రవేశం చేసి రాసిన "ఈ కదన రంగాన" కవితకు అభినందనలు!

ఎడారిలో పూలు పూయించే కవి సంఘసేవహేతువులకు సేతువులంటూ, రవిగా, కైరవిగా "కవి" గురించిన కవనం కడు రమణీయం!

భార్యకు చేదోడు వాదోడుగా భర్త వుంటే... 'లాక్ డౌన్'లో సైతం ఆ "గృహవాసం" "స్వర్గవాసం" అని తెల్పిన అనుభవ సత్యం పురుషులందరికీ ఆదర్శదర్శనం!

జనానికి చావు భయం కాదు "కాల ప్రభంజనం" లో బతుకు భయం.. అంటూ, ప్రమాదాల పర్వాలు ఓ పద్దెనిమిదైనపుడు, నివారణా చైతన్యాలు కావాలి నూట పద్దెనిమిది".. అని అద్భుత

సందేశమందించిన కవిత సరికొత్త ప్రభాతంలా ప్రభావితం చేస్తుంది. సహాయ సహకారాల చేతనకు చేయినందిస్తుంది!

'బతుకమ్మ ఆడోళ్ళు "కవిత..." కవిత్వం పేనినట్లు, కుటుంబం కలిసినట్లు... బతుకమ్మలు పేర్చి మనసంత గుమ్మరిస్తరు ఆడోళ్లు!' అంటూ పొద్దుగూకాగనే జంట సోపతుల గొంతుకలతో, చప్పట్లు మెప్పులతో, ఉయ్యాల రాగాలతో, పలు పౌరాణిక చారిత్రిక నేపథ్యానికి పురుడును పోస్తూ, తెలంగాణ సంస్కృతికద్దం పడుతూ, బతుకమ్మలాడే ఆడోళ్లంతా అన్ని రకాల పువ్వులంటూ.. తీరు తీరునా వర్ణించిన తీరైన ఈ కవితా వతంసము మనోహరమైన పూల వసంతమే!

ఇంకనూ "హంసల దీవి" కై అన్వేషిస్తున్నానన్న కవితా పంక్తులు పరమహంసల పాదముద్రలేనన్పిస్తాయి.

అలాగే 'ఎండిన నేలతవ్వితేగదా లోన తడినీరై ఉబికేది' 'ఆపత్కాలంలో అంతో ఇంతో మంచితనం తోనే గదా సమాధి స్థలంలో సైతం మొక్కలు మొలిచేది' అంటూ మొక్కవోని ధైర్యాన్నందించిన కవిత "జీవిత చక్రం" అనుపమ విక్రమం.

"అగ్ని పుష్పాలు" రాల్చే యంత్రాల నడుమ శ్రమ జీవుల మేడే దినోత్సవాలు... తన కంటి మెరుపులంటూ, శ్రమజీవన సౌందర్య శకలాన్ని వెదజల్లిన వేదనానందాల కవితాగంధం!

ఇంకా... నిర్భయ తల్లి విజయాన్ని "అమ్మ గెలిచింది కవితలో మనసును కదిలించి కవయిత్రి కలిగించిన సంచలన సాంత్వనం.

"కొండలనేం పుట్టించలేం గాని, ఒక్క మొక్కనైనా నాటండి అంటూ ప్రకృతి విధ్వంసకుల కిచ్చే పచ్చని సందేశం "మళ్ళ ప్రస్థానం మనో విస్తారం" కవితాహారం!

మన పండుగలు, సంస్కృతులు, పలు సందర్భాలను ప్రస్తావించిన, బడుగు బ్రతుకుల్ని ప్రతిబింబించిన, ఒకదాన్ని మించి మరొకటన్పించిన అన్ని కవితలూ కవయిత్రి ఆంతర్యాన్ని ఆవిష్కరిస్తూ విశ్వభావనా సంఘర్షణల సంకలనమై, పచ్చని ప్రశ్నల సముదాయమై, ఆధ్యాత్మిక రూపాలతో ఆత్మ దీపాలతో భూనభోంతరాలను తాకిన కవితాక్షర నక్షత్ర సమూహం కాల ప్రభంజనం!

ప్రకృతి ఆవరణమే అందమైన ఆభరణమైన కళాతోరణం నీహారిణి గారి కలం కళల ధారణం ఈ కవితా సమాహారం !

సామాజిక హితసుమాలను పూయించి ఆనంద పరిమళాలను వెదజల్లే తోటమాలి ఈ కవితామాలిక!

అందరూ చదవదగిన, చదివి అనుసరించదగిన అద్భుత సంకలనం ఈ "కాల ప్రభంజనం". హృదయ స్పందనం కలిగించే "కాల ప్రభంజనం" కవితలను చదవ గల అవకాశం, చదివి 'సమీక్ష' వ్రాయగల మహదవకాశం నాకిచ్చిన కవయిత్రి కొండపల్లి నీహారిణి గారికి ధన్యవాదములు

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునికోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో, బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికనుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in



# నెలపొడుపు

దేవనపల్లి వీణావాణి, 99513 31122

నిన్నటిదాకా
పాదాలకు వెదురు బద్దలు కడితే
ఇంటి చూరుకు వేలాడిన
లిల్లీ పూలన్నీ లిల్లీపుట్లు
వెంట్రుకకు కూడా గాలి తాకకూడదు
కన్నుతో లోకం చూడడానికి మాత్రమే
పొగల తెర
ఉమ్మెత్తరసంతో చితికెక్కిన

సతి
బొట్టు కూడా వెక్కిరిస్తే
బోడి తలలై పండి పోలేదా
అమ్మకాలు, కొనుగోళ్లు
వరకట్నాలు, కన్యాశుల్కాలు
లేత పెళ్లిళ్లు
ఉరితాళ్ళు, చెరువులు
ఉత్త చేదు బావులు కదా
గొంతులో వడ్లగింజలతోనో కాకపోతే
కడుపులోనే నలిపివేస్తేనో
మళ్లీ భూమిలోకే

లేత పిందెలు తొంగి చూసాయి
విత్తనానికే అమ్మతనం
ఆమె చిరునవ్వు రాలిపడి
నందనవనం విరిసిందెక్కడ?
ఖండాంతరాలనిండా
ఆమె రక్తం మరకలే
ఎటుచూసినా ఉప్పు సముద్రాల ఈతలే

మెదళ్లకు
ఎడారి విస్తరించింది
తడి లేని గుండెల వికృతాలకు
పసిదేహాలు ..
అయ్యో అవిప్పుడు బొగ్గు ముక్కలు
ఆమ్ల విఘాతాలు
చెరిగిన విధి గీతలు

అవయవ మార్కెట్లకు
నెత్తుటి రాతలకు
ఆమే అక్రమ రవాణా
చేయగలిగిన కొత్త వస్తువు

కథ

# గుల్‌దస్తా

గిరిజనులను అనుక్షణం మోసం చేస్తున్న నాగరికత...



జ్వలిత
99891 98943

అదొక గిరిజన ఆవాసం, తండా, గూడెం, గుంపు అని కూడా పిలుసుకుంటారు వాళ్ళు. మిగిలిన నాగరిక ప్రజలు కూడా అట్లాగే పిలుస్తారు. నగరవాసులంటే వారికి భయం. నాగరికులంటే మోసగాళ్ళని వారి అభిప్రాయం. పోలీసులు, ఫారెస్ట్ అధికారులు, న్యాయస్థానాలంటే మరీ భయపడతారు. వారితో మాట్లాడటానికి కూడా ఇష్టపడరు.

చుట్టూ అడవులు పర్వతాల నడుమ రెండు మూడు గుంపులుగా కొన్ని గిరిజన కుటుంబాలు దాదాపు వంద సంవత్సరాల నుండి ఆ చీకటి జీవితాలను వెళ్ళదీస్తున్నారు.

అక్కడికింకా రోడ్లు, కరెంటు వంటి సౌకర్యాలు చేరలేదు. పాఠశాల, వైద్యశాల వంటివి వారికి తెలియదు.

అయితే వారి సంప్రదాయాలు ఆచారాల ప్రకారం పండుగలు, ఉత్సవాలు చేసుకొని ఆనందిస్తారు.

వసంత పండుగ సమయమది. ఆ గుంపుల్లో యువతులంతా నిద్ర లేవగానే, రంగు రంగుల ముగ్గులు వాకిళ్ళలో, గోడల మీద చిత్రించడంలో మునిగిపోయారు. కనీసం ముఖం కడుక్కోడానికి కూడా ముగ్గులు వేయడం ఆపట్లేదు. తెలుపు పసుపు రంగులతో గోడలన్నీ అలికారు. వరండాలని నలుపు పసుపు రంగులతో. ఉల్లాసం కలిగించే డిజైన్లను చిత్రించారు. గోడల మీద వరండాలో బియ్యం పిండిని నీటిలో కలిపి రంగులతో ముగ్గులు వేశారు. చివరికి గుడిసె లోపల నేలంతా రంగులతో నింపారు. తలుపులు కిటికీలు దర్వాజాలకు బొగ్గు పొడి నూనెలో కలిపి పూసారు. చిన్న చిన్న గుడిసెలు నవ వధువుల వలె మెరుస్తున్నాయి.

కొందరు స్త్రీలు బట్టలుతికేందుకు కట్టెల బూడిద కలిపి ఉడికిస్తున్నారు. అన్ని మరకలు పోయి, మరింత తెల్లగా అయ్యేందుకు బలంగా బండకేసి బాదుతున్నారు. తర్వాత తాము కూడా స్నానం చేసి సిగలను అలంకరించుకున్నారు. చివరిగా చేతికున్న భారీ ఇత్తడి గాజులను రుద్ది రుద్ది మెరుగు పెట్టారు. మధ్యాహ్నం కంటే ముందు వాటిని మెరిసేలా రుద్ది తృప్తి పడ్డారు. ఆ తర్వాత అందమైన రంగుల చీరలు మడత పెట్టి, బిగుతుగా నడుము చుట్టూ మోకాళ్ళు దాటకుండా కట్టి గుంపులుగా అడవిలోకి అదృశ్యమయ్యారు. తాజా పూలను వెతికి కొప్పులో ధరించేందుకు. వారు తలలో పూలు లేకుండా నాట్యం చేయరు. ప్రపంచంలో ఎక్కడైనా, ఏ కాలంలోనైనా.. స్త్రీలు సౌందర్య పిపాసులు, మిక్కిలి శ్రమజీవులు అని చెప్పేందుకు వారే సజీవ సాక్ష్యాలు.

★ ★ ★

సుక్కడు తన వంతు కట్టెలను పోగు చేశాడు. కానీ అతని మనసు పండుగ వాతావరణంలో లేదు. రోజంతా గుడిసె ముందున్న పరుపు బండ మీద కూర్చుని ఉన్నాడు. ఒకప్పుడు పనిలో అలసిపోయినప్పుడు మాత్రమే అక్కడ విశ్రాంతి తీసుకునే వాడు. ఇప్పుడు ఎవరు తన బాధలను భావాలను పంచుకునేందుకు లేరు. అతని పిల్లలు చిన్న వాళ్ళు కష్టసుఖాలు వారికి తెలియదు. అతనికి ఇద్దరు కొడుకులు, ఇద్దరు బిడ్డలు. ఇప్పుడే నాటిన విత్తనాల వంటి వాళ్లు తన పిల్లలు. పెద్దది గోరీ గోర్యా కోసం కలలు కంటున్నది. చిన్నది మోరీ ఇంకా ఎవరిని ఎంపిక చేసుకోలేదు. చిన్నకొడుకు బాలగిరి ఇంకా చిన్నవాడే. ఇప్పుడిప్పుడే నూనూగు మీసాలు వస్తున్నాయి. పెద్దకొడుకు బాలగామా ఎవరి సాయం అందక నిరాశకు లోనవుతున్నాడు.

సాయంత్రం అవగానే ఒక్కసారిగా ‘దొంగా దొంగా’ అంటూ కేకలు వినపడ్డాయి. వేడుక మొదలైందని చెప్పే గుర్తు అన్నమాట. ఆచారం ప్రకారం ఒక యువకుడు ఎవరో ఒకరి ఇరుగుపొరుగు ఇంటిలో దూరి ఏదో ఒక వస్తువు తన చేతిలో పట్టేంతది ఎత్తుకు వస్తాడు. ఏదో ఒక నీళ్ళ బిందె కానీ, పెరటి తోటలో బుట్టెడు కూరగాయలు కానీ ఏదైనా కావచ్చు. ఇదంతా ఒక ఆట. తర్వాత రోజు దొంగిలించిన వాటిని నామ మాత్రపు

కథ

డబ్బు తీసుకుని తిరిగి ఇచ్చేస్తారు.

* * *

సాయంత్రం పండుగ మంట వెలిగించడం కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. యువకులంతా వాయిద్యాలతో అక్కడికి చేరారు. మొదటి ధ్వని కోరస్‌గా వినపడింది. యువతులు అంతా చక్కగా పూలతో గాజులతో అలంకరించుకుని అర్ధచంద్రాకారంలో ఒకరి చేతులు ఒకరు పెనవేసుకొని నిలబడ్డారు. ఎత్తైన యువతి ఆ వరుసలో ఒక చివర ఉన్నది. వారి ముఖాలకు నూనె పసుపు పులుముకొని ఉన్నారు. బిగువైన వారి శరీరాలు లయబద్ధంగా ముందుకు వెనుకకు కదులుతున్నాయి. పండగ మంట వెలుతురుతో యువతుల వేగం పెరిగింది. చిన్నచిన్న మంటలు ఒక పెద్ద వృత్తాకారంలో వెలిగించారు. వారి చుట్టూ నాట్యాన్ని చూసేందుకు వీలుగా.

అప్పుడు జోడియ తెగ నాట్యం చేయడం మొదలు పెట్టింది. ఆచారం ప్రకారం యువకులు నాట్యం చేయమని యువతులను ఆహ్వానిస్తూ విన్నపం వలె పాట సాగుతుంది. అప్పుడు యువకులు "గాజుల ఘర్షణ"గా పిలవబడే నాట్యాన్ని చేయమని యువతులను ఆ పాటతో ఆహ్వానించారు.

ఆ పాట

"నీ చేతి గాజులు ఒకదానితో ఒకటి మోగనీ - నీచేతి గాజులను ఘర్షణ పడనీ

ఓ నా ప్రియమైన చిన్నదానా - మనమంతా కలిసి

ఈ గాజుల ఘర్షణ నాట్యం చేద్దాం

గతంలో మన తండ్రులు చేశారు - దాన్ని మళ్లీ మనం చేద్దామురా

ఈ పురాతన గ్రామం - నీ చేతి గాజుల శబ్దాలతో - ప్రతి ధ్వనించనీ..

మనమంతా ఆడుదాం వేడుకగా - మనసుతీరా నవ్వుకుందాం"

అని పాడారు

యువతులు తమ భారీ ఇత్తడి గాజులు తెచ్చి, ఒకదానితో ఒకటి కొడుతూ, మోగుతున్న డప్పుల మోతలకు, మిగిలిన వాయిద్యాలకు అనుగుణంగా నాట్యం చేస్తున్నారు. అడవి పులకరిస్తోంది, ఆ వాయిద్యాల నాట్యంతో అక్కడి నేల కంపిస్తుంది. గిరిజన తెగలవారు తరతరాల నాట్యాలు పునరావృతం చేశారు.

"తాజా గాలిలో విషం లేదు - నమ్మకం ఒక్కటే ఉన్నదీ..

ఎవరైనా - అడవిదారిన నడిచినా

వారి భుజాలపై వారి బాధ్యతలు తప్ప మరే బరువులు లేవు

మరెవ్వరూ - మన నేలను ఆక్రమించరు

ఇక్కడి నేలపై కొండలు లోయలు - ఈ భూమంతా మనదే - మరెవరిది కాదు"

అంటూ పాటలు ప్రతిధ్వనిస్తున్నాయి.

గిరిజన పురోహితుడు వచ్చేసరికి నాట్యం మొదలైంది. నిర్దేశించిన ప్రకారం పూజ మొదలై, కొనసాగుతోంది. పెద్ద మంట కోసం పెట్టిన కట్టెల కుప్ప ముందు నల్ల కోడిపుంజును కోసారు. ఆ రక్తాన్ని భూమిలోకి ఇంకిస్తున్నారు. వేడి వేడి తాజా ఇప్పపూల సారాను కూడా రక్తంలో కలిసేట్టు గుమ్మరించారు. అది భూమాతకు చేసే తర్పణము. పూలను సమర్పించారు. తర్వాత రక్తంలో తడిసిన కోడిపుంజు కట్టెల కుప్ప మీద ఆనించి కొన్ని పూలను చల్లారు. కట్టెల మీద ఇంకా కొంచెం ఇప్ప సారాని పోసారు.

ఒక్కసారిగా కేకలు డప్పుల మోతలతో కట్టెలు చిటపటలాడుతూ మండుతున్నాయి. వాయిద్యాల మోతలు అధికమయ్యాయి. యువతులంతా ఒకరి చేయి మరొకరు పట్టుకుని పొడవైన గొలుసులా తయ్యారయ్యారు. ఆ అమ్మాయిల గొలుసు ఆ మంట చుట్టూ మెలికలు తిరుగుతూ.. గుండ్రంగా తిరుగుతున్నారు. ఆ వెలుతురులో కొత్తగా మెరుస్తున్నారు. వారి ఎర్రని ముఖాలపై వెలుగు ప్రతిబింబిస్తున్నది. సంగీతం పెరిగిన స్థాయికి అనుగుణంగా నాట్యం వేగాన్ని అందుకుంటుంది. యువతులు యువకులు పాటకు కోరస్‌గా పాడుతున్నారు. ముందు అనుకున్నట్టు ఒక సంకేతంతో ఒక్కసారిగా పాట ఆగిపోయింది. డప్పులు మరొకరు తమ కొత్త లయలో మోగిస్తున్నారు మరో బృందం కోరస్ అందుకుంది.

"అమ్మాయిలూ అబ్బాయిలూ కలిసి రండీ.. దిడ్డా! దిడుకుం! దిడ్డా! దిడుకుం!" అంటూ డోళ్ళు మోగుతున్నాయి. యువతులు సంతోషంగా పెద్దగా కేకలు పెడుతూ సంగీత ఝుంకారానికి అనుగుణంగా పాడుతూ నిషాలో నాట్యం చేశారు ఆ రాత్రంతా.

అర్ధరాత్రి సుక్కడు లేచి పరుపు బండ మీద కూర్చున్నాడు. చుట్టూ చూసుకున్నాడు దాదాపు మంట ఆరి పోయింది. బూడిదలో మెరుస్తున్న నిప్పు మిణుగురులు మిణుకు మిణుకు మంటున్నాయి. ఎక్కడబడితే అక్కడ గుంపులుగుంపులుగా జనాలు నేల మీద చచ్చేట్టు తాగి పడి ఉన్నారు. ఆ సమయంలో పండుగ నిశ్శబ్దాన్ని చేరుకుంది. కానీ మళ్ళీ ఆ మంటలు వెలిగించ బడతాయి మరొక ఊరిలో మరో కొండ ప్రాంతంలో. పండుగ ఆ నెల పొడుగునా వేడుక జరుగుతుంది. కానీ సుక్కడికి అదంతా ఆనందాన్నివ్వట్లేదు.

మరుసటి రోజు వేడుకల బాధ్యత పిల్లలు తీసుకుంటారు. వారు స్వయంగా

**చుట్టూ చూసుకున్నాడు దాదాపు మంట ఆరి పోయింది. బూడిదలో మెరుస్తున్న నిప్పు మిణుగురులు మిణుకు మిణుకు మంటున్నాయి. ఎక్కడబడితే అక్కడ గుంపులుగుంపులుగా జనాలు నేల మీద చచ్చేట్టు తాగి పడి ఉన్నారు. ఆ సమయంలో పండుగ నిశ్శబ్దాన్ని చేరుకుంది. కానీ మళ్ళీ ఆ మంటలు వెలిగించ బడతాయి. మరొక ఊరిలో మరో కొండ ప్రాంతంలో. పండుగ ఆ నెల పొడుగునా వేడుక జరుగుతుంది. కానీ సుక్కడికి అదంతా ఆనందాన్నివ్వట్లేదు.**

బృందాలుగా ఏర్పడి ఇంటింటికి వెళ్లి తిండి గింజలను అడుగుతారు విందు కోసం. ప్రతి పిల్లవాడు ఒక చెంప నల్ల రంగు మరో చెంప తెల్ల రంగు పూసుకుని ఉంటాడు. వారి బట్టలు కాళ్లు చేతులు రకరకాల రంగులు పూసుకుని ఉంటాయి. చేతిలో చిన్న చిన్న కర్రలతో ప్రతి ఇంటి ముందుకు వెళ్లి నేలను కొడుతూ పాటలు పాడుతూ డాన్స్ చేస్తారు.

"చర్ చర్రా చర్ చర్రా - మాకు కొంత డబ్బులు ఇవ్వండి - ఒక కట్ట చొప్ప ఇవ్వండి"

అని పాడుతూంటే ఇంటి యజమాని లేదా అతని భార్య బయటికి వచ్చి చూసి నవ్వుకుంటూ వెళ్లి చేతినిండా బియ్యం లేదా ధాన్యం తెచ్చి వారి వద్ద ఉన్న బాదం గిన్నెలు వేస్తారు. ఆ గుంపు మరో ఇంటి వైపు సాగుతోంది వీధుల్లో.

వృత్తి సంగీతాన్ని వాయించడమే వృత్తిగా కలవాళ్ళు కొందరు. ఇంకా డోలు వాయిస్తూనే ఉన్నారు అప్పుడప్పుడు ఉన్నట్టుండి యువకుల గుంపు ఊగుతూ నాట్యం చేస్తుంది. మద్యం ఏరులా పారుతుంది. పురుషులంతా ముచ్చట్లు పెడుతూ ఉంటే, స్త్రీలు పాటలు పాడడం నవ్వడం చేస్తుంటారు. సాయంత్రం డోళ్ళ శబ్దం వినపడింది. పక్క ఊరి నుంచి ఆ గుంపు మరో రాత్రి వినోదానికి సిద్ధపడు తోంది. అప్పుడు ఇక ఏమాత్రం పొలాల్లో పని చేయరు. జీవితం అంతంలేని వేడుకలు సమాహారం వారికి.

★ ★ ★

అర్ధరాత్రి గడిచిన తరువాత గోరీ లేచింది. మోరీ మంచి నిద్రలో ఉంది. గోరి బయటకు నడిచింది, నెల పొడుపు చంద్రుడు రావి చెట్ల కొమ్మల నుండి తొంగిచూస్తూ శూలాలు విసురుతున్నాడు. మసక వెన్నెల కాంతి పొగమంచును జల్లెడ పడుతున్నది. అడవంతా నిద్రలో ఉంది వెలుగునీడలు పొగమంచుతో కలిసి కొత్త రంగుల కలలను అల్లుతున్నది, చలిని పట్టించుకోకుండా. ఆమెకు తనెనెవరో సున్నితంగా పిలుస్తున్నట్టు అనిపించింది బయటకు వచ్చి చూసింది ఎవరు లేరు అక్కడ.

చెట్టు కింద మిణుగురు పురుగులు చీకట్లో మెరుస్తున్నాయి. ఆమె తన చేతి నిండా మిణుగురు పురుగులను పట్టుకున్నది. అంతలోనే తన కళ్ళను ఎవరో మూసి, తనను ఒక్కసారిగా లాగి బలమైన చేతులతో బంధించాడు. ఆమె తన తలను తిప్పి చూసింది అతను గోర్యా. తల నుండి కాళ్ళ వరకు సంచులతో కుట్టిన బొంత కప్పుకొని ఉన్నాడు. వెన్నెల రావి చెట్టు ఆకుల సందు నుండి బొట్లు బొట్లుగా జారుతూ భూమి మీద రంగవల్లులు అల్లుతున్నది. ఆ వెన్నెల వర్ణచిత్రాలను దాటుకొని నడుస్తూ ఒక పరుపు బండ దగ్గరకు చేరి కూర్చున్నారు. ఊరి మధ్య రావి చెట్టు నిలబడి ఉన్నాయి. అన్ని ఇళ్ల తలుపులు మూయబడి వాటి వెనుక మినుకు మినుకు మంటూ నెగళ్ళు, వాటి పక్కనే కుక్కలతో పాటు మనుషులు నిద్రిస్తున్నారు.



మరొక యువతి బయటకు వచ్చి అడవి వైపు కదిలి జంటగా చీకట్లో కలిసిపోయింది. ఎవరి కంట తాము పడకుండా.

గోరీ, గోర్యా ప్రశాంతంగా కూర్చున్నారు.

"పగటిపూట ఒంటరిగా అడవిలోకి రావచ్చు కదా" అంటూ గుసగుసలాడాడు గోర్యా.

"నేను ఇంటి పనిలో తీరిక లేకుండా ఉంటాను. మా అక్క, అన్నా ఎప్పుడూ నన్ను అంటిపెట్టుకునే ఉంటారు. ఎలా రాగలను" అని గుసగుసలాడిందామె.

"నీ సంగతేంటి నిన్ను చూడడమే కుదరడంలేదు" అంటూ ఆ ప్రేమికులు ఒకరికొకరు చాలా చెప్పుకున్నారు.

చివరికి కోపం నటిస్తూ "ఎన్ని రోజులు ఈ విధంగా కొనసాగుతాము. మనిద్దరం లేచి పోదామా" అన్నది గోరీ.

గోర్యా ఆమెను చుట్టేస్తూ "నేను ఆలోచించడం లేదు అనుకుంటున్నావా! కానీ" అని ఆగాడు. "నువ్వు నిజంగా ప్రేమిస్తే భయపడాల్సిన పనిలేదు" అంటూ ముఖం తిప్పుకుంది.

"నీ ప్రేమ ప్రమాణాలకు అర్థమే లేదు" అని నిష్ఠూరమాడింది. ఆమెను కౌగిలించుకొని బుజ్జగించడానికి ప్రయత్నిస్తూ "నీకు తెలుసా మనం ఇప్పుడు పారి పోవచ్చు, కానీ రేపు పొద్దున్నే మీ నాన్న తన బంధువులతో వచ్చి, కన్యాశుల్కం ఇమ్మని తలుపు కొడతాడు. దాన్ని ఎట్లా ఎదుర్కోవాలి" అన్నాడతను.

"అయితే కన్యాశుల్కం కట్టలేవా" అని ఒత్తిడి చేసింది ఆమె. మళ్ళీ "మీ నాన్న అంత పేదవాడా? కన్యాశుల్కంగా కొద్ది డబ్బులు కూడా ఇవ్వలేడా?" అన్నదామె.

"కానీ రెండు, మూడు వేల రూపాయలు గోరీ ఎక్కడి నుండి తేగలను. అంత సొమ్ము వెంటనే చేయడం కుదురుతుందా" అన్నాడతను.

కథ

"అయితే ప్రేమ ముచ్చట్లు ఆపు గోర్యా! ప్రేమ చూపడం ఆపు! అప్పుడు నీ డబ్బు నీ వద్దే ఉంటుంది. మైదాన ప్రాంతం ఆడవాళ్ళ వలె కూర్చొని తినే దాన్ని కాదు నేను. చాలా కష్టపడి పని చేస్తాను. ఇక చాలు నన్ను పోనివ్వు" అంటుండగా ఆమె పెదవులు వణికాయి. కన్నీళ్లు రాలాయి.

కానీ ఆమె తన కోపాన్ని మర్చిపోయి కళ్ళు మూసుకుంది. అతడు ఆమెను ప్రేమగా దగ్గరకు తీసుకొని బుజ్జగిస్తూ ఉంటే, అతని ఆత్మీయ స్పర్శతో పరవశించిపోయింది.

"ఆమె నన్ను ఎప్పుడు తీసుకు పోతావు" అన్నది మత్తుగా.. గుసగుసగా.

ఆమెను అక్కున చేర్చుకొని "అతి తొందరగా.. ఈసారి పంట కోసం ఎదురు చూస్తున్నాను. డబ్బులు రాగానే వీలైనంత తొందరగా నీ దగ్గరికి వస్తాను. లేదా ఏదో ఒక రకంగా అప్పు చేసి, ఎట్టిగా నైనా మారుతాను" అన్నాడు.

"వద్దు వద్దు" అంటూ ఆమె అతనిని చుట్టుకుంది.

"నేనెప్పటికీ నీవు ఎట్టికి వెళ్లడానికి అంగీకరించను" అన్నది

"నువ్వేం బాధపడకు, ఏమి జరగాలో అది జరుగుతుంది. కానీ పెళ్లిళ్ల మాసం రాగానే మొదటి రోజే నిన్ను మా ఇంటికి తీసుకు పోతాను" అన్నాడతను. తరువాత ఎవరి గుడిసెకి వారు వెళ్లిపోయారు.

ఈ గిరిజన తెగ సంవత్సరంలో నాలుగు నెలలు పెళ్లిళ్లు చేస్తారు. ఫిబ్రవరి మార్చి ఏప్రిల్ మే నెలల్లో, మార్చి ఏప్రిల్ చైత్రం వారికి, వసంతోత్సవ పర్వం. ఆ రోజుల్లో వాళ్లు రాత్రి పగలు నాట్యాలు చేస్తూ, వేటలతో విందులు చేసుకుంటారు.

ఈ వసంతంలో గోరీ, గోర్యాతో కలిసి నాట్యం చేయాలి, అతని భార్యగా. గోర్యాకు తనకు కలిసి ఒక సొంత ఇల్లు ఉంటుంది, వారిద్దరూ కలిసి అడవికి వెళ్లి ఆకుకూరలు దుంపలు తినడానికి వంటచెరకు తెచ్చుకోవాలి. అతడు పొలానికి వెళ్ళినప్పుడు అతని కోసం అంబలి సొరకాయ బుర్రలో తీసుకొని పోవాలి ఆమె. అతనితో కలిసి చేపలు పట్టేందుకు వెళ్లాలని, 'శీలవతి చేపలు' పెద్దతలలతో పొలుసులు లేకుండా మెత్తగా ఉంటాయి. వాటిని రుచికరంగా వండి, అడవి నుండి ఆకులు తెచ్చి చోళ్ళ అంబలి కొంచెం ఉప్పు అతనికి ఇష్టంగా వడ్డించాలి, వారిద్దరికీ సొంత ఇల్లు ఉంటుందనే ఊహలలో తేలిపోతోంది గోరీ.

గోర్యా కూడా ఆలోచనల్లో మునిగాడు. ఏమైనా సరే ఏదో ఒకటి చేసి కన్యాశుల్కం కోసం డబ్బు సంపాదించాలి. మళ్ళీ వెంటనే తనను తాను పెళ్లిబంధంలో ఇరుక్కోవడమా, ఆ విధంగా స్వేచ్ఛ వదులుకోవాలా? కచ్చితంగా నిర్ణయించు కోలేకపోయాడు. కానీ అప్పుడు వణికే పెదవులతో కన్నీటితో నిండిన గోరీ ముఖం అతని మనసులో కదలాడింది. అపరాధ భావన కలిగింది అతనికి. కానీ అతను నిద్రించగానే ఎందరో యువతులు తనకోసం పోటీ పడుతున్నట్లు, అనేక ముఖాలు అతని ఆలోచనల్లో కదలాడాయి.

★ ★ ★

ఎప్పటివలనే గ్రామంలో "గ్రామ పెద్ద" ఇంటి వరండాలో బసచేశాడు ఫారెస్ట్ గార్డ్. అక్కడ ఆడుకుంటున్న చిన్నపిల్లలు అతడిని చూసి భయంతో గబగబ దూరంగా పోయారు. చుట్టుపక్కల ఆడవాళ్ళంతా ఇంటిలోపలకు పోయి, తమ గుడిసెల ద్వారం వైపు మూగకళ్ళతో చూస్తున్నారు, కన్నాల్లో నుండి నక్కలు చూసినట్లు.

ఆ గుంపు పెద్ద దగ్గర ఎట్టివాడు మరోసారి గ్రామంలోని అన్ని వీధులకు వెళ్లి గ్రామస్తులు అందరినీ పోగేశాడు. గ్రామ పెద్ద ఫారెస్ట్ గార్డ్ సేవ చేయడంలో నిమగ్నమై ఉన్నాడు. మాంసం కోసం కొయ్యడానికి ఒక మేకను తెచ్చారు, కోళ్లు కోడిగుడ్లు కూరగాయలు సేకరించబడ్డాయి.

గ్రామస్తులంతా వచ్చి వినయంగా నిలబడ్డారు. ఫారెస్ట్ గార్డ్ సౌకర్యంగా స్థిమితపడ్డాడు.

సాయంకాలం తనకు ఇష్టమైన ప్రదేశాన్ని వెతుకుతూ బయల్దేరాడు, వాగు తీరాన ఎవరూ లేరు అతనికి అసంతృప్తి కలిగింది. "ఒకవేళ గోరీ వచ్చే సమయం ఇది కాదేమో, వేచి చూడాలి" అనుకున్నాడు. గోరీ కోసం పొదలచాటున మాటు వేసి ఉన్నాడు. కొందరు అమ్మాయిల గుంపు చెలెమె వద్దకు వచ్చి వెళ్ళారు, కానీ అందులో గోరీ లేదు. చీకట్లు కమ్ముకున్నా అతను ఎదురు చూస్తూనే ఉన్నాడు. చివరికి చాలా సేపటికి దూరం నుండి ఎవరో ఒంటరిగా కొండ దిగువలో మట్టికుండతో నడుస్తూ కనిపించింది. అది గోరీనే.

ఆమె దగ్గరికి వచ్చిన తర్వాత ఒక్కసారిగా చాటు నుండి ఆమె ముందుకు వచ్చి నిలబడ్డాడు, నవ్వుతూ మీసాలు దువ్వుతూ.

"నన్ను గుర్తుపట్టావా అమ్మాయి" అంటూ మాటలు కలిపాడు.

"ఔ తెలుసు" గోరి సమాధానం ఇచ్చింది.

"నువ్వు ఎంత అందంగా ఉన్నావు" అంటూ ఆమెకు సైగ చేశాడు.

అతను కొన్ని అడుగులు ముందుకు వేసి. "నేను నిన్ను 'ప్రియా' అని పిలవవచ్చునా".

"ఓ పిలవచ్చు. కానీ నీవు నాకు 'ఏమౌతావు, నీకు నేను ఏమౌతాను" అన్నది అమాయకంగా గోరి.

" నేను ఈ రాత్రికి ఇక్కడే బస చేస్తున్నాను" అంటూ ఫారెస్ట్ గార్డ్ ఆమెకు సూచన చేశాడు. మళ్ళీ "ఈ సాయంత్రం నాట్యం సంగతి ఏమిటి ? నువ్వు వస్తావా" అన్నాడు.

"తప్పకుండా.. నాట్యమంటే చాలా ఇష్టం నాకు, ఎవరైనా డప్పు వాయిస్తూ పాట పాడితే, నేను డాన్స్ చేస్తూ ఎగురుతాను" అన్నదామె. ఇద్దరూ కలిసి నవ్వుకున్నారు.

జానపద గీతాన్నొకదాన్ని ఫారెస్ట్ గార్డ్ రెండు చరణాలు పాడాడు.

"రావోయి ఓ నా ప్రియురాలా
దిట్టంగా కట్టిన ఇంటి గోడల వలె -
నువ్వు బలంగా ఉన్నావా"

ఒక్కసారిగా అతడు ఆమె ముందుకు దూకి ఆమె భుజాలపై రెండు చేతులు ఉంచి, ఆమె కళ్ళలోకి చూస్తూ నవ్వాడు.

గోరీ విదిలించుకుని ముందుకు నడిచింది. ఒక కొండ జాతి అమ్మాయి లేచి పోతే ఎవరు తప్పు పట్టరు. కానీ దానికి కొన్ని నిబంధనలు ఉన్నాయి. ఒక అపరిచితుడు తన పరిధులను దాటి అవివేకంగా ప్రవర్తిస్తున్నాడు.

గోరీ ఆశ్చర్యపోయింది అవాక్కయింది. కానీ తన తిరస్కారాన్ని ఫారెస్ట్ గార్డ్ ముందు బయట పెట్టలేదు. ఆమె నల్లటి కళ్ళు అయిష్టాన్ని మాత్రం వ్యక్తపరిచాయి.

గ్రామస్తుల గుంపు ఒకటి వారాంతపు సంత నుండి తిరిగి వస్తూ చెరువు అవతలివైపు, గట్టు మీద నడుస్తూ వారిలో వారు గట్టిగా మాట్లాడుకుంటున్నారు.

అది చూసి ఫారెస్ట్ గార్డ్ వెనుకకు తగ్గాడు. వారు కనుమరుగు కాగానే, మళ్లీ "ప్రియమైన గోరీ.." అంటూ గొణుగుతూ ఆమె వైపు వచ్చాడు.

ఫారెస్ట్ గార్డు వేటగాడి వలె ఆమెను వెంటాడుతూ, ఆమెను తన వైపు లాగాలని చూస్తున్నాడు. "ఇక్కడ మనని ఎవరూ చూడరు ఎందుకు భయపడుతున్నావు" అంటూ గట్టిగా సణగడం మొదలు పెట్టాడు. అతని కళ్ళు ఎర్రగా మారాయి.

"ఇక్కడ ఎవరూ లేరు, భయమెందుకు? నాతో రా గౌరీ, మనమిద్దరమూ ఈ కొండ దాటి అవతలి వైపు పోదాం, అక్కడ ఆకుపచ్చ పావురాలను నా తుపాకీతో వేటాడుదాము రా" అంటూ, అతని రెండు చేతులూ వెడల్పుగా చాపుతూ ఆత్రంగా ఆమె వైపు రెండు అడుగులు వేసాడు.

ఆమె కదలలేదు అతడి ముఖం సమాధి రాయిలా ఉంది. ఆమె అతని వైపు కింది నుండి పైకి చూసింది. ఇంతవరకు ఆమె చూడని వ్యక్తిని చూసినట్టు. పొడవుగా, బక్కగా, ముదిరి గిడసబారినట్టు వింతగా ఉన్నాడు. అతని చెంపలు లోపలికి పీక్కుపోయి గుంటలు పడి ఉన్నాయి. కాళ్లు చేతులు బలహీనంగా ఎండిపోయాయి పదే పదే మలేరియా బారిన పడిన వాడి వలె. గాలి కోసం అతడు గసపెడుతున్నాడు. అతను గొణిగినట్టుగా పళ్ళు కరచుకొని "మనం పోదాం రా.. పోదాం రా.." అంటున్నాడు.

ఆమె పరిశీలనగా, తన శక్తితో పోల్చుకుంది తప్పించుకునేందుకు.

ఇది ఎంత విచిత్రం భూమి మీద ఉన్న విచిత్రమైన ప్రాణి స్త్రీ. పురుషులందరూ ఆమెకు ప్రియులు కావాలనుకుంటారు. ఎంత సిగ్గుచేటు, అవమానం అనుకుంది. చిరాకుగా వెనుకకు తిరిగి ఇంటి దారి పట్టింది. ఫారెస్ట్ గార్డ్ కుక్క వలె ఆమె అడుగులను అనుసరించాడు.

**ఇంత వరకు ఆమె చూడని వ్యక్తిని చూసినట్టు. పొడవుగా, బక్కగా, ముదిరి గిడసబారినట్టు వింతగా ఉన్నాడు. అతని చెంపలు లోపలికి పీక్కుపోయి గుంటలు పడి ఉన్నాయి. కాళ్లు చేతులు బలహీనంగా ఎండిపోయాయి పదే పదే మలేరియా బారిన పడిన వాడి వలె. గాలి కోసం అతడు గసపెడుతున్నాడు. అతను గొణిగినట్టుగా పళ్ళు కరచుకొని "మనం పోదాం రా.. పోదాం రా.." అంటున్నాడు. ఆమె పరిశీలనగా, తన శక్తితో పోల్చుకుంది తప్పించుకునేందుకు.**

దాదాపు ఇంటి వరకు వచ్చిన తరువాత

"ఇది ఎవరి ఇల్లు?" అని గట్టిగా అరిచాడు. ఆమె వెనుకకు తిరగకుండా "ఇది మా ఇల్లు" అని సమాధానం చెప్పింది. "మీ నాన్న పేరేంటి?" అన్నాడు. "సుక్కన్న"

"అవునా" అన్నాడతను.

గోరి ఇంటి లోపలికి వెళ్ళింది.

తలుపు దగ్గర మోరీని చూసిన ఫారెస్ట్ గార్డ్ "మీ నాన్న ఎక్కడ" అన్నాడు.

"కొండ పైకి వెళ్ళాడు".

"నేను ఇల్లు శుభ్రంగా ఉందో లేదో చూడాలి. నేను మీ ఇంట్లోకి వచ్చి చూస్తాను" అంటూ సమాధానం కోసం ఎదురు చూడకుండా గుడిసెలో జొరబడ్డాడు. చీకటిగా ఉన్న గుడిసెలో గోరి కోసం తడుముతూ వెతికాడు. అతడి కళ్ళు కామంతో మూసుకుపోయాయి.

అంతలో మనసు మార్చుకుని ఫారెస్ట్ గార్డ్ వెనక్కు తిరిగి వెళుతూ "మీ తండ్రి రాగానే నన్ను కలవమనండి, నేను ఫారెస్ట్ గార్డును, ఒక ఆఫీసర్ని వచ్చాను" అని చెప్పండి అని ఆజ్ఞాపించి వెళ్ళిపోయాడు.

★ ★ ★

ఆరోజు రాత్రి ఒక విషయం జరిగింది రాత్రిపూట చోళ్ళగంజి తాగి గిరిజనులంతా నిద్రించిన తర్వాత గ్రామమంతా అన్ని పనులు ముగించుకొని సద్దుమణిగింది. సుక్కడు తన ఇంటి ముందు అటు ఇటు పచార్లు చేస్తున్నాడు. రోడ్డుపై చీకట్లో ఒక కాలుతున్న చుట్ట వెలుతురు కొద్దికొద్దిగా ముందుకు వస్తూ అతని ఇంటి వద్దకు వచ్చింది. అతడు గ్రామ పెద్ద వద్ద ఉండే ఎట్టి వాడు కాకిగాడని గుర్తుపట్టాడు. ఎవరైనా అప్పు తీసుకొని చెల్లించలేక ఎట్టికి పనులను చేస్తారు. చాలాకాలం అప్పు తీరక చివరికి బానిసగా మిగులుతారు. వారిని అంటారు. వచ్చిన ఎట్టి అంటారు. ఎట్టి కాకిగాడు సుక్కడిని పక్కకు పిలిచి గుసగుసగా ఏదో చెప్పాడు. సుక్కడి పెదవుల నుండి అసమ్మతిగా హుంకారం వచ్చింది.

కానీ ఎట్టివాడు పట్టుదలగా చెప్తూనే ఉన్నాడు.

"అవును అవును ఫారెస్ట్ గార్డ్ వచ్చింది గోరి కోసమే. నన్ను నమ్ము, అతడు అదే కోరుకుంటున్నాడు, నా కళ్ళ మీద ఒట్టు, అతడే, నీ బిడ్డను.. గోరీని.. ఫారెస్ట్ గార్డ్" అంటూ ఆపి ఆపి మాట్లాడుతుంటే.

సుక్కడు ఆగ్రహంతో ఉన్న జంతువు వలె గర్జిస్తూ "నీచుడా ! నిన్ను చూడు, ఏం చేస్తానో?" అని అరిచాడు.

"నీ ఎముకలు అన్నీ విరగ కొడతాను, నువ్వు ఆగు నువ్వు బతికుండగానే నీ తోలు వొలుస్తాను" అని అరిచాడు.

"పిచ్చివాడిలా నామీద అరవకు"

కథ

అంటూ ఏడుస్తూ "నేను కేవలం ఫారెస్ట్ గార్డ్ పంపితే వచ్చాను. నీకు తెలుసు అతని మాట వినకపోతే ఏం జరుగుతుందో. అదే నీకు కూడా జరుగుతుంది. నీకే కాదు మన అందరికీ అదే జరుగుతుంది. అధికారులు అడిగిన దానిని తిరస్కరించ లేము. అది వారికి సమర్పించాల్సిందే. ఒకవేళ వారి కోరిక మన భార్యా పిల్లలు అయినా సరే. ఏదో ఒక వంకన మనను చేతికి బేడీలు వేస్తారు. ఒకరి పొరపాటుకు శిక్ష గిరిజనులంతా తప్పనిసరిగా అనుభవించాల్సి ఉంటుంది" అన్నాడు ఎట్టివాడు.

"తలకాయలేని మాటలు ఇవి" అంటూ గట్టిగా అరిచాడు సుక్కడు. మళ్ళీ "అవును నాకు తెలుసు ఫారెస్ట్ గార్డ్ చాలా శక్తిమంతుడు. మనందరినీ నలిపేస్తాడు కానీ, ఆ శక్తిగల వృక్షం నా అమాయక గోరీనే ఎందుకు ఎంచుకున్నాడు. అతనంటే చాలా మంది పడిచస్తారు. వెళ్ళు వెళ్లి నీ అదృష్టాన్ని పరీక్షించుకో. మన కోళ్లను మన ధాన్యాన్ని అన్నీ తీసుకున్నారు. ఇంకా ఏమి మిగిలి లేదు" అన్నాడు సుక్కడు.

"అంత ధైర్యం చేయలేనయ్యా" అన్నాడు ఎట్టివాడు విచారంగా.

"అతడు గోరీ పట్ల పిచ్చి కోరికతో ఉన్నాడు. ఫారెస్ట్ గార్డ్ నాతో ఏమన్నాడో తెలుసా? అటువంటి అమ్మాయిని ఇంతవరకు చూడలేదని, ఆమె అవయవాలు మృదువుగా వెన్న వలె ఉంటాయని, ఆమె రొమ్ములు కొండలవలె ఉంటాయని, వెళ్లి ఆమె తండ్రికి చెప్పు. ఆమె నాకు కావాలనీ, ఈ పదిరూపాయల కట్టను ఆమె తండ్రికి ఇవ్వు" అని చెప్తూండగానే సుక్కడు లేచి అతని మీద పడి పిడి గుద్దులు కురిపించాడు పెద్దగా అరుస్తూ.

"ఓరి దుర్మార్గుడా ఇదిగో ఇదిగో వాడికి మీ దేవుడికి ఆ మురికి కుక్కకు ఫారెస్ట్ గార్డ్ కు ఇవ్వు. దరిద్రుడా ముందు నా కళ్ళ ముందు నుండి వెళ్ళిపో నిన్ను చంపక ముందే ఇక్కడి నుండి కదులు" అంటూ అరిచాడు. ఒక గిరిజనుడికి కోపం వస్తే మృగంలా మారతాడు. సుక్కడు కోపంతో ఊగిపోతున్నాడు. అతని చూపు మసకబారింది. అతని చేతులు చాలా వేగంగా చెట్లు నరికి, రాళ్ళు ఎత్తి దృఢంగా అయినాయి.

కాకిగాడు నొప్పులతో ఏడుస్తూ చీకటిలో కలిసిపోయాడు, నెమ్మదిగా గుంటనక్కలా.

ఆ తర్వాత అవమానంతో కుంగిపోయాడు సుక్కడు. మొదటిసారి ఫారెస్ట్ గార్డ్ మీద ఉద్రేకం కలిగింది. వెంటనే పోయి లెక్క తేల్చుకోవాలనుకున్నాడు. కానీ ఆలోచిస్తే "ఈ సంగతి ఎవరికైనా తెలిస్తే" అని అనుకోగానే క్రమంగా ఆవేశంగా ఎగురుతున్న తల కిందికి వాలింది. అతడు మట్టి ముద్దలా నిలబడి నెమ్మదిగా పక్కన గోడకు అనుకొని నేలమీద కూలబడ్డాడు. తల రెండు చేతులతో పట్టుకొని, అంతవరకు జరిగిన సంఘటన మళ్లీ గుర్తు చేసుకున్నాడు.

సుక్కడు తాను చేసినది చాలా దూరం వెళ్లినట్టు గ్రహించాడు. "ఇది ఎక్కడ ముగుస్తుంది" అంటూ తనను తాను ప్రశ్నించుకున్నాడు. అది ఒక పరిష్కారం లేని సమస్యగా బాధపడ్డాడు.

★ ★ ★

మరుసటి రోజు ఫారెస్ట్ గార్డ్ ఏమీ జరగనట్టుగా భుజంపై తుపాకీ చేతిలో కర్రతో ఊరు వదిలి వెళ్ళాడు. ఒక్క మాట కూడా మాట్లాడలేదు జరిగిన దాని గురించి. కానీ కొత్త అవమానాన్ని తనలో దాచుకుని వెళ్ళాడతడు. గ్రామస్తులంతా అతని వెంట చాలా దూరం సాగనంపారు.

సుక్కడు అతని పిల్లల జీవితం అలవాటయిన దారివెంట నడుస్తున్న ఎడ్లబండి వలె సాగుతోంది. పగటి వెలుతురు మసగబారే వరకు తండ్రి కొడుకులు కష్టపడి కొండపై చెట్లను నరుకుతున్నారు. వారి గొడ్డళ్ళ చప్పుడు ఆ కొండ ప్రాంతమంతా ప్రతిధ్వనిస్తోంది. సాయం సమయంలో కుటుంబ సభ్యులంతా ఒక్క చోట చేరి అవీ ఇవీ మాట్లాడుకుంటున్నారు. కానీ రాత్రి సమయంలో సుక్కడు కంటి శుక్లాల వల్ల సరిగా చూడలేకపోతున్నాడు. అంతా బాగున్నట్టు హాయిగా నవ్వుకునే సమయంలో ఉన్నట్టుండి ఎవరిదో అదృశ్యమైన హస్తం తన గొంతును నొక్కుతున్నట్లు, ఏదో జరగబోతోంది అని భయం అతన్ని కమ్ముకుంటుంది. కొండ లోయలను కప్పేసి నల్లటి మేఘంలా అతని ముఖాన్ని కప్పేస్తుంది. అతడు భయం కరమైన కోపంతో అధికారులు చేసే దుర్మార్గాన్ని తలుచుకొని బాధపడుతున్నాడు. ఆ సమయంలో ఏదో తెలియని భయంతో రెండు చేతులు జోడించి నుదుటి పై ఉంచుకొని అతను ఏడవడం మొదలు పెడతాడు. గిరిజనుల దేవుళ్ళనందరినీ వేడుకుంటాడు. భూదేవి నాకు ఏ చెడు జరగనీయకుండా చూడండి. మీకు కోళ్లను పావురాలను బలి ఇస్తాను అంటూ ప్రార్థిస్తాడు.

ఒక పక్షం గడిచింది, తర్వాత నెల గడిచింది కానీ ఫారెస్ట్ గార్డ్ తిరిగి రాలేదు. సుక్కడు దేవుళ్లకు కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. ఫారెస్ట్ గార్డ్ బదిలీ అయి ఉంటాడని, రానే రాడని భావించి హాయిగా స్వేచ్ఛగా గాలి పీల్చుకున్నాడు. తండ్రి కొడుకులు అడవిలో చెట్లను నరికే కార్యక్రమం కొనసాగిస్తూనే ఉన్నారు. పని మధ్యలో ఆపినప్పుడు వారు కొండ దిగువన లోయల్లో పశువుల కాపరులు రహస్యంగా సారా కాసే చోటికి వెళ్లి ఇప్పసారా తాగి నృత్యం చేస్తూ కొత్త శక్తిని తమలో నింపుకుంటున్నారు.

ప్రతిరోజు అడవి నరికి విశాలంగా చేస్తున్నారు వారు, నరికే చెట్లు, కాల్చే కలప పాలకులకు సంబంధించిన సంపద అని వారికి తెలియదు. కానీ చట్టం దృష్టిలో వారు నేరస్తులు. లైసెన్స్ ఉన్న దుకాణాల్లో కాకుండా రహస్యంగా మద్యాన్ని కొనడం తాగడం చేసేవారు. వారి తలలు రాళ్ల వంటివి ఏ విషయాలు వారికి తెలియదు. వారి దృష్టిలో అడవిలో కొండలపై పెరిగే సంపదంతా వారికోసమే అనుకుంటారు. సూర్యుని కాంతి, వర్షము, గాలి, నీరు ఎటువంటి నిబంధనలు

లేకుండా వాడుకున్నట్టు అడవి సంపద కూడా తమకోసమే అని భావిస్తారు.

★ ★ ★

ఒక రోజు కొండ శిఖరంపై చాలా మంది కనిపించారు. వారంతా తెల్ల రంగు దుస్తులు ధరించి ఉన్నారు. ఒకరిద్దరి తలపై టోపీలు ఉన్నాయి. ఆ గుంపుకు ముందు నాయకుని వలె ఫారెస్ట్ గార్డ్ తుపాకీ భుజంపై పెట్టుకుని కనిపించాడు.

సుక్కని చేతిలో గొడ్డలి జారిపోయింది. దూరం నుండి వారిని చూడడంతో అతని కళ్ళకి ఒత్తిడి కలిగింది. అనుమానం లేదు అతడు ఫారెస్ట్ గార్డే. అతడు తనకు తానే చెప్పుకున్నట్టుగా "నేనే తప్పు చేయలేదు" అనుకున్నాడు. కానీ ఏదో తెలియని భయం కమ్మేసింది. తన భయాన్ని కప్పిపుచ్చుకోడానికి మళ్లీ గొడ్డలి అందుకున్నాడు, మధ్యలో ఆపిన పనిని కొనసాగిస్తూ వేగంగా చెట్టు నరకడం మొదలుపెట్టాడు. అధికారులకు సుక్కడు చెట్లు నరికే చోటుకి రావడానికి ఎక్కువ సమయం పట్టలేదు.

ఫారెస్ట్ గార్డ్ గట్టిగా "ఏయ్ నిన్నే" అంటూ అరిచాడు.

సుక్కడు అతని ఇద్దరు కుమారులు గొడ్డళ్ళను వదిలేసి, అధికారుల వద్దకు వచ్చి, వీలైనంత నడుము వంచి నమస్కారం చేశారు.

అధికారులను మీరెవరు అని అడిగే ధైర్యం వారికి లేదు. అధికారులంతా ఒకరిని మించి ఒకరు ఒకరు గిరిజనులపై దౌర్జన్యాలను చేస్తారు. సుక్కడు అటువంటి వాతావరణంలో పెరిగాడు. అధికారులకు విధేయులుగా ఉండడమే వారి బాధ్యత. అధికారులు ఎవరైనా సరే గిరిజనులకు సంబంధం లేదు.

వచ్చిన వారిలో ఒకరు "నిన్ను ఈ చెట్లు నరకమని ఎవరు చెప్పారు?" అని అడిగాడు.

సుక్కడు అమాయకంగా "ఫారెస్ట్ గార్డ్ చెప్పాడు నాకు. అతడే అనుమతి ఇచ్చాడు" అన్నాడు.

"ఏమిటి నీకు నేను అనుమతిచ్చానా చెట్లు నరకడానికి" అంటూ ఆశ్చర్యం ప్రకటించాడు ఫారెస్ట్ గార్డ్.

" అబద్ధాలకోరా మోసగాడా నీతిలేని ముండాకొడకా! నీకు ఎంత ధైర్యం? ఇక్కడ నిలబడి నేను అనుమతిచ్చానని చెప్పడానికి" అని అరిచాడు.

"అనుమతి లేకుండా మీ చెట్లను తాకే ధైర్యం ఎవరికి ఉంది సామీ!" అని సమాధానమిచ్చాడు.

"మీరు నాకు చెట్లు నరికి సాగు చేసుకోవడానికి అనుమతి ఇవ్వలేదా, ఒకసారి అడవిలో అడిగాను సామి. మరోసారి గ్రామ పెద్ద ఇంటి వద్ద ఉన్నప్పుడు అతని సమక్షంలో అడిగాను. అప్పుడు మీరు అనుమతి ఇచ్చారు, పని చేసుకోవడానికి. అది నిజం, గ్రామ పెద్ద కూడా విన్నాడు. మీరు ఎందుకు మరిచి పోయారో తెలవదు సార్" అన్నాడు.

అది విన్న సీనియర్ అధికారి అంగీకరిస్తున్నట్లు తల ఊపాడు. ఫారెస్ట్ గార్డ్ వారందరినీ తీసుకుని వేరేవాళ్ళు చెట్లు నరికిన చోటును చూపిస్తూ "ఇదంతా కూడా ఆ వెధవే నరికాడు సార్. నేను చెప్పే నిబంధనలన్నీ పాటించకుండా ఈ ప్రాంతమంతా చెట్లు నరికింది వాడే" అని చెబుతూ ఉండగా, పైల్వాన్ వంటి సోముడు మరో ఇద్దరూ వచ్చి ఫారెస్ట్ గార్డ్ చెప్పేది నిజమని సాక్ష్యమిచ్చారు.

"ఆ పొగరుబోతు సుక్కడూ, అతని కొడుకులిద్దరూ ఎవరి మాట వినరు. వారు ఆశపోతు వెధవలు" అంటూ సాక్ష్యం చెప్పారు.

ఆ తర్వాత చెట్లు నరికిన ప్రాంతమంతా కొలతలు వేశారు. చెట్ల మోడులను లెక్క పెట్టారు. వాటన్నింటిని ఒక కాగితం మీద రాసి నష్టాన్ని అంచనా వేశారు. మిగిలిన గూడెం వాసుల సాక్షాలను సేకరించారు. వారంతా ప్రమాణం చేసి చేసిన నేరాన్ని ధృవీకరించారు. ఆ గిరిజనుల జీవితాలు అధికారుల భయంకరమైన హింస అనే ఆపదతో నలుగుతూ ఉంటాయి.

చట్టంతో దాగుడుమూతలు ఆడటం తెలియకపోతే అడవి ప్రాంతంలో నివసించడం కష్టం. ప్రతి ఒక్కరు తమ ఒంటిపై చర్మాన్ని కాపాడుకోవడానికి అబద్ధాలు మాట్లాడుతారు గొప్ప నమ్మకంగా. వారి జీవితాలలో సహజమైన నిజాయితీ, నిరాడంబరత, జీవితకాలపు భయంతో అభద్రతతో క్షీణించి పోయాయి.

సుక్కడు నేరస్తునిలా నిలబడ్డాడు. ఒక అధికారి రాస్తూంటే పదునైన కత్తితో తన గుండె పై గీరుతున్నట్టుగా భయపడ్డాడు. కాయితం పై రాసేది పెద్ద ముప్పని గిరిజనులలో ఉండే సహజమైన భయం. అంతేకాదు అధికారులు మాట్లాడుతున్న భాష వింటున్న గిరిజనులకు అర్థం కాదు. ఆ అర్థం కాని తనం మరింత భయాన్ని పెంచుతుంది వారిలో. అందుకని తలలూపుతూ ఒప్పందాన్ని అంగీకరిస్తారు. సుక్కని కొడుకులు నిశ్శబ్దంగా తడారిపోయిన గొంతులతో గుడుకలు వేస్తూనే ఉన్నారు.

అప్పుడే తీర్పు వచ్చింది "సుక్కా.. ఇప్పుడు నువ్వు తప్పు చేసినట్టు ఒప్పుకుంటున్నావా? అడవి సంపదను నష్ట పరచినందుకు, నాలుగు వేల రూపాయలు నువ్వు చెల్లించాలి" అన్నాడు అధికారి.

"నేను ఏ తప్పు చేయలేదు ఓ ప్రభువా! నేను ఏ నేరం చేయలేదు. నేను నీ పుస్తకం మీద ప్రమాణం చేస్తాను. నేను అమాయకుడిని. మనుషులను తినే పులి మీద ప్రమాణం చేస్తున్నాను. పులి తోలు మీద నిలబడి ప్రమాణం చేస్తాను, మీరు ఏ ఒట్టు పెట్టమంటే ఆ ఒట్టు పెడతాను. నేను అమాయకుడిని" అంటూ ఉండగా.

"మాట్లాడకు నువ్వు ఈ డబ్బు చెల్లిస్తున్నావా" అన్నాడు అధికారి.

"అంత పెద్ద మొత్తాన్ని నేనెలా చెల్లించ గలను. నాపై దయ చూపండి, జాలి చూపండి" అన్నాడు.

"ఇంక నువ్వు వేసిన నాటకాలు ఆపు. నువ్వు ఎలా చెల్లించవో మేము చూస్తాం. గుర్తుపెట్టుకో ఇప్పుడు మేం వెళ్తున్నాం"

సుక్కడు ఆశ్చర్యపోయాడు. కళ్ళముందే తన చిన్న గుడిసె గాలికి కొట్టుకొని చిన్న చిన్న ముక్కలుగా కొండ ప్రాంతాల్లో వచ్చే సుడిగాలిలో వరదలో

కొట్టుకు పోయింది. ఒక నీలిమేఘం కమ్ముకుంది.

పొలాల్లో ఉండే ఎలుక జీవితమంతా సంపాదించిన దాన్ని ఒక గట్టిగాలి వచ్చి విధ్వంసం చేసినట్లుగా.

★ ★ ★

చెరువు నుండి ఇంటికి వచ్చిన గోరీ నిస్త్రాణంగా కూర్చున్న తండ్రి, అన్నలను చూసి భయపడింది. సుక్కడు, అతని కొడుకులు బిడ్డలు ఒకరిని ఒకరు పట్టుకొని గొల్లున ఏడుస్తూనే ఉన్నారు. వారి గోడును ఎవరూ పట్టించుకోలేదు.

అందరికీ తెలిసిన విషయమే, కానీ వీరిని ఓదార్చడానికి వస్తే, అధికారులు వారిని ఏం చేస్తారో అని భయం. పులి నోట్లో తల పెట్టే సాహసం ఎవరు చేయరు కదా.

అలుపు వచ్చేవరకు, గొంతు ఎండిపోయే వరకు పెద్దగా ఏడ్చి, మెల్ల మెల్లగా అందరూ నిశ్శబ్దంగా కూర్చున్నారు. రాత్రి గడిచిపోతుంది, ఎవరు ఏమి తినలేదు.

అర్ధరాత్రి దాటిన తర్వాత, వారి ఇంటి వైపు కొన్ని నీడలు కదులుతూ వచ్చాయి. ఇంటి చుట్టూ తిరిగి, గుడిసె వెనక నుండి తలుపు తియ్యమని గుసగుసగా అడిగాయి.

సుక్కడు తడకకున్న కర్ర తీయగానే, కులపెద్ద అతనితోపాటు మరో నలుగురు లోపలికి వచ్చారు. సానుభూతిగా తలాడిస్తూ ఇటువంటిదే ఏదో జరుగుతుందని ముందే చెప్పాను కదన్నా! అంటూ మొదలు పెట్టాడు. కుల పెద్ద మిగిలిన వారు వంత పాడారు.

ఇదంతా చేస్తున్నది ఆ ఫారెస్ట్ గార్డే, మనకందరికీ ఆ విషయం తెలుసు అన్నాడు ఏదోరకంగా మాటలు మొదలు పెట్టడానికి.

సుక్కడు నెమ్మదిగా నోరు విప్పి "మీ అందరికి తెలుసు కదా! ఫారెస్ట్ గార్డ్ చెప్తేనే కదా! చెట్లు నరికాను. అతను నా వద్ద డబ్బు తీసుకున్నాడు. మీకు తెలుసు కదా! మీరు ఎందుకు మాట్లాడలేదు" అన్నాడు.

వారిలో ఒకరు మమ్మల్ని ఎందుకు బదనాం చేస్తావు. పులికి ఎదురు చెప్పి మనం బ్రతకగలమా? మాకూ భార్య పిల్లలు ఉన్నారు కదా! అన్నారు.

సరే సుక్కన్నా భయపడకు నాలుగు వేల డబ్బులు ఇస్తే కేస్ కొట్టేస్తారు. ఏదో ఒక రకంగా డబ్బు చెల్లించు అన్నారు.

"అంత డబ్బు జీవితంలో ఎన్నడూ చూడని ఒక గిరిజనుణ్ణి, నా దగ్గర అంత డబ్బు లేదు, నావల్ల కాదు" అన్నాడు సుక్కడు.

వచ్చిన వాళ్ళలో ఒకడు "నీకు నేను ఒక ఉపాయం చెప్తాను. నువ్వు ఎంతో దూరం వెళ్ళనవసరం లేదు ఇక్కడికి కొన్ని మైళ్ల దూరంలో కొండ దగ్గర, పటేల్ అనే వ్యాపారస్థుని దగ్గర డబ్బు చాలా ఉన్నది. అతనికి మనుషులు అవసరం ఉన్నది. కనుక మీ ఇంట్లో ఇద్దరు అతని వద్ద పనికి కుదిరినట్టయితే, కొంత డబ్బును మీకు అప్పు ఇస్తాడని చెప్పాడు.

సుక్కనికి ఆ వ్యాపారి విషయం అంతా తెలుసు. గతంలో ఒకరికి నూట పాతిక రూపాయలు అప్పు పెట్టి చక్రవడ్డీతో లెక్కకట్టి కొడుకులు, మనవళ్ళతో గొడ్డు చాకిరీ చేయించుకుని, అప్పు తీర్చలేదని చాలా వేధించాడు. అది గుర్తుకొచ్చి.

"వద్దు వద్దు" అంటూ గట్టిగా అరిచాడు.

వచ్చినవాళ్లు ఒకళ్ళ మొహాలు ఒకళ్ళు చూసుకుని బయటకి వెళ్లి కాసేపు మాట్లాడుకొని మళ్ళీ లోపలికి వచ్చారు. చూడు సుక్కా తెలివి తక్కువగా ఆలోచించకు. డబ్బులు కట్టనట్లయితే, నీ చేతికి సంకెళ్ల వేస్తారు. జైల్లో పెడతారు. మీకు సంబంధించిన అన్నింటినీ జప్తు చేస్తారు. ఇల్లు కూలకొడతారు. ఇంట్లో ఉన్న వస్తువులను వేలం వేస్తారూ. ఇదంతా ఒక ఎత్తయితే నువ్వు జైలుకు పోతే, కులం తప్పు పడుతుంది. కులాన్ని కోల్పోతావు. మళ్లీ కులంలోకి రావాలంటే చాలా ఖర్చవుతుంది. ఆలోచించుకో అన్నాడు.

అది విన్న తర్వాత 'జైలు, సంకెళ్ళు, ఇల్లు కూలగొట్టడం, కులం పోగొట్టుకోవడం, అన్నిటికంటే వ్యాపారి వద్దకు ఎట్టికి వెళ్లడమే మంచిది

**సుక్కడు** తడకకున్న కర్ర తీయగానే, కులపెద్ద అతనితో పాటు మరో నలుగురు లోపలికి వచ్చారు. సానుభూతిగా తలాడిస్తూ ఇటువంటిదే ఏదో జరుగుతుందని ముందే చెప్పాను కదన్నా! అంటూ మొదలు పెట్టాడు. కుల పెద్ద మిగిలిన వారు వంత పాడారు. ఇదంతా చేస్తున్నది ఆ ఫారెస్ట్ గార్డే, మనకందరికీ ఆ విషయం తెలుసు అన్నాడు ఏదోరకంగా మాటలు మొదలు పెట్టడానికి.

అనుకున్నాడు. వడ్డీ వ్యాపారి దగ్గర తెచ్చే రుణాన్ని, తండ్రి కొడుకులు ముగ్గురు కష్టపడితే తీర్చ వచ్చునని అనుకున్నాడు.

కానీ అంతలోనే మనసు మార్చుకుని లేదు నాయక తల్లిలేని నా పిల్లలను బానిసలుగా వ్యాపారి వద్దకు పంపలేను అన్నాడు. అప్పుడు "సరే మంచిది. రాత్రంతా నీకు సమయం ఉంది. ఆలోచించుకొని ఏ విషయం రేపు చెప్పు" అంటూ వెళ్లిపోయారు వాళ్ళు.

రాత్రి పగలు తేడా లేకుండా సుక్కడి జీవితం అంధఃకారమయింది. తన భార్యతో కలిసి తన పిల్లల కోసం ఎంత కష్టపడ్డారో, ఎలా పిల్లల్ని పెద్ద చేశారు అన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు. భార్య దూరం అయిన తర్వాత వచ్చిన పెద్ద కష్టం ఇది.

ఒంటరిగా ఏమీ చేయలేని పరిస్థితి. చనిపోయిన తన భార్య తోడుంటే బాగుండు అనిపించిందతనికి. ఆ రాత్రంతా తెరిచే ఉన్న కళ్ళముందు ఏవేవో దృశ్యాలను చూస్తున్నాడు. అడవంతా విపరీతమైన వర్షంతో ముంచెత్తుతోంది పెద్ద పెద్ద చెట్లు వేర్లతో సహా కూలిపోతున్నాయి. సుడిగాలితో కూడిన వర్షం ఇళ్లను, పంటలను, పొలాలను సర్వ నాశనం చేసింది.

ఫారెస్ట్ గార్డు కుట్రతో తమను నాశనం చేసినట్టు.

చేజారి పగిలిన గుల్లస్తాలో పూలవలె గోరీ, మోరీలు..

# వల్లనే.... వల్లనే...

**(28వ పేజీ తరువాయి)**

రెండెకరాలు బొచ్చెర్వెనక ఎకరం పెద్దోనికి ఇచ్చింద్రు. బొచ్చెర్వెనక ఎకరం మొకాశి కుంట కాడ రెండెకరాలు చిన్నోనికి చెందేటట్లు ఫైస్లా చేసింద్రు. తల్లిదండ్రికి ఎలుక చెట్టు పంపు కాడి ఎకరం ఇచ్చింద్రు. ఎవల పాలు వాళ్లకు అయింది. ఓ నాత్రి సాయబాన్ల గడెంచలల్ల ఒరిగింద్రు పోషమ్మ, పోషమల్లు. 'ఇగో ఇంటానవానయ్యా' గుసగుసగా అన్నది ఎల్లమ్మ. కోడండ్లు నూనెల కోడిగుడ్డేసి పక్కకువెట్టి ఉల్లిగడ్డలు మనకేస్తరు. కార్చిన గుడ్డు భర్తలకు పెట్టుకుంటంద్రు. దానికే మనం మురిసిపోతం.. అంటూ భర్తకు చెప్పుకొచ్చింది. ఇగో పెండాల్లచ్చమ్మ దగ్గర రెండు వేలు పెట్టిన తెచ్చుకొని ఎప్పుడన్నా ఏమన్న తినబుద్ది ఐతే కొనుక్కచ్చుకొని తిను.. హితబోధ చేసింది పోషమ్మ. మిట్టమధ్యాహ్నం పొలానికి నీళ్లు కట్టుడు ఐపోయింది. ఏం మాయ రోగం ఏ పిశాచి మాయనో ఒక్కసారి పెనుగాలి ఉరుము లతో పిడుగు పాటుకు తనకుతానే ఇరుచుకుపడి నేలకొరిగాడు పోచమల్లు.

పోషమ్మకు కష్టాలు ఆనాటిసంది మొదలైనయి. కోడండ్ల చేతి గంజయింది. పెద్ద కోడలంటేనే ఇష్టమని చిన్నది.. చిన్నకోడలంటేనే ఇష్టమని పెద్దది. గోడగ్గొట్టిన బంతోలె ఆడుకుంటాంద్రు. చిన్నోడు ఓనాడొచ్చి.. అవ్వా నీకు ముండ గానమొత్తది గదనే.. నువ్వు ఎక్కడ ఉంటే అక్కడ్నే ఇయ్యరాదే అన్నడు. నోట మాట రాలె ఎల్లమ్మకు. అనాలనుకున్నా నాలిక అటే మల్సకపోయింది. అప్పుడే కైకిలి డబ్బులకొచ్చిన రాయలచ్చమ్మ చెవుల పడనే పడ్డది. 'ఏందిరా పోరగాండ్లు మీ అయ్య సంపాయించిన భూములల్ల వచ్చే పైసలు సాలయార మీకు.. ఇంకా అవ్వనేం అడుగుతంద్రు' అని గట్టిగ అడిగింది. పోషక్కా ...నా కొడుకు గిట్లనే..అవ్వా నీ పించని పైసలతోని నా కొడుక్కు అంగి లాగు కొనియ్యరాదే అంటడు. కూర అనడు నార అనడు. ఉప్పు, మిరపకాయ, బియ్యం, కరెంటు బిల్లు, డిష్షు బిల్లు అన్ని నాకు నేనే కట్టుకునుడు. రెండు వేలు సరిపోతన్నయా అని ఒక్కనాడు అడగలే. మీ మరిది ఉంటే గిన్ని కష్టాలొచ్చునా అక్కా... అంటూ కండ్ల నీళ్లు చీర కొంగుతో ఒత్తుకుంటూ రాయలచ్చమ్మ ఆవేదన వ్యక్తం చేసింది.

ఎండాకాలం మిరపకాయలు పట్టిచ్చు కునుడు, చింతపండు కొట్టుకునే పనులల్ల రికాం లేకుంట ఉంటరు. ఊరిమీద ముసలోల్లకు ఏడ పొద్దుపోతది. ఎల్లమ్మ చింతపండు కొట్టే సప్పుడు విని రాయ లచ్చమ్మ, పోషమ్మ, చంద్రమ్మ ఇత్తులు తీసుటానికి కూసున్నరు. ముచ్చట మీద ముచ్చట్లు వస్తయి. ఇండ్ల చంద్రమ్మ కొద్దిగ కొంటెది. ఎనుకట నా కోడలసోంటిదే కోడలుం డెనట. కొడుకు బాయికాన్నుంచి ఒచ్చి అవ్వకు బువ్వ పెట్టినవా అని పెండ్లాన్ని అడిగేదట. వల్లనన్నదయ్యా ..అని చెప్పేందట. ఇగజూడు నీ ముందటనే అడుగుత అని అత్త చెవ్వు దగ్గరికి పోయి గుసగుసగా.. అత్తా అత్తా కండ్లకు కాటిక పెట్టుకుంటవా అన్నదట. వొల్లనే... అన్నదట. అత్తా అత్తా పండ్లకు దాశన పెట్టుకుంటవా అన్నదట. ఒల్లనే అన్నదట. ఇట్లా కొంటె కోడలు తిండే ఒద్దంటాంది మీ అవ్వ అంటూ రుజువు చేసింది. ఒక్కసారి అందరి ముఖాలు వెలిగి పోయాయి.

---

# అనామక రాత్రి



**లక్ష్మీ కందిమళ్ళ, 89196 99815**

ఎండిన నదిలా
పాదముద్రలకై వెతుకులాట

గాలిని శ్వాసించలేని క్షణాలలో
రెక్కలు కదిలించలేని నిస్సత్తువ

నవ్వలేని తనంతో
నల్లని నీడలు దృశ్యమానమై
గాయాల కథలు

ఆకు రాలుతున్న శబ్దం
కథేదో చెబుతోంది

రెప్పలపై భారంగా వాలిన నిశ్శబ్దం
అనామకంగా కనుమరుగవుతున్న రాత్రి.

## కవిత్వంతోనే పరిపూర్ణత...



కవిత్వంతో స్నేహం పరిపక్వతను ప్రసాదించి జీవితానికి పరిపూర్ణతనిస్తుందని ప్రముఖ కవయిత్రి శీలా సుభద్రాదేవి అన్నారు. ఫిబ్రవరి 19న నిజామాబాద్ జిల్లా మామిడిపల్లి అపురూప ఆడిటోరియంలో జరిగిన విజయాకిషన్‌రెడ్డి రాసిన "కళలను చిలికిన కాలం", సుకేశిని రాసిన "ఎచట దాగితివో" పుస్తకాల ఆవిష్కరణ సభకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మాట్లాడుతూ సాహిత్యం సమాజానికి అన్ని కాలాల్లో నడిపించే దీపం అని అన్నారు. ఘనపురం దేవేందర్ "కళలను చిలికిన కాలం పుస్తకాన్ని, కాసర్ల నరేశ్ "ఎచ్చట దాగితివో" పుస్తకాన్ని సమీక్షించారు. ప్రముఖ కవయిత్రి నెల్లుట్ల రమాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా ప్రొఫెసర్ నిర్మలజ్యోతి, ప్రముఖ పారిశ్రామికవేత్తలు రాజారెడ్డి, కిషన్ రెడ్డి, డాక్టర్ అమృతలత, డాక్టర్ త్రివేణి, డాక్టర్ గణపతి అశోక్ శర్మ, రమణాచారి, కరక రమేశ్ పటేల్, చెన్న శంకర్, కందకుర్తి ఆనంద రావు, సాయి లక్ష్మి, ప్రభ, వసంత, సుజాత, శ్రేయ, తదితరులు పాల్గొన్నారు.



## హనుమద్దాసు కీర్తనల ఆవిష్కరణ

ఫిబ్రవరి 27న మహబూబ్ నగర్ జిల్లా మన్యంకొండ వెంకటేశ్వరస్వామి దర్బార్ హాల్లో జరిగిన చేపూరి హనుమద్దాసు కీర్తనల ఆవిష్కరణ గంగోత్రి ఆశ్రమ అధిపతి ఆచార్య రామానుజ దాసు ఈ కార్యక్రమంలో ఆవిష్కర్తగా పాల్గొన్నారు. ప్రముఖ కవి ఘనపురం దేవేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రసిద్ధ సంగీత దర్శకులు కే. రామాచారి మాట్లాడుతూ 200 సంవత్సరాల క్రితమే హనుమద్దాసు ప్రజల భాషలో కీర్తనలు రచించి పామరుల బాధలను భగవంతుడికి భావుకతతో తెలియజెప్పిన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో పాల్గొన్న మరో అతిథి ప్రసిద్ధ కవి వి.నర్సింహారెడ్డి మాట్లాడుతూ భగవంతుడిని ప్రసన్నం చేసుకోవడం, భగవంతున్ని దగ్గరగా చూసుకోవడం భజనల ద్వారా సాధ్యమవుతుందని, భగవంతునికి భక్తులకు మధ్య వారధిగా భజనలు నిలుస్తాయని అభివర్ణించారు.



## గోపగాని 'శతారం' విమర్శనా సాహిత్యానికి కొత్త చేర్పు

**- ఎమ్మెల్సీ బండా ప్రకాశ్**

తెలుగు విమర్శనా సాహిత్యానికి కొత్త చేర్పు గోపగాని రవీందర్ 'శతారం' పుస్తకమని ఎమ్మెల్సీ బండా ప్రకాష్ అన్నారు. ఫిబ్రవరి 28న తన వరంగల్ క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు గోపగాని రవీందర్ రచించిన శతారం పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాహిత్యాన్ని సుసంపన్నం చేయడానికి కవులు రచయితలు కృషి చేయాలని అన్నారు. ఓరుగల్లు సాహితీ సర్వస్వం, నిఘంటువు కోసం ప్రయత్నం చేస్తున్నానని, సృజనకారులు అందరు సహకరించాలని కోరారు. గోపగాని సాహితీ విమర్శనా వ్యాసాల్లో ఉద్యమ సాహిత్యం మీద, అస్తిత్వ వాదాల సాహితీ అంశాలు మీద వివరించినట్లుగా పరిశోధకులకు కరదీపికగా ఈ గ్రంథం ఉపయోగపడుతుందని అన్నారు.

## సైరన్... చారిత్రక నవల



సింగరేణి కార్మికుల ఉద్యమాన్ని 'సైరన్' నవల కళ్లకు కడుతుందని ప్రముఖ రచయిత పి.చంద్ అన్నారు. నాంపల్లిలోని తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో అల్లం రాజయ్య రచించిన 'సైరన్' నవలను ఫిబ్రవరి 27న ఆయన ఆవిష్కరించారు. ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 'సైరన్'ను చారిత్రక నవలగా అభివర్ణించారు. వట్టికోట ఆళ్వారుస్వామి రచించిన 'ప్రజల మనిషి' నవలలోని కంఠీరవం, 'సైరన్' నవలలోని మొగిలి పాత్రల మధ్య సారూప్యతను విశ్లేషించారు. పీపుల్స్ క్రానికల్‌గా, ప్రజా ఉద్యమాల చరిత్రను ప్రజల దృష్టి కోణం నుంచి సాహిత్య సృజన చేస్తున్న అల్లం రాజయ్య కృషి అభినందనీయమని కొనియాడారు. సాహిత్య విశ్లేషకుడు ఏకే ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో దేశమంతా మోగాల్సిన 'సైరన్' యిదని వ్యాఖ్యానించారు. ఉత్తర తెలంగాణ ప్రాంత చరిత్ర అంతా 'సైరన్' నవలలో కనిపిస్తుందని కథాసాహితీ నిర్వాహకుడు వాసిరెడ్డి నవీన్ పేర్కొన్నారు. రచయిత ఖదీర్‌బాబు మాట్లాడుతూ... జీవభాషతో వెలువడిన ఈ నవలను సినిమా లేదా వెబ్‌సిరీస్ ద్వారా దృశ్యరూపం చేయాల్సిన అవసరం ఉందన్నారు.




## మొలకలు

విశ్వ శ్రీ

**విజయం పబ్లికేషన్స్**
హైదరాబాద్
వెల : రూ.200/-




## మలయ సమీరం

వెల్మల జయపాల్ రెడ్డి
సెల్ : 9441168976

వెల : రూ.100/-




## పూలపాటలు

తెలంగాణ సాహిత్య అకాడమి

**తెలంగాణ సాహిత్య అకాడమి**
హైదరాబాద్
వెల : రూ.25/-




## చుక్కపొద్దు

జిందం అశోక్

వెల : రూ.100/-




## ఇప్పుడే వస్తా

హనీఫ్

**నవోదయ బుక్ హౌస్**
హైదరాబాద్
వెల : రూ.100/-




## రఘువంశ మహాకావ్యము

జ్ఞానశ్రీ ఆర్యవిద్యా గురుకులం హైదరాబాద్ వారి సౌజన్యంతో

**ఎమెస్కో బుక్స్**
హైదరాబాద్
వెల : రూ.400/-




## దిక్చక్రం

అడెపు లక్ష్మీపతి

**ఆదిత్య (లిటరరీ) పబ్లికేషన్స్**
హైదరాబాద్
వెల : రూ.300/-




## పెన్నా సరాలు

పెన్నా శివరామకృష్ణ
సెల్ : 9440437200

**నవతెలంగాణ బుక్ హౌస్**
హైదరాబాద్
వెల : రూ.150/-




## లజ్జ

తస్లీమా నస్రిన్

**నవచేతన బుక్ హౌస్**
హైదరాబాద్
వెల : రూ.150/-



## భండారు అచ్చమాంబ

(1874 - 1905)

తొలి తెలుగు కథా రచయిత్రి . ఈమె ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం
కూర్చిన కొమర్రాజు వేంకటలక్ష్మణరావుకు అక్క.
అచ్చమాంబ గురజాడ అప్పారావు కన్నా పదేళ్ళ ముందే
1902 నవంబరు నెలలో రాసిన కథ 'ధన త్రయోదశి'ని
'హిందూ సుందరి' పత్రికలో ప్రచురించారు.
ప్రథమ స్త్రీవాద చరిత్ర కారిణి.